



కరీంనగర్ 19-1-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 159

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



1,58,48,000

ఇదీ 'ఈనాడు' పాఠకుల సంఖ్య

- ప్రాంతీయ భాషా పత్రికల్లో 4వ స్థానం
- దేశవ్యాప్త అగ్రశ్రేణి 10 దినపత్రికల్లో 9వ స్థానం
- తొలి 10 స్థానాల్లో ఆంగ్ల పత్రికలకు దక్కని చోటు
- 'ఇండియన్ రీడర్‌షిప్ సర్వే-2017'లో వెల్లడి

దిల్లీ

రోజూ 1,58,48,000 మంది పాఠకులు 'ఈనాడు' చదువుతున్నారని 'ఇండియన్ రీడర్‌షిప్ సర్వే-2017'లో తేలింది. ప్రాంతీయ భాషా పత్రికల్లో దేశంలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. పాఠకుల సంఖ్య పరంగా మొత్తం అన్ని పత్రికల్లో 'ఈనాడు' పత్రిక దేశంలోనే తొమ్మిదో స్థానం దక్కించుకొంది. సర్వే ఫలితాల్లో హిందీ, ప్రాంతీయ భాషా పత్రికలే హవా చాటాయి. ఆంగ్ల పత్రికలను తోసిరాజని మొదటి 10 స్థానాలనూ అవే దక్కించుకున్నాయి. ప్రపంచవ్యాప్త పోకడలకు విరుద్ధంగా విశేష వృద్ధిని నమోదు చేసుకుంటూ గత నాలుగేళ్లలో 11.2 కోట్ల మంది కొత్త పాఠకుల్ని వార్తా పత్రికలు సంపాదించగలిగాయి. దీంతో మొత్తం పాఠకుల సంఖ్య 40.7 కోట్లకు చేరుకుందని ఐ.ఆర్.ఎస్. వెల్లడించింది. వీటిలో హిందీ పత్రికలదే చెప్పుకోదగ్గ స్థానం. ఆ పత్రికల పాఠకులు 45% పెరిగి 17.6 కోట్లకు చేరారు. అదే సమయంలో ఆంగ్ల పత్రికల పాఠకులు 10 శాతమే పెరిగి 2.8 కోట్లకు చేరుకున్నారు.

ప్రథమ స్థానం దైనిక్ జాగరణ్‌దే

అన్నింటికంటే అగ్రస్థానంలో ఉన్న దైనిక్ జాగరణ్ పత్రికకు 7,03,77,000 మంది పాఠకులున్నారు. ఆ తర్వాత స్థానాల్లో హిందుస్థాన్ (5,23,97,000), అమర్ ఉజాలా (4,60,94,000), దైనిక్ భాస్కర్ (4,51,05,000), దినతంతి (తమిళం-2,31,49,000), (మిగతా 2లో)

పత్రికలు చదివేవారు 39% మంది

సర్వే నివేదిక ప్రకారం భారతీయుల్లో (12 ఏళ్లు పైబడిన వారు) 39% మంది వార్తాపత్రికలను చదువుతున్నారు. అరకోటి పైబడిన జనాభా ఉన్న నగరాల్లో మొత్తం పాఠకుల్లో 20% మంది ఆన్‌లైన్లో పత్రికల్ని చూస్తున్నారు. ముద్రణ పరిశ్రమకు ఉజ్వల భవితవ్యం ఉంటుందనేది తాజా గణాంకాలతో కచ్చితంగా తెలుస్తోందని ఎంఆర్‌యూసీ ఛైర్మన్ ఆశిష్ భాసిన్ పేర్కొన్నారు.

దేశానికి రెండో రాజధానిగా సమ్మతమే



- హైదరాబాద్‌ను చేస్తామంటే స్వాగతిస్తాం
- భారతీయ సంస్కృతికి ప్రతీక ఈ నగరం
- రాష్ట్రాలకు మరిన్ని అధికారాలివ్వాలి
- అవి బలోపేతమైతేనే దేశాభివృద్ధి
- ఇప్పుడున్న రిజర్వేషన్లు సరిపోవు
- జనాభా ప్రాతిపదికన కోటా ఉండాలి
- తెలంగాణను ఆంధ్రాతో పోల్చవద్దు
- ప్రగతిభవన్ కేసీఆర్ సొంతం కాదు.. ముఖ్యమంత్రి అధికారిక నివాసం
- రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం
- వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ కలవం..
- భవిష్యత్తులో రైతు ఆత్మహత్యలుండవు
- 'ఇండియాటుడే' సదస్సులో సీఎం కేసీఆర్

-2లో

సంక్షేమ కార్యక్రమాలు అద్భుతం

తెలంగాణలో సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా సాగుతున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలోనైనా పారిశ్రామిక అనుమతులకు సమస్యలుంటాయి. ఇవేమీ లేకుండా పక్షం రోజుల్లోనే అనుమతులు ఇచ్చేలా టీఎస్ఐపాస్ తెచ్చాం. దీని ద్వారా 5,000 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చాం. ఇందులో 2000 ఉత్పత్తులను ప్రారంభించాయి. విద్యుదుత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించాం. 2020 నాటికి రాష్ట్ర విద్యుదుత్పత్తి 24 వేల మెగావాట్లకు చేరుతుంది.

తెలుగు, తెలంగాణ వేర్వేరు

దాదాపు 14 ఏళ్లపాటు సాగిన తెలంగాణ మహోద్యమాన్ని పూర్తిగా అహింసాయుతంగా నిర్వహించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించాం. నాలుగువేల గంటల పాటు అంతర్మథనం తర్వాత ఉద్యమంలోకి దిగాం. ఈ ఉద్యమం కేవలం భావోద్వేగాలతో కూడుకున్నది కాదు. దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాలపై తిరుగుబాటుకు ప్రజలంతా స్వచ్ఛందంగా కదిలి వచ్చారు.

తెలంగాణ జీవన విధానం వేరు

తెలంగాణ విడిపోవడం వల్ల తెలుగువారికి గుర్తింపు తగ్గిందనేది వితండ వాదం. తెలుగు గుర్తింపు, తెలంగాణ గుర్తింపు వేరు. మా సంస్కృతి, సంప్రదాయాలు, భాష, యాసలు, జీవనవిధానం వేర్వేరు. తెలంగాణను ఏపీతో కలపడమే ఒక తప్పిదం. ఏపీ విభజనను బాధాకర సంఘటనగా చూడొద్దు. ఇది తెలంగాణ దక్కిన విజయంగా భావించాలి.

పన్ను భారం ఇంకాస్త తగ్గింపు

- 29 వస్తువులు, 54 సేవలపై తగ్గిన జీఎస్టీ
- వజ్రాలపై 0.25 శాతమే
- బిందు సేద్యం పరికరాలు, పాత వాహనాలు, వేప పూత ఎరువులపైనా తగ్గుదల
- ఈ నెల 25 నుంచి అమల్లోకి
- రిటర్నుల సమర్పణ మరింత సరళీకృతం
- జీఎస్టీ మండలి నిర్ణయాలు



జీఎస్టీ మండలి సమావేశంలో అరుణ్‌జైట్లీ తదితరులు

దిల్లీ: వినియోగదారులకు ఊరట కలిగించేలా పన్ను భారం తగ్గిస్తూ గురువారం ఇక్కడ జరిగిన వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) మండలి నిర్ణయించింది. 29 వస్తువులు, 54 విభాగాల్లోని సేవలపై పన్ను తగ్గించింది. ఈ నిర్ణయం ఈ నెల 25 నుంచే అమల్లోకి రానుంది. చిన్నవ్యాపారులపై పన్ను మదింపు భారం తగ్గేలా జీఎస్టీ రిటర్నుల దాఖలు ప్రక్రియను సరళీకృతం చేయడంపైనా చర్చ జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక (మిగతా 2లో)

పన్ను తగ్గిన వస్తువులు

28% నుంచి 18 శాతానికి..



పాత, ఇదివరకే ఉపయోగించిన వాహనాలు (మధ్య, పెద్ద తరహా కార్లు, ఎస్‌యూవీలు) విక్రయించే వ్యాపారుల లాభాలపై పన్ను తగ్గింపు. అయితే వారు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సౌకర్యాన్ని ఉపయోగించుకోకుండా ఉంటేనే ఇది వర్తిస్తుంది. వీటిపై ఇంతవరకు 15 శాతం కాంపెన్సేషన్ సెస్ ఉండగా, దాన్ని పూర్తిగా ఎత్తివేశారు.

- జీవ ఇంధనం ఉపయోగించి కేవలం ప్రజా రవాణా కోసం మాత్రమే వినియోగించే బస్సులు

28% నుంచి 12 శాతానికి..

పాత వాహనాలు (మధ్య, పెద్ద తరహా కార్లు, ఎస్‌యూవీలు తప్ప) విక్రయించే వ్యాపారుల లాభాలపై పన్ను తగ్గింపు. వారు కూడా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను (మిగతా 2లో)

ఓరుగల్లుకు మోనోరైలు

- కాజీపేట-వరంగల్ మధ్య రాకపోకలు
- ప్రపంచంలోనే ప్రత్యేకంగా ఉండేలా హైదరాబాద్ ప్రాజెక్టు
- పరిశీలనకు మంత్రి కేటీఆర్ స్విట్జర్లాండ్ పర్యటన



ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో మోనోరైలు సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆలోచనలు ఆరంభమయ్యాయి. ఇక్కడ ఐటీ రంగం విస్తరణకు ఇప్పటికే అడుగులు పడ్డాయి. ఇదే క్రమంలో ప్రపంచస్థాయి రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సర్కారు యోచిస్తోంది. "కాజీపేట, వరంగల్ మధ్య 15 కిలోమీటర్ల మేర రైలు నడిపేందుకు... స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటర్నేషనల్ కామన్ కంట్రీస్ సిస్టమ్, పోలాండ్‌కు చెందిన ఐడీస్ సంస్థలు సంయుక్త అధ్యయనం నిర్వహించాయి. ఆయా ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది" అని హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ- హైదరాబాద్, వరంగల్ నగరాల్లో మోనోరైలు సేవల్ని ప్రారంభించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు. 'రాష్ట్రంలో మోనోరైలు సేవల్ని ప్రారంభించేందుకు రెండు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. 'నిర్మించు-నిర్వహించు-అప్పగించు' పద్ధతిలో ప్రాజెక్టు చేపడతామన్నాయి. హైదరాబాద్, వరంగల్‌లో ప్రాథమిక సర్వే చేపట్టాయి. స్విట్జర్లాండ్‌లో అందిస్తున్న (మిగతా 2లో)



పాంచ్ పటాకా!

- ఐదోసారి అగ్ని-5 క్షిపణి పరీక్ష విజయవంతం
- సైన్యం అమ్ములపొదిలో చేరడానికి రంగం సిద్ధం
- శాస్త్రవేత్తలను అభినందించిన రక్షణ మంత్రి

-2లో

ప్రత్యక్ష విధుల్లోకి మహిళా ప్రతినిధులు!

- నేరుగా పనిచేసేవారు పదేళ్లపాటు పదవుల్లో కొనసాగే అవకాశం
- సర్పంచి, వార్డుసభ్యుల స్థానాలకు మరోసారి రిజర్వేషన్ వర్తింపు ఫలితం...
- తద్వారా పంచాయతీ పాలనలో మార్పొస్తుందని సర్కారు భావన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పంచాయతీల్లో రిజర్వేషన్ల విధానం మారబోతున్నందున... మహిళా ప్రతినిధులు ఇకపై తెరముందుకొచ్చి, ప్రత్యక్షంగా విధుల్లో పాల్గొనే సూచనలు కనిపిస్తున్నాయి. 'పదవి ఉండేది ఐదేళ్లే కదా' అన్న నైరాశ్యాన్ని వీడి... బాగా పని చేసి మరో ఐదేళ్లు పదవిలో కొనసాగాలన్న స్ఫూర్తిని పొందగలుగుతారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాల్లో ఇప్పుడున్న ఐదేళ్ల రిజర్వేషన్ కోటాను పదేళ్లకు వర్తింపజేయాలన్న నిర్ణయంతో- పంచాయతీ పాలనలో మార్పులకు ఆస్కారముంటుందని సర్కారు భావిస్తోంది.


రాష్ట్రంలో అత్యధిక పంచాయతీల్లో మహిళా ప్రతినిధుల స్థానంలో వారి భర్తలు, ఇతర కుటుంబ సభ్యులే చక్రం తిప్పుతున్నారు. సర్పంచులు, వార్డుసభ్యుల స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించే విధానం అమలవుతోంది. వీరికి కేటాయించకుండా మిగిలిన స్థానాల్లో ఎవరైనా పోటీ చేయొచ్చు. ఈ నాలుగు రకాల సీట్లలో సగం మహిళలవి. తమకు కేటాయించని సీట్లలో కూడా వారు తలపడొచ్చు. ప్రస్తుతం ఆయా స్థానాలకు ఒక విడతే (ఐదేళ్లే) రిజర్వేషన్ వర్తిస్తోంది. ఆ తర్వాత కోటా మారిపోతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ పురుష ప్రజాప్రతినిధులు కూడా తమ పదవులు ఐదేళ్లేనన్న భావనతో ఉన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం... ఒక్కో స్థానంలో రిజర్వేషన్‌ను రెండు విడతలకు కొనసాగిస్తూ కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురాదలిచింది. సక్రమంగా పనిచేయకుంటే, రెండో విడత నెగ్గలేమనే అభిప్రాయం మహిళా ప్రజాప్రతినిధులకు కలుగుతుందనీ... తద్వారా వారు మెరుగ్గా పనిచేస్తారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తగా ఆవిర్భవించే 4వేల పంచాయతీలనూ లెక్కలోకి తీసుకుంటే- ఈ ఎన్నికల ద్వారా వచ్చే మహిళా ప్రతినిధుల సంఖ్య 55వేలకు పైనే ఉంటుంది. ఒకవేళ సర్పంచి పదవికి పరోక్ష ఎన్నికలను నిర్వహిస్తే, ఈ సంఖ్య ఆరువేల మేర తగ్గుతుంది.

రాష్ట్రంలో ప్రస్తుత మహిళా ప్రతినిధుల సంఖ్య ఇదీ...

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 6,784 మంది; ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అతి తక్కువగా 3,574 మంది మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రజాప్రతినిధులు	ఎస్టీ	ఎస్సీ	బీసీ	ఇతరులు	మొత్తం
సర్పంచులు,	734	733	1,466	1,458	4,391
వార్డు సభ్యులు	7,299	9,900	15,893	11,560	44,652
మొత్తం	8,033	10,633	16,359	13,018	49,043

ఇదీ సంగతి!




అవును సార్, 2జీ స్కాంను పరిచయం చేసింది కూడా మీరే!

100 టీఎంసీల మళ్లింపు

- ఇది సీతారామ ఎత్తిపోతల పథకం లక్ష్యం..
- రెండుదశల్లో కలిపి 9.36 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా
- కేంద్రానికి తెలంగాణ సర్కారు నివేదిక

ఈనాడు, హైదరాబాద్: గోదావరిపై దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి నీటిని మళ్లించేలా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మొత్తం 100 టీఎంసీల నీటిని మళ్లించడం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. మొదటిదశలో 70 టీఎంసీలు మళ్లించేలా పనులు చేపట్టిన ప్రభుత్వం రెండోదశతో కలిపి నూరు టీఎంసీలు మళ్లించి మొత్తం 9.36 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన నివేదికను సంబంధిత చీఫ్ ఇంజినీర్ కేంద్రానికి పంపారు. ఈ నివేదికను కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్ రూపొందించింది. 75 శాతం నీటి లభ్యత కింద ఇప్పటికే వినియోగంలో ఉన్న, కొత్తగా చేపట్టిన, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులకు పోనూ దుమ్ముగూడెం వద్ద 271.8 టీఎంసీల లభ్యత ఉంటుందని, ఇందులో సీతారామ పథకం ద్వారా రెండు (మిగతా 2లో)



కేంద్రానికి పంపిన నివేదిక ప్రకారం మొదటిదశలో నీటి వినియోగం వివరాలివి..

వాడకం	ఆయకట్టు (హెక్టార్లలో)	నీటి వినియోగం (టీఎంసీలలో)
కొత్త ఆయకట్టు	1,33,000	45
సాగర్ ఆయకట్టు స్థిరీకరణ	95,035	14.5
వైరా ఆయకట్టు స్థిరీకరణ	7,040	1
పాలేరు ఆయకట్టు స్థిరీకరణ	6,043	1
చిన్న ప్రాజెక్టుల కింద ఆయకట్టు	31,400	5.5
తాగు, పారిశ్రామిక అవసరాలకు	–	3
మొత్తం	–	70



మూడు రాష్ట్రాల ఎన్నికలకు మోగిన నగారా

-2లో

- త్రిపురలో వచ్చే నెల 18న
- మేఘాలయ, నాగాలాండ్‌లలో 27న
- ఎన్నికల సంఘం ప్రకటన

దేశానికి రెండో రాజధానిగా సమ్మతమే

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేస్తామంటే స్వాగతిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాము ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. జాతీయ రాజకీయాలపై ఆసక్తి లేదని, తెలంగాణ ప్రయోజనాలే తనకు ముఖ్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను పెంచడం అభినందనీయమని, ఇది సరిపోదని రాష్ట్రాలకు మరిన్ని నిధులు, అధికారాలు ఇవ్వాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్ల కల్పన అవకాశాలు రాష్ట్రాలకు కల్పించాలన్నారు. ఏపీతో తెలంగాణను ఏ విషయంలోనూ పోల్చవద్దని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన 'ఇండియా టుడే' సదస్సులో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

"హైదరాబాద్ భారత దేశ సంస్కృతికి అద్దం పట్టే నగరం. ఇది భిన్న సంప్రదాయాల సమ్మేళనం. నిజాం కాలంలోనే సంపన్న రాష్ట్రం. మద్రాస్ కంటే ముందే 1915లోనే హైదరాబాద్ కరెంటు ఉండేది. విమాన, రైల్వే వ్యవస్థ ఉండేది. ఎన్నో మతాలు, ప్రాంతాలవాళ్లు చాలా ఏళ్లుగా ఇక్కడ జీవిస్తున్నారు. 300 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చిన మార్వాడీలు, గుజరాతీలు, రాజస్థానీలు తెలంగాణ మా మాతృభూమి అని గర్వంగా చెప్పుకుంటారు. ఏపీ వారు మాత్రం అలా చెప్పుకోలేదు. ఉద్యమ సమయంలో కొంత మంది ఆంధ్రనేతలు హైదరాబాద్‌పై అర్థం లేని విమర్శలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ విధ్వంసానికి గురైంది. ఏపీ మీద ప్రేమతో అప్పటి పాలకులు హైదరాబాద్‌కు తీవ్ర అన్యాయం చేశారు. వందల చెరువులు నాశనమయ్యాయి. పార్కులు మాయమయ్యాయి. చివరికి నాలాలు ఆక్రమణలకు గురయ్యాయి. విశ్వనగర పునర్నిర్మాణానికి రూ. 25 వేల కోట్లు కావాలి. ఎన్ని నిధులైనా తెచ్చి అభివృద్ధి చేస్తాం. ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ సదస్సులకు వేదికగా మారింది. హైదరాబాద్ బిర్యానీ చాలా ప్రసిద్ధి పొందింది. బిల్ క్లింటన్ సహా ప్రముఖులెందరో దీనిని ప్రశంసించారు.

ఆ వాదన సరికాదు

హైదరాబాద్ ఉండడం వల్లనే తెలంగాణకు కలిసి వచ్చిందని ఆంధ్రనేతలు అబద్ధాలు చెబుతున్నారు. హైదరాబాద్ చరిత్ర తెలిసిన వారెవరైనా అది తెలంగాణలో అంతర్భాగమేనని అంగీకరిస్తారు. మలేసియా నుంచి విడిపోయినప్పుడు సింగపూర్‌లో ఏముంది? ఇప్పుడు సింగపూర్ ఎలా మారింది? ఏదైనాసరే అభివృద్ధి వ్యూహంలోనే ఉంటుంది. ఎవరైనా కృషితోనే ముందుకెళ్లాలి. సింగపూర్, చైనా, గుజరాత్‌లతో మేం పోల్చుకోం. తెలంగాణకు అస్థిత్వం ఉంది.





ఇండియాటుడే సదస్సులో భాగంగా ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో కలిసి నవ్వులు చిందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ★ హాజరైన వివిధ రంగాల ప్రముఖులు, ప్రతినిధులు

రాష్ట్రాలకు హక్కులు అధికారాలు

ప్రధాని మోదీ సహకార సమాఖ్య నినాదం ఇచ్చారు. కాని కొంతవరకే దానికి అమలు చేస్తున్నారు. ఇంకా చేయాలి. రాష్ట్రాలు బలోపేతమైతేనే దేశం అభివృద్ధి సాధిస్తుంది. రాష్ట్రాలకు మరిన్ని నిధులు, అధికారాలివ్వాలి. రాష్ట్రాల వాటాలో కోత విధిస్తే అభివృద్ధిని అడ్డుకున్నట్లే. రాష్ట్రాలకు హక్కులు, వాణి ఉన్నప్పుడే ప్రధాన మంత్రి మోదీ మరింత బలంగా మారతారు. ఎవరికి ఇష్టం ఉన్నా లేకుండా భారత్ బలం రాష్ట్రాలే. సహకార సమాఖ్య వ్యవస్థ ద్వారా సత్ఫలితాలు వస్తాయి. కేంద్రంతో మేం రాజ్యాంగపరమైన సంబంధాలను కొనసాగిస్తున్నాం.

రిజర్వేషన్లు మరింత పెరగాలి

రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన ఉండాలి. ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనమే రిజర్వేషన్ల పెంపుదలకు ప్రామాణికంగా తీసుకోవాలి. వీటిని 50 శాతానికే పరిమితం చేయడం వల్ల ప్రజలకు అన్యాయం జరుగుతుంది. అవి రాజకీయ ప్రయోజనాల కోసం ఇస్తున్నవి కాదు. జార్ఖండ్‌లో గిరిజన జనాభా పెద్దమొత్తంలో ఉన్నారు. మా రాష్ట్రంలో 90 శాతంమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలున్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ ఉన్నప్పుడు నువ్వెందుకు ఇవ్వవు అని మా ప్రజలు నన్ను అడుగుతున్నారు. ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్లు మతపరమైనవి కాదు. వారి సామాజిక స్థితిగతులను చూసే ఇవ్వాలనుకుంటున్నామని స్వయంగా ప్రధానికి చెప్పాను. మోదీ సానుకూలంగా స్పందిస్తారా లేదా అన్నది ఆయన ఇష్టం. ఇది వివాదమో, పోరాటమో కాదు. ప్రజల ఆకాంక్షలను కేంద్రం గుర్తించాలి. దీనిపై పార్లమెంటులోనే పోరాడుతాం.

రైతు ఆత్మహత్యలు బాధాకరం

రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు బాధాకరం. సాగునీటి కొరత, కల్తీ పురుగుమందులు, అప్పులు వంటి వాటితో పాటు ఇతర సమస్యలెన్నో దీనికి కారణం. వాటిని నివారించే లక్ష్యంతో మే కార్యక్రమాలను చేపట్టాం. రూ. 1.50 లక్షల కోట్లతో కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల, సీతారామ ప్రాజెక్టులను చేపట్టాం. 2020 నాటికి కోటి ఎకరాలకు నీరందిస్తాం. రైతులకు ఎకరానికి ఏటా రూ. 8 వేల చొప్పున పెట్టుబడిసాయంగా అందించనున్నాం. రైతుల పంటలకు మద్దతు ధర కల్పించేందుకు సమన్వయ సమితులను ఏర్పాటు చేశాం.

ప్రగతి భవన్ నాది కాదు

ప్రగతిభవన్ కేసీఆర్‌ది కాదు. తెలంగాణ ముఖ్యమంత్రి అధికారిక నివాసం. వందేళ్ల పాటు ఉండేలా దానిని నిర్మించాం. అందులో నేను ఒక్కడినే ఉండను. నా తర్వాతా ముఖ్యమంత్రులు వస్తారు.

రూ. 250 కోట్లతో సచివాలయం

కొత్త సచివాలయాన్ని రూ. 250 కోట్లతో నిర్మిస్తాం. ప్రస్తుత సచివాలయం ఒక పద్ధతి ప్రకారం లేదు. మలేసియా మంత్రి వేలు ఇక్కడికి వచ్చినప్పుడు మీ సచివాలయం ఇలా ఉందేంటి అన్నారు. ఈ భూములను అమ్మి కొత్త సచివాలయం కట్టాలని సూచించారు. అందుకే సకల సౌకర్యాలతో కొత్తది నిర్మించాలనుకున్నాం. అయితే భూములు అమ్మేది లేదని ఆయనకు చెప్పాను. తెలంగాణ అత్యంత ధనిక రాష్ట్రం దానికి అనుగుణంగా అద్భుతమైన సచివాలయం నిర్మిస్తాం.

ఏపీ ఎప్పటికీ మాకు పోటీ కాదు

ఆంధ్రప్రదేశ్ మాకు పోటీ కాదు. ఎప్పటికీ పోటీ పడలేదు. మాది చిన్న రాష్ట్రం కాదు. జనాభాలో మా తర్వాత 12 రాష్ట్రాలున్నాయి. విస్తీర్ణంలో 16 రాష్ట్రాల కంటే మేమే పెద్ద.

ఎవరి ప్రయత్నాలు వారివి

అవినీతి ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు ఫ్యాషనైపోయింది. మేం ఎంత నిజాయితీగా ఉన్నామో మా ప్రజలకు తెలుసు. తెలంగాణలో అధికారంలోకి వస్తామంటున్న భాజపా నాయకులు.. వారి ప్రయత్నాలు వాళ్లు చేసుకోవచ్చు. ఇవన్నీ రాజకీయాల్లో సహజం.

తెలంగాణయే నా కుటుంబం

తెలంగాణయే నా కుటుంబం. నా భావోద్వేగాలన్నీ తెలంగాణతో ముడిపడి ఉన్నాయి. ఇక్కడే ఉంటాను. దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. నా కుటుంబ సభ్యులను నేను నామినేట్ చేయలేదు. వారు ఉద్యమంలో పాల్గొన్నారు. కేసులు నమోదయ్యాయి. అరెస్టయ్యారు. జైలుకెళ్లారు. రెండు, మూడు దఫాలుగా ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల ద్వారా గెలిచారు.

ప్రవాసుల కోసం త్వరలో కొత్త విధానం

ప్రవాసుల సంక్షేమానికి త్వరలోనే కొత్త విధానాన్ని చేపడుతున్నాం. దీనిపై కసరత్తు జరుగుతోంది. 1969 తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వారందరినీ జలదృశ్యంలో అమరవీరుల స్మారక స్థూపం శంకుస్థాపన సందర్భంగా సన్మానిస్తాం."

రైలు టికెట్ ముందస్తుగా బుక్ చేసుకుంటే రాయితీ

విమానయాన సంస్థల తరహాలో ప్రయోజనాలకు కమిటీ సిఫార్సు

దిల్లీ: ఇకపై రైలు టికెట్లను ప్రయాణికులు ఎంత ముందస్తుగా బుక్ చేసుకుంటే.. అంత ఎక్కువ ప్రయోజనం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైల్లో మిగిలి ఉన్న సీట్ల సంఖ్య ప్రాతిపదికన ప్రయాణికులకు టికెట్ ధరలపై రాయితీలు ఇవ్వాలని ఛార్జీల సమీక్ష కమిటీ సిఫార్సు చేసింది. ఇప్పటికే ఈ విధానాన్ని విమానయాన సంస్థలు అనుసరిస్తున్న సంగతిని గుర్తుచేసింది. టికెట్ బుక్ చేసుకున్నప్పుడు మిగిలి ఉన్న సీట్ల సంఖ్యను బట్టి ప్రయాణికులకు గ్రేడ్‌లవారీగా 50 శాతం నుంచి 20 శాతం వరకు రాయితీ ఇవ్వాలని కమిటీ ఇటీవల చేసిన సిఫార్సుల్లో పేర్కొంది. రైలు బయలుదేరడానికి రెండు గంటల ముందు టికెట్ బుక్ చేసుకునేవారికి కూడా రాయితీలు కల్పించాలని సూచించింది.

మూడు రాష్ట్రాల ఎన్నికలకు మోగిన నగారా

దిల్లీ: మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. త్రిపురలో వచ్చే నెల 18న; మేఘాలయ, నాగాలాండ్‌లలో 27న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం (ఈసీ) గురువారం ప్రకటించింది. మూడింటి ఫలితాలనూ మార్చి మూడున వెల్లడిస్తామని తెలిపింది. ఈ విషయంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకే జ్యోతి మాట్లాడారు. మేఘాలయ, నాగాలాండ్, త్రిపురల అసెంబ్లీ కాలం వరుసగా మార్చి 6, 13, 14లతో ముగుస్తున్నాయి. ఒక్కో రాష్ట్రంలో 60 చొప్పున అసెంబ్లీ స్థానాలున్నాయి. త్రిపుర ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఈ నెల 24 నుంచి మొదలవుతుంది. 31తో ఈ ప్రక్రియ ముగుస్తుంది. వచ్చే నెల మూడో తేదీ వరకూ నామినేషన్లను వెనక్కు తీసుకునేందుకు అవకాశముంటుంది. మరోవైపు మేఘాలయ, నాగాలాండ్‌లలో నామినేషన్ల ప్రక్రియ 31తో మొదలవుతుంది. ఫిబ్రవరి ఏడోతేదీతో ఇది ముగుస్తుంది. 12వ తేదీ వరకూ నామినేషన్లను వెనక్కు తీసుకునేందుకు అవకాశముంటుంది. త్రిపురలో 25,69,216 మంది ఓటర్లు ఉండగా.. నాగాలాండ్‌లో 11,89,264 మంది, మేఘాలయలో 18,30,104 మంది ఓటర్లున్నారు.

ఎన్నికల బాండ్ల ఆవిష్కరణ.. సరైన దిశలో పడిన అడుగే

ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యాఖ్యలు

దిల్లీ: ఎన్నికల బాండ్లు ప్రవేశపెట్టడమనేది సరైన దిశలో పడిన అడుగేనని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకే జ్యోతి వ్యాఖ్యానించారు. మొదట్లో ఈ బాండ్లను ఆయన వ్యతిరేకించారు. మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ప్రకటన అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల బాండ్లకు ఆయన మద్దతు పలికారు. అయితే రాజకీయ పార్టీల నిధుల్లో పారదర్శకతకు సంబంధించిన అన్ని సమస్యలనూ ఇవి పరిష్కరించలేవని వివరించారు.

ఓరుగల్లుకు మోనోరైలు

(మొదటి పేజీ తరువాయి)

సేవలను సమీక్షించి, చర్చించి, నిర్ణయం చెబుతామని కేటీఆర్ చెప్పార'ని రామ్మోహన్ తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి ఆదివారం స్విట్జర్లాండ్‌కు వచ్చి, ప్రతిపాదిత సంస్థలతో భేటీ అవుతారనీ.. ఆ సమావేశానికి తాను కూడా వెళ్తున్నానని మేయర్ చెప్పారు.

ఒకేసారి 2 వేల మంది ప్రయాణం: హైదరాబాద్‌లో 70 కిలోమీటర్ల మోనోరైలు కారిడార్లకు ప్రతిపాదనలొచ్చాయి. ఇందులో- గచ్చిబౌలి, కొండాపూర్, ఆదిభట్ల మీదుగా శాటిలైట్ టౌన్‌షిప్‌లను కలుపుతూ విమానాశ్రయం వరకూ కారిడార్ ఉంది. ఎల్బీనగర్ మెట్రో కారిడార్-విమనాశ్రయం, జేబీఎస్-విమానాశ్రయం తదితర కారిడార్లున్నాయి. వేర్వేరు దేశాల్లోని మోనోరైళ్లు ప్రస్తుతం ఒక ట్రిప్పులో 600-700 మంది ప్రయాణికులనే గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. వీటికి భిన్నంగా ఒక్కో రైలులో 2వేల మంది ప్రయాణించేందుకు వీలైన ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, ఆయా సంస్థలు అంగీకరించినట్లు రామ్మోహన్ తెలిపారు.

బీసీలకు బడ్జెట్ పెంచుతాం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీల బడ్జెట్‌ను 2018-19లో పెంచుతామని మంత్రి జోగు రామన్న తెలిపారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధపరిచామన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, యువజన సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, శ్యాంల ఆధ్వర్యంలో సంఘాల ప్రతినిధులు గురువారం సచివాలయంలో మంత్రిని కలిశారు. బడ్జెట్‌లో బీసీలకు నిధులు పెంచాలని అభ్యర్థించగా, దీనిపై సీఎం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు,

మంచు దుప్పట్లో జమ్ముకశ్మీరు

దిల్లీ: జమ్ము, కశ్మీరులో గురువారం కూడా అతి శీతల పరిస్థితులు కొనసాగాయి. శ్రీనగర్ సహా పలు ప్రాంతాల్లో మైనస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుల్‌మార్గ్, మరికొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి హిమపాతం కురిసింది. శ్రీనగర్‌లో -2 డిగ్రీల సెల్సియస్, గుల్‌మార్గ్‌లో -7డిగ్రీలు, లేహ్‌లో -6.9 డిగ్రీలు, కార్గిల్‌లో -19.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

1,58,48,000

ఇదీ 'ఈనాడు' పాఠకుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌మత్ (మరాఠీ-1,80,66,000), రాజస్థాన్ పత్రిక (1,63,26,000), మలయాళ మనోరమ (1,59,99,000), ఈనాడు (1,58,48,000), ప్రభాత్ కబర్ (1,34,92,000) ఉన్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా (1,30,47,000) 11వ స్థానంలో నిలిచింది. చివరిసారిగా 2014లో ఐఆర్ఎస్ నివేదిక వెలువడింది. అప్పటికి పాఠకుల సంఖ్య 29.5 కోట్లు. తాజాగా 2017లో పూర్తి ఏడాదికి సంబంధించి, 3.2 లక్షల ఇళ్ల నుంచి వివరాలు సేకరించి నివేదిక రూపొందించారు. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ), మీడియా రీసెర్చ్ యూజర్స్ కౌన్సిల్ (ఎంఆర్‌యూసీ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన రీడర్‌షిప్ స్టడీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్‌సీఐ) ఈ అధ్యయనం నిర్వహించింది. 12 ఏళ్లు పైబడినవారిలో పాఠకుల సంఖ్య 9% చొప్పున పెరుగుతూ వస్తోంది. ఈ విషయంలో ఆంగ్ల పత్రికల కంటే ప్రాంతీయ పత్రికలదే పైచేయిగా ఉంది. గత నాలుగేళ్ల వివరాలు చూస్తే ఒడియా భాషా పత్రికలు ఎక్కువ మంది పాఠకుల్ని ఆకట్టుకోగలిగాయి. అక్కడ 2014లో పాఠకుల సంఖ్య 60 లక్షలు ఉంటే తాజా సర్వేలో 1.1 కోట్లకు చేరారు. ఇది 84% పురోగతితో సమానం.

త్వరలో ప్రత్యేక సమాచార నిధి ఏర్పాటు

కేంద్రమంత్రి సదానందగౌడ

బెంగళూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాల వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమాచార నిధి (డేటావేర్ హౌస్)ని త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్ర గణాంక శాఖ మంత్రి సదానందగౌడ తెలిపారు. గురువారం బెంగళూరులో గణాంక శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాల ఖర్చులు, నిధుల కేటాయింపు వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ లేనందున సమాచార నిధిని ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు నాలుగు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 60 విభాగాల దస్త్రాలు, ఇతర సమాచార సేకరణకు ఏడువేల మంది ఉద్యోగులు ఉన్నట్లు సదానందగౌడ తెలిపారు. ప్రస్తుతం చరవాణి ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు.

100 టీఎంసీల మళ్లింపు

(మొదటి పేజీ తరువాయి)

దశల్లో 100 టీఎంసీల నీటిని మళ్లించనున్నట్లు నివేదిక పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టేల్‌పాండ్ పథకాన్ని, రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరా దుమ్ముగూడెం పథకాలను రద్దు చేసిన తెలంగాణ ప్రభుత్వం పునరాకృతిలో భాగంగా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. మొదటిదశలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి నీటిని మళ్లించేలా ప్రణాళిక రూపొందించింది. ఈ ఆయకట్టు కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఉంది. ఈ పథకానికి 9000 క్యూసెక్కుల నీటిని మళ్లించాల్సి ఉండగా, మొదటి పది కిలోమీటర్ల దూరం 13,500 క్యూసెక్కులు మళ్లించేలా డిజైన్ చేసింది. పది కిలోమీటర్ల తర్వాత 9000 క్యూసెక్కుల ప్రవాహానికి తగ్గట్లుగా డిజైన్ చేసింది. మొదటిదశలో 4.65 కి.మీ. దూరం సొరంగమార్గం, ఎనిమిది కిలోమీటర్ల పంపింగ్ మెయిన్‌తోపాటు మొత్తం 224.65 కి.మీ. నీటి ప్రవాహ మార్గాన్ని నిర్మించాల్సి ఉంటుందని నివేదిక పేర్కొంది.

2,905 హెక్టార్ల పట్టాభూమి: ఈ పథకానికి 2,905 హెక్టార్ల పట్టాభూమితోపాటు, 1,930 హెక్టార్ల అటవీ భూమి అవసరం. 407 మెగావాట్ల విద్యుత్తు అవసరమైన ఈ దశ నిర్మాణ వ్యయం రూ. 11,931.73 కోట్లుగా నివేదిక పేర్కొంది. మొదట 50 టీఎంసీల నీటి మళ్లింపునకు పరిపాలనా అనుమతి ఇవ్వగా, తర్వాత 70 టీఎంసీలకు పెంచింది. అవి మొదటిదశలో మళ్లించేవి కాగా, రెండోదశతో కలిపి మొత్తం నూరు టీఎంసీలు లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు ఖమ్మం జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ పర్యావరణ అనుమతి కోసం పంపిన నివేదికలో స్పష్టం చేశారు. మొదటిదశకు సంబంధించి ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసి పనులను ప్రారంభించింది. రెండోదశ ఆయకట్టు కూడా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో ఉంది.

పన్ను భారం ఇంకాస్త తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు పాల్గొన్నారు.

జీఎస్టీ పరిధిలోకి చమురు

సమావేశం అనంతరం జైట్లీ విలేకరులతో మాట్లాడుతూ ముడిచమురు, సహజవాయువు, పెట్రోలు, డీజిల్, విమానాల ఇంధనం, స్థిరాస్తి రంగాలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే విషయమై వచ్చే సమావేశంలో చర్చిస్తామని చెప్పారు. పన్ను మదింపు విధానాన్ని సులభతరం చేయడంపై ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ అయిన సంస్థలన్నీ మునుపటిలాగానే జీఎస్టీఆర్ 3బీ ఫారాన్ని నింపాల్సి ఉంటుందని తెలిపారు. అయితే సప్లయర్ ఇన్‌వాయిస్‌లోని వివరాలన్నీ ఇందులోకి వచ్చే విధంగా కంప్యూటర్ విధానాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను అన్ని రాష్ట్రాలకు పంపిస్తామని, వచ్చే సమావేశంలో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సరళతరంగా రిటర్నుల సమర్పణపై ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నందన్ నిలేకని ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై అధ్యయనానికి బిహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ అధ్యక్షతన, నీలేకని, జీఎస్టీనెట్‌వర్క్ ఛైర్మన్ అజయ్ భూషణ్ పాండే సభ్యులుగా కమిటీ ఏర్పాటయింది.

1 నుంచే ఈ-వే బిల్లులు

పన్ను ఎగవేతను అరికట్టడంలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచే ఈ-వే బిల్లుల విధానం అమలు చేస్తామని జైట్లీ వెల్లడించారు. రూ. 50 వేలకు మించిన సరకును ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్తే వాహనదారులు తప్పకుండా ఈ-వేబిల్లును తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు సరకు తీసుకెళ్లినా ఈ విధానాన్ని అమలు చేయాలని 15 రాష్ట్రాలు నిర్ణయించాయని వివరించారు. హస్తకళా వస్తువులపై కమిటీ సమర్పించిన సిఫార్సులను సమావేశంలో ఆమోదించారు.

పన్నుల వసూళ్లలో తగ్గుదల

జీఎస్టీ వసూళ్ల ఆదాయం తగ్గుతున్నట్లు జైట్లీ తెలిపారు. జులైలో రూ. 95 వేల కోట్లు వసూలు కాగా, నవంబరులో రూ. 81 వేల కోట్లు వసూలయినట్టు చెప్పారు. సంవిధాన పన్ను విధానం (కాంపోజిట్ స్కీం) కింద నమోదయిన 17 లక్షల మంది వ్యాపారుల పన్ను చెల్లింపు తీరు సక్రమంగా లేదని అన్నారు. మొదటి త్రైమాసికంలో వారంతా రూ. 307 కోట్లు మాత్రమే చెల్లించారని చెప్పారు. వివరాలను దాచిపెడుతున్నట్టు కనిపిస్తోందని అన్నారు. పన్ను ఎగవేతను అరికట్టే చర్యలు చేపడితే ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఐజీఎస్టీ కింద వసూలయిన రూ. 35 వేల కోట్లను వాపసు ఇవ్వాలని ఎవరూ అడగలేదని, దానిని కేంద్ర, రాష్ట్రాల మధ్య సమానంగా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

ఆలస్య రుసుముల తగ్గింపు

సరఫరా వివరాలు పొందుపరిచే జీఎస్టీఆర్-1 ఫారం సమర్పణ ఆలస్యమయితే విధించే ఆలస్య రుసుమును రోజుకు రూ. 50కు తగ్గించారు. మరి కొన్ని ఫారాలకూ ఈ రుసుము తగ్గింది.

పన్ను తగ్గిన వస్తువులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొని ఉండకూడదు.

18% నుంచి 12 శాతానికి...



★ సుగర్ బాయిల్డ్ కన్ఫెక్షనరీ ★ 20 లీటర్ల మంచి నీటి బాటిళ్లు ★ ఎరువుల్లో ఉపయోగించే ఫాస్పారిక్ ఆసిడ్ ★ జీవ ఇంధనం ★ జీవ ఎరువులు (బాసిల్లస్ తురింజస్-బి.టి.లాంటివి.. అందులోని వివిధ రకాలు/వర్గాలు) ★ వేప పూత ఉన్న ఎరువులు ★ నిమ్మగడ్డి ★ వెదురుతో చేసే భవన నిర్మాణ సామగ్రి ★ బిందు సేద్యం పరికరాలు (తుంపర సేద్యం పరికరాలు సహా) ★ మెకానికల్ స్ప్రేయర్

18% నుంచి 5 శాతానికి..

★ చింతపండు గింజల పొడి ★ కోన్‌లోని గోరింటాకు ★ ఇళ్లకు వంటగ్యాస్ సరఫరా చేసే ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ★ శాస్త్ర, సాంకేతిక పరికరాలు, ఉపగ్రహాలు ప్రయోగించడానికి ఉపయోగించే సామగ్రి (వీటిపై 18% ఐజీఎస్టీ కూడా ఉండగా, దాన్ని 5 శాతానికి తగ్గింపు)

12% నుంచి 5 శాతానికి...

★ గడ్డి, కేన్ తదితర సామగ్రితో తయారు చేసే పరికరాలు

12% నుంచి 5 శాతానికి...

(ఇంతవరకు ఉపయోగించని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను వాపసు ఇవ్వబోరు)

★ వెల్‌వెట్ వస్త్రాలు

3% నుంచి 0.25 శాతానికి..

★ వజ్రాలు, ఇతర విలువైన రాళ్లు

పన్ను పూర్తిగా లేనవి




★ విభూతి ★వినికిడి పరికరాల విడిభాగాలు, ఇతర అనుబంధ సామగ్రి

★ నూనె తీసేసిన వరి ధాన్యం తౌడు

పరిహార రుసుం (కాంపెన్సేషన్ సెస్)

15% నుంచి సున్నా శాతానికి..



★ అంబులెన్స్‌లు, 10-13 సీట్ల బస్సులు

కొన్నింటిపై పన్ను పెంపు ఇలా

0% నుంచి 5 శాతానికి..

వరి ధాన్యం తౌడు (నూనె తీయనది)

12% నుంచి 18 శాతానికి..

★ సిగరెట్ ఫిల్టర్ రాడ్స్

పన్ను తగ్గిన కొన్ని సేవల వివరాలు

★ మెట్రో రైళ్ల నిర్మాణం: 18% నుంచి 12%

★ చిన్న తరహా హౌస్ కీపింగ్ సేవలు : 5% (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఇవ్వరు)

★ టైలరింగ్ సేవలు: 18% నుంచి 5%

★ థీమ్ పార్కుల్లో ప్రవేశాలు: 28% నుంచి 18%

'పాంచ్' పటాకా!

బాలాసోర్: దేశ రక్షణ పాటవం మరింత ఇనుమడించింది. అణ్వస్త్ర సామర్థ్యమున్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. 5వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ వ్యూహాత్మక అస్త్రాన్ని.. వినియోగదారు అయిన సైనిక దళాల సమక్షంలో తొలిసారిగా ప్రయోగించారు. దీంతో ఇది మన బలగాల అమ్ములపొదిలో చేరడానికి మార్గం సుగమమైంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ క్షిపణిని ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవిలో ఉన్న సమీకృత పరీక్ష వేదిక (ఐటీఆర్) నుంచి ఉదయం 9.53 గంటలకు ప్రయోగించారు. ఒక సంచార వేదికపైన గొట్టం ఆకారంలో ఉన్న రక్షణ కవచం (క్యానిస్టర్) నుంచి క్షిపణి దూసుకెళ్లింది. దీని గమనాన్ని రాడార్లు, గమన పరిశీలన వ్యవస్థలు, రేంజ్ కేంద్రాలు నిశితంగా పరిశీలించాయి. ప్రయోగం పూర్తిగా విజయవంతమైంది. 19 నిమిషాల్లో ఈ క్షిపణి.. 4900 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది.

'వినియోగ' పరీక్ష.. : ఈ క్షిపణిని పరీక్షించడం ఇది ఐదోసారి. మునుపటివన్నీ అభివృద్ధి దశ పరీక్షలు కాగా.. తాజా ప్రయోగాన్ని ఈ క్షిపణి వినియోగదారు అయిన సైనికదళాల పరిశీలన, శిక్షణ కోసం చేపట్టారు. క్యానిస్టర్ నుంచి పరీక్షించడం ఇది మూడోసారి. దీనివల్ల క్షిపణిని వేగంగా ప్రయోగానికి సిద్ధం చేయడం, మరోచోటుకు తరలించడం చేయవచ్చు. అగ్ని-5ను సాకారం చేయడంలో హైదరాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరీ (ఏఎస్ఎల్), డీఆర్‌డీఎల్, రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)లు ముఖ్య భూమిక వహించాయి.

తాజా ప్రయోగ కార్యకలాపాలకు అగ్ని-5 ప్రాజెక్టు డైరెక్టర్ జి.రామగురు, ప్రోగ్రామ్ డైరెక్టర్ ఎం.ఆర్.ఎం.బాబు నేతృత్వం వహించారు. రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు జి.సతీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. అగ్ని-5 పరీక్ష విజయవంతం కావడంపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్.. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

అధునాతనం: అగ్ని-5.. అత్యంత అధునాతన క్షిపణి. దిక్సూచి, మార్గనిర్దేశం, వార్‌హెడ్, ఇంజిన్ పరంగా ఇందులో ఆధునిక పరిజ్ఞానాలను ఉపయోగించారు. ఈ అస్త్రంలోని అత్యంత కచ్చితత్వంతో కూడిన రింగ్ లేజర్ జైరో ఆధారిత ఇనర్షియల్ నేవిగేషన్ వ్యవస్థ (ఆర్ఐఎన్ఎస్), అధునాతనమైన మైక్రో నేవిగేషన్ వ్యవస్థ (ఎంఐఎన్ఎస్) వల్ల కేవలం కొన్ని మీటర్ల తేడాలతో ఈ క్షిపణి.. తన లక్ష్యాన్ని చేరుకోగలదు. శరవేగంగా పనిచేసే కంప్యూటర్, లోపాలు తలెత్తినా అధిగమించే సాఫ్ట్‌వేర్ కూడా దీని సొంతం. భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించే సమయంలో రాపిడి వల్ల తలెత్తే 3వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకునేలా ఉష్ణ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశారు.

అగ్ని-5 వివరాలు..

పొడవు	:	17 మీటర్లు
వెడల్పు	:	2 మీటర్లు
దశలు	:	3
బరువు	:	50 టన్నులు
వార్‌హెడ్ బరువు	:	1.5 టన్నులు
ఇంధనం	:	ఘన
పరిధి	:	5వేల కిలోమీటర్లు
తొలి పరీక్ష	:	2012 ఏప్రిల్ 19న

గ్రహం అనుగ్రహం

19-1-2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
విదియ: ఉ. 10-46 తదుపరి తదియ
ధనిష్ఠ నక్షత్రం: రా. 2-02 తదుపరి శతభిషం
అమృత ఘడియలు: మ. 2-48 నుంచి 4-32 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ. 8-49 నుంచి 9-34 వరకు
తిరిగి మ. 12-32 నుంచి 1-16 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-39; సూర్యాస్తమయం: సా.5-43

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.8	30.5
మెదక్	12.2	35.6
రామగుండం	13.5	31.6
హన్మకొండ	14.5	32.0
కరీంనగర్	15.0	32.0
హైదరాబాద్	15.4	31.5
నిజామాబాద్	17.0	31.0
మహబూబ్‌నగర్	17.5	33.5
ఖమ్మం	19.0	30.0
సూర్యాపేట	20.0	34.5

కాళేశ్వరానికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు ఇవ్వండి

- మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకూ కేటాయింపులు చేయండి
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి రాష్ట్ర మంత్రి ఈటల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2018-19 బడ్జెట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు కనీసం రూ.10వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా గురువారం ఇక్కడ జరిగిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సదస్సులో ఆయన కేంద్రం ముందు రాష్ట్రం తరఫున ప్రతిపాదనలు ఉంచారు. ం ఉంచారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టులు బాగున్నాయని చెప్పిన నీతి ఆయోగ్ దానికి ఆర్థికంగా మద్దతివ్వాలని సిఫార్సు చేసిందని ఈటల గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

- ■ వ్యవసాయం, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల రంగంపై బడ్జెట్‌లో ఎక్కువ దృష్టి పెట్టాలి. వ్యవసాయపరంగా కూడా చేయూతనివ్వాలి.
- ■ రక్షిత నీటికి రూ.40వేల కోట్లతో మిషన్ భగీరథ పనులు 90-95% పూర్తిచేశాం. దీనికి నీతి ఆయోగ్ సంతృప్తి చెంది రూ.19,205 కోట్లు సాయం చేయాలని చెప్పింది. మిషన్ కాకతీయకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. వీటిని అమలు చేయాలి.
- ■ విభజన చట్టంలో చెప్పిన రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు పరిశ్రమ, గిరిజన, ఉద్యాన విశ్వవిద్యాలయాలు, ఎయిమ్స్‌కి నిధులు కేటాయించాలి.
- ■ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.45 వేల కోట్ల పనులు పూర్తయ్యాయి. దీనికి రూ.10వేల కోట్లు కేటాయించాలి.
- ■ తెలంగాణలోని 31 జిల్లాల్లో హైదరాబాద్ మినహాయించి మిగిలిన 30 జిల్లాలను వెనుకబడినవిగా గుర్తించి ప్రత్యేక ప్యాకేజీ కింద సాయం చేయాలి.

జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో..

- ■ బీడీలపై ప్రస్తుతం సిగరెట్లతో సమానంగా విధిస్తున్న 28% పన్నును తగ్గించాలని కోరాం. ఫిట్‌మెంట్ కమిటీ ఇందుకు అంగీకరించలేదు.
- ■ మా డిమాండ్ మేరకు డ్రిప్ ఇరిగేషన్‌పై 18% ఉన్న పన్నును 12%కి తగ్గించారు.
- ■ నాపరాయిలాంటి కొన్నింటిపై పన్నుతగ్గించాలని కోరాం. వాటిని తదుపరిసమావేశంలో చర్చిస్తామన్నారు.
- ■ హైదరాబాద్‌లో పన్నులు చెల్లించేవారిలో 40% మంది ఆంధ్రప్రదేశ్ వారున్నారు. వారు స్వరాష్ట్రానికి తిరిగివస్తే ఏపీకి ఆర్థిక ఇబ్బందులు ఉండవని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ చేసిన వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రశ్నించినప్పుడు రాజేందర్ ఆచితూచి స్పందించారు. అమెరికాలో జీవించేవారు అమెరికాలో, దిల్లీలో బతికేవాళ్లు దిల్లీలో పన్ను చెల్లించినట్లే ఎక్కడ ఉండే వాళ్లు అక్కడ పన్ను కడతారన్నారు. నీతిఆయోగ్‌కు నేతృత్వం వహిస్తున్నవారు అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు? అన్న ప్రశ్నకు స్పందిస్తూ 'అది వారినే అడగండి. పెద్దమనుషుల మీద నేనేమీ వ్యాఖ్యానిస్తా' అన్నారు. ఒకవేళ ఆయన వ్యాఖ్యలు నిజమే అయితే అలాచేయకూడదన్నారు. హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేస్తే బాగుంటుందని ఈటల అన్నారు.

ఆన్‌లైన్ సేవల్లో ఆరోగ్యశాఖకు జాతీయ పురస్కారం

- 20న కోల్‌కతాలో స్వీకరించనున్న రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ పరిపాలన విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో తెలంగాణ వైద్యఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పలు ఆన్‌లైన్ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్‌ఐ) ఏటా అందించే 'నిహిలెంట్ ఈ-గవర్నెన్స్ పురస్కారం' రాష్ట్రాల ఈ-పరిపాలన విభాగంలో 2017 సంవత్సరానికి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖను వరించింది. తల్లీబిడ్డల సంరక్షణకు కేసీఆర్ కిట్, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సమాచార సేకరణకు అన్‌మోల్, బాలల ఆరోగ్య సంరక్షణకు ఆర్‌బీఎస్‌కే, ఆసుపత్రుల్లో సేవల నమోదుకు ఈ-ఆసుపత్రులు, హెచ్‌ఎంఐఎస్, అసాంక్రమిక వ్యాధుల సమాచార సేకరణకు ఎన్‌సీడీ, ఉద్యోగుల సమాచారానికి ఈ-హెచ్‌ఆర్.. తదితర పథకాల్లోనూ ఆన్‌లైన్ సేవలను విస్తృతంగా వినియోగించుకొని ప్రజలకు ఉత్తమ వైద్యసేవలందించడానికి కృషి చేస్తున్న తెలంగాణ వైద్యఆరోగ్యశాఖను ఈ పురస్కారానికి ఎంపిక చేస్తున్నట్లు సీఎస్‌ఐ గురువారం ప్రకటించింది. ఈనెల 20న కోల్‌కతాలో జరగనున్న కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణ ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలందించడంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం అభినందనీయమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సిబ్బంది సేవలను కొనియాడారు. సమాచారాన్ని కంప్యూటరీకరించడం ద్వారా సేవలు వేగవంతమవడంతో పాటు పారదర్శకత పెరుగుతుందనీ, ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలని సూచించారు.

ప్రముఖ కార్టూనిస్టు, రచయిత చండీ లాహిరీ కన్నుమూత

కోల్‌కతా: ప్రముఖ కార్టూనిస్టు, రచయిత చండీ లాహిరీ (87) కన్నుమూశారు. గురువారం కోల్‌కతాలోని ఓ ఆసుపత్రిలో లాహిరీ తుదిశ్వాస విడిచినట్లు.. ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. బుధవారమే లాహిరీ ఆసుపత్రిలో చేరగా.. ఆయన న్యూమోనియా బారినపడ్డట్లు వైద్యులు గుర్తించారు. కొంతకాలంగా లాహిరీ వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన లాహిరీ 1952లో పాత్రికేయుడిగా వృత్తిపరమైన జీవితాన్ని ఆరంభించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పూర్తిస్థాయి కార్టూనిస్టుగా మారి.. ఖ్యాతి గడించారు. దైనిక్ లోక్‌సేవక్, హిందుస్థాన్ స్టాండర్డ్ వంటి పత్రికల కోసం పనిచేశారు. 'బంగ్లా కార్టూనర్ ఇతిహాస్' సహా పలు పుస్తకాలను రచించారు. ఇటు లాహిరీ మృతి పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సంతాపం వ్యక్తంచేశారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తు గడువు పెంపు

ఈనాడు, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో భర్తీ చేయనున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు దరఖాస్తు గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. గురువారం(ఈ నెల 18)తో దరఖాస్తు స్వీకరణకు తుదిగడువు ఉండగా దాన్ని ఈ నెల 25 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం సహా జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఒప్పంద వైద్యుల అనుభవాన్ని ప్రాధాన్యంశంలో పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. అభ్యర్థులు దరఖాస్తు చేసే క్రమంలో అవసరమైన మద్దతు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంలో సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఫిర్యాదులందడంతో వాటిని చక్కదిద్దాలని కోరుతూ ప్రజారోగ్య సంచాలకులు గురువారం సుపరిపాలన కేంద్రం డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. కొత్తగా దరఖాస్తు చేసేవారు, ఇప్పటికే దరఖాస్తు చేసి తగిన ధ్రువపత్రాలను జతపర్చలేదని భావించినవారూ పొడిగించిన గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ లలితకుమారి సూచించారు.



జాతీయ సాహస అవార్డులు–2017కు ఎంపికైన బాలబాలికలు

జూదగాళ్ల ఆటకట్టించిన నజియా

- 18 ఏళ్ల యూపీ బాలిక అపూర్వ సాహసం
- జాతీయ సాహస బాలల అవార్డుకు ఎంపిక
- వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 17 మంది బాలలు కూడా..
- పురస్కారాలను ప్రకటించిన భారత శిశుసంక్షేమ మండలి

దిల్లీ: సామాజిక రుగ్మతల నిర్మూలనతో పాటు ప్రమాదాల్లో చిక్కుకున్న తోటి వారిని కాపాడేందుకు ప్రాణాలకు సైతం లెక్కచేయక తెగువ చూపిన 18 మంది బాలలు ఈ ఏడాది జాతీయ సాహస పురస్కారాలకు ఎంపికయ్యారు. సమాజానికి చీడపురుగులుగా మారిన జూదగాళ్లు, పందెం రాయుళ్ల ముఠాను పోలీసులకు పట్టించటంలో వయస్సుకు మించి ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 18 ఏళ్ల నజియా వీరిలో ఒకరు. స్థానికంగా సమస్యలు సృష్టిస్తూ ప్రజలను వేధిస్తున్న ఈ ముఠా ఆటకట్టించే క్రమంలో బెదిరింపులు వచ్చినా ఆమె వెనకడుగు వేయలేదు. సంఘవ్యతిరేక శక్తులకు ఎదురొడ్డి నిలిచిన నజియా ప్రతిష్ఠాత్మక 'భారత్ అవార్డు' అందుకోనున్నారు.

కర్ణాటకకు చెందిన 14 ఏళ్ల నేత్రావతి ఎం చవాన్ నీటిలో మునిగిపోతున్న ఇద్దరు బాలురను రక్షించే క్రమంలో తన ప్రాణాలను కోల్పోయారు. మరణానంతరం ఆమెకు గీతా చోప్రా అవార్డు ప్రకటించారు. చెరువు నీటిలో మునిగిపోతున్న 16 ఏళ్ల బాలుడిని తొలుత నేత్రావతి రక్షించింది. పదేళ్ల వయస్సున్న మరో బాలుడిని కాపాడే ప్రయత్నంలో అతనితో పాటు నీటిలో మునిగి ఆమె ప్రాణాలు కోల్పోయారు. మిజోరాం రాష్ట్రానికి చెందిన లాల్‌చందామా(17), మణిపూర్‌కు చెందిన లౌక్రాక్పమ్ రాజేశ్వరి చాను(15)లు కూడా మరణానంతరం పురస్కారాలను ప్రకటించిన వారి జాబితాలో ఉన్నారు. పంజాబ్‌లో బస్సు కాలువలో పడిపోగా తాను గాయపడినప్పటికీ లెక్క చేయక 15 మంది విద్యార్థులను రక్షించి వెలుపలికి తీసుకురావటంలో ధైర్యసాహసాలు చూపిన కరణ్‌బీర్ సింగ్(17)...సంజయ్‌చోప్రా అవార్డుకు ఎంపికయ్యారు. మేఘాలయకు చెందిన బెస్ట్వాజాన్ పీలాంగ్(14), ఒడిశాకు చెందిన మమతా దలై(7), కేరళకు చెందిన సెబాస్టియన్ విన్సెంట్(13)లు బాపు గైధాని పురస్కారానికి ఎంపికయ్యారు. పీలాంగ్ అగ్నిప్రమాదానికి గురైన తమ ఇంటి నుంచి మూడేళ్ల తమ్ముడిని కాపాడుకోగా, మొసలి నుంచి తన స్నేహితురాలిని మమతా దాలై రక్షించారు. రాయ్‌పూర్‌కు చెందిన లక్ష్మీయాదవ్(16), నాగాలాండ్‌కు చెందిన మన్షా (13), శాగ్సేన్ కొన్యాక్(18), యోక్నీ(18), చింగై వాంగ్సా, గుజరాత్‌కు చెందిన సమృధి సుశీల్ శర్మ(17), మిజోరం రాష్ట్ర వాసి జొనుత్లుంగా(16), ఉత్తరాఖండ్‌కు చెందిన పంకజ్ సెమ్వాల్(16), మహారాష్ట్రకు చెందిన నదాఫ్ ఎజాజ్ అబ్దుల్ రవూఫ్(17), ఒడిశాకు చెందిన పంకజ్ కుమార్ మహంతా సాహస అవార్డులకు ఎంపికయ్యారు. ఈ ఏడాది మొత్తం ఏడుగురు బాలికలు, 11 మంది బాలురు పురస్కారాల జాబితాలో చోటుదక్కించుకున్నారు. అయిదు విభాగాల్లో ప్రతియేటా ఇచ్చే ఈ అవార్డులను జాతీయ శిశు సంక్షేమ మండలి(ఐసీసీడబ్ల్యు) గురువారం ప్రకటించింది. దిల్లీలో జనవరి 24న జరిగే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీరందరికీ పురస్కారాలను అందజేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సాహస బాలలకు ప్రత్యేక విందు ఇస్తారు. జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కూ వీరు హాజరవుతారు.

ఫిబ్రవరి 17 నుంచి యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల (ఫిబ్రవరి) 17న ప్రారంభమవుతాయి. 11 రోజులపాటు సాగే బ్రహ్మోత్సవాలలో అత్యంత విశేషమైన స్వామి ఎదుర్కోలు ఉత్సవం ఫిబ్రవరి 23న, తిరుకల్యాణ మహోత్సవం 24న, దివ్య విమాన రథోత్సవం 25న నిర్వహిస్తారు. కల్యాణం, దివ్య విమాన రథోత్సవాలను గతేడాది మాదిరిగానే ఆయా రోజుల్లో ఉదయం బాలాలయంలో, రాత్రి పట్టణంలో నిర్వహిస్తారు. యాదాద్రి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం (ఈ నెల 20) నుంచి ప్రారంభం కానున్నాయి.

రామాలయం పూజల్లో ఎలాంటి మార్పులు జరగలేదు

భద్రాచలం ఆలయ వైదిక సిబ్బంది

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే పూజల్లో ఎలాంటి మార్పులు జరగలేదని ఆలయ వైదిక బృందం వెల్లడించింది. ఆలయ వైదిక సిబ్బంది గురువారం భద్రాచలంలో విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాచలానికి చెందిన ఒకరిద్దరు వ్యక్తులు తమ స్వార్థం కోసం పండితులను సైతం పక్కదారి పట్టించి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. ప్రవరలో మార్పులు జరిగాయంటూ ఇటీవల కొంతమంది న్యాయ పోరాటానికి దిగడంతో దేవాదాయశాఖ కమిషనర్‌కు నోటీసు జారీ అయింది. దీనికి సమాధానం ఇచ్చేందుకు వైదిక సిబ్బందికి ఆలయం తరఫున నోటీసులిచ్చి వివరాలను సేకరిస్తున్నారు. శ్రీ సీతారాములకు కల్యాణం నిర్వహించే సమయంలో ప్రవరను పఠిస్తారు. ఇందులో ఇద్దరి గోత్రాలు ఉంటాయి. ఈ గోత్రాల్లో మార్పు జరిగిందని భద్రాచలానికి చెందిన శర్మతోపాటు మరికొందరు ఆరోపిస్తున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది.

పెట్రోలు ధరలను నిశితంగా పరిశీలిస్తున్నాం

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

దిల్లీ: రికార్డు స్థాయిలో పెరిగిన పెట్రోలు, డీజిలుపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే విషయంపై కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి స్పష్టమైన సంకేతమూ ఇవ్వలేదు. ధరలను నిశితంగా పరిశీలిస్తున్నామని మాత్రమే ఆయన వివరించారు. ప్రస్తుతం దిల్లీలో పెట్రోలు ధర రూ.71.56గా ఉంది. ఆగస్టు 2014 అనంతరం ఇదే గరిష్ఠధర. ముంబయిలో అయితే ఇది దాదాపు రూ.80 వరకూ పలుకుతోంది. గురువారమిక్కడ జరిగిన పారిశ్రామిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత అక్టోబరులో కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.2 తగ్గించిన విషయాన్ని గుర్తుచేశారు.

ఈనాడు

రైతు జీవన భద్రత కోసం...

పేరుకు వ్యవసాయ ప్రధాన దేశమైనా, భారతావనిలో కోట్లాది అన్నదాతలు దశాబ్దాలుగా జీవనభద్రత కొరవడి కునారిల్లుతున్న వైనం, అందుకు పుణ్యం కట్టుకున్న విధాన వైఫల్యం- జాతిజనులకు ముంజేతికంకణం. పోనుపోను తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోతున్న రైతాంగం బతుకుల్లో వెలుగుపూలు పూయించడమే లక్ష్యమంటూ, 2022నాటికి వారి ఆదాయాన్ని రెండింతలు చేస్తామని ప్రతిన పూనింది మోదీ ప్రభుత్వం. అందుకు సంబంధించి విధివిధానాలు సూచించే నిమిత్తం 2016 ఏప్రిల్‌లో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ తాజాగా కార్యాచరణ ప్రణాళికనొకదాన్ని క్రోడీకరించింది. రైతుల ఆదాయాల్లో స్థిరమైన పెంపుదల సాకారమయ్యేందుకు 2015-16నాటికి లక్షా 78వేల కోట్ల రూపాయలున్న ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు ఏడేళ్లలో రూ.4.86లక్షల కోట్లకు చేరాల్సి ఉందని ఇదే కమిటీ గత ఆగస్టులో అభిప్రాయపడింది. భారీ పెంపుదల మాట దేవుడెరుగు, నికరంగా కుంగుదల అనుభవమవుతున్న నేపథ్యంలో- కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ క్షాళనకు; జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో మూడంచెల యంత్రాంగం ఏర్పాటుకు అదిప్పుడు పిలుపిస్తోంది. కౌలురైతులను గుర్తించడాన్ని సరళతరం చేసేలా విధానాల్ని మార్చి, సేద్య విపణుల్ని సంస్కరించి, పంటల సమీకరణను వికేంద్రీకరించాలన్నవి మరికొన్ని సిఫార్సులు. సర్కారీ హామీని సుసాధ్యం కావించేందుకంటూ గడచిన ఏప్రిల్‌లో తనవంతుగా 'నీతిఆయోగ్' త్రిముఖవ్యూహం ప్రతిపాదించడం తెలిసిందే. అభివృద్ధిపరంగా, సాంకేతికంగా, విధానాలరీత్యా అమలుపరచాల్సిన నిర్దిష్ట చర్యల్ని అది అప్పట్లో పూసగుచ్చింది. బహుముఖ కార్యాచరణతో బృహత్ ప్రణాళిక చురుగ్గా పట్టాలకు ఎక్కాల్సిన దశలో- ఇటువంటి పరిమిత చర్యలు సంక్షుభిత సేద్యరంగాన్ని కుదుటపరచలేవు!

ప్రపంచంలో అమెరికా తరవాత అత్యధికంగా సుమారు 14కోట్ల హెక్టార్ల మేర సేద్యయోగ్య భూములు కలిగిన దేశం మనది. సాగులాయకీ అయిన భూవిస్తీర్ణంలో ఇండియా కన్నా చైనా తీసికట్టేగాని, తన జనాభా ఆహార అవసరాల్లో 95శాతందాకా అది సొంతంగా తీర్చగలుగుతోంది. అందుకు విరుద్ధ దృశ్యాలిక్కడ తాండవిస్తున్నాయి. స్థిరాదాయానికి రికాణా లేని రైతులు ప్రత్యామ్నాయ జీవికను అన్వేషిస్తూ పొలాలకు దూరమవుతుండగా, వివిధ ఆహార దిగుమతుల కోసం దేశం వెంపర్లాడాల్సి వస్తోంది. కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ నిరుడీ రోజుల్లో వెల్లడించిన వివరాల ప్రకారం- దేశంలో వ్యవసాయ కుటుంబం సగటు నెల రాబడి ఆరున్నర వేల రూపాయలలోపు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అంతకన్నా తక్కువ. ప్రధానికి ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వెల్లడించిన గణాంకాలు, రైతులకు నిజంగా దక్కుతున్నది అరకొరేనని స్పష్టీకరించాయి. రాబడి అనేముంది- వ్యవస్థాగత పరపతి, విత్తనాలు, గోదాములు, పంటల బీమా తదితరాలన్నింటా రైతన్నది నష్టజాతకమే. ప్రధాని మోదీ వ్యాఖ్యానించినట్లు- సాగుకు అవసరమైన దినుసుల్ని చిల్లర ధరకు కొనుగోలు చేస్తున్న రైతు, తన కష్టార్జితాన్ని టోకు ధరకు తెగనమ్ముకునే దురవస్థ నిక్షేపంగా వర్ధిల్లుతోంది. మార్కెట్ యార్డుల్లో దళారి ముఠాల దాష్టీకాలు, తూకాల్లో మోసాలను, తేమశాతం పేరిట నయవంచనను ఆమధ్య నీతిఆయోగ్ అధ్యయనమే అక్షరీకరించింది. కనీస మద్దతు ధరల విధానం తాలూకు నిష్ప్రయోజకత్వం పదేపదే రుజువవుతోంది. కాడీమేడీ పట్టనివ్వకుండా రైతుల్ని ఆవలకు పారదోలుతున్న దశాబ్దాల దుర్విధానాలకు చెల్లుకొట్టి అమలుపరచదగ్గ సహేతుక సూచనలెన్నో డాక్టర్ స్వామినాథన్ నివేదికల్లో పోగుపడి ఉన్నాయి. రైతుల రాబడిలో కంటితుడుపు పెంపుదల కాదు, మెరుగైన జీవన ప్రమాణాలు ఒనగూర్చేందుకు ఆ సిఫార్సులను ఔదలదాల్చడమే ఉత్తమ మార్గం!

సదాశయ సంకల్ప ప్రకటన వేరు, దీటైన కార్యాచరణను ఉరకలెత్తించడం వేరు. రైతుల రాబడిని రెండింతలు చేసేందుకు 14.5శాతం మేర ఉండాల్సిన వ్యవసాయాభివృద్ధి రేటు 2.2శాతం వద్ద తారట్లాడటం, మరిన్ని దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను తెలియజెబుతోంది. ఏటా అపరాలను, వంటనూనెల్ని పెద్దయెత్తున విదేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి రూపుమాసిపోయేలా వ్యవసాయ పరిశోధనల్ని కదం తొక్కించి, సృజనాత్మక ఆవిష్కరణలకు గొడుగుపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలో నేడు సాధారణ స్థాయి కన్నా అధిక దిగుబడి లభిస్తే ఆనవాయితీగా పంట ధర కుంగిపోవడం చూస్తున్నాం. ఉత్పాదకతను ఇనుమడింపజేసే కృషి రైతు కుటుంబాలకు అక్కరకు రావాలంటే, ఎక్కడికైనా ఎగుమతులు చేయగల స్వేచ్ఛ ఉండి తీరాలి. నిల్వ వసతులూ పెంపొందాలి. భౌగోళికంగా చాలా చిన్న దేశాలైన వియత్నాం, థాయ్‌లాండ్, మియన్మార్ వంటివి సేద్య ఉత్పత్తుల ఎగుమతుల్లో ఇండియాకన్నా మిన్నగా రాణించగలుగుతున్నాయి. ప్రతికూల పరిస్థితుల్లోనూ పొలాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న ఇజ్రాయెల్ విజయగాథ ఏ దేశానికైనా స్ఫూర్తిదాయకమే. మన రైతుల రాబడి రెండింతలు కావాలంటే ప్రస్తుతం 32 బిలియన్ డాలర్లకు (ఒక బిలియన్ డాలర్లు= రూ.6385 కోట్లు) పరిమితమైన దేశీయ సేద్య ఎగుమతులు 2022 నాటికి 120 బిలియన్ డాలర్లకు విస్తరించాలని భారత సస్య రక్షణ సమాఖ్య (సీసీఎఫ్ఐ) ఇటీవల మదింపు వేసింది. అందుకు తగ్గట్లు స్థానిక అనుకూలాంశాల ప్రాతిపదికన భిన్న వాతావరణ జోన్లలో సీజన్లవారీగా పంట ప్రణాళికల కూర్పు, పకడ్బందీ అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధత చాటాలి. సాగుదారులు ఎప్పుడు ఏ రకంగా నష్టపోయినా అన్నింటికీ తామున్నామని అవి సంపూర్ణ భరోసా కల్పించే వాతావరణం నెలకొన్నప్పుడే, భారతీయ రైతాంగానికి సేద్యం లాభదాయకమవుతుంది. జాతికీ ఆహార భద్రత సమకూరుతుంది!



పరిశ్రమకు ఊతం... ఉపాధికి ఊపు

గత ఏడాది మొదట్లో లేని సమస్యలు కొత్త సంవత్సరారంభంలో ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని తేరిపార చూస్తున్నాయి. ఈ సవాళ్ల మధ్య ఫిబ్రవరి ఒకటిన లోక్‌సభలో నాలుగో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నేడు వ్యవసాయ సంక్షోభం వల్ల గ్రామీణ జనాభా అసహనానికి లోనవుతోంది. నిరర్థక ఆస్తుల సమస్యతో సతమతమవుతున్న బ్యాంకులకు అదనపు మూలధనం అందించక తప్పదు. వివిధ వర్గాల డిమాండ్లను తీర్చడానికి కేంద్రప్రభుత్వం భారీగా నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. కానీ వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వల్ల ప్రభుత్వానికి రాబడి తగ్గి, ఆర్థిక వ్యవస్థ మందగతిన సాగుతోంది. దీనినుంచి బయటపడాలంటే తమకు మరిన్ని పన్ను రాయితీలు ఇవ్వాలని కార్పొరేట్ రంగం ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తోంది. పన్ను రాయితీలు, సబ్సిడీలు ఎక్కువైతే ద్రవ్యలోటు పెరిగి విదేశీ పెట్టుబడుల్ని నిరుత్సాహపరుస్తుంది. ఈ పరిస్థితిలో 2018లో ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో చేసే వాగ్దానాల్ని నెరవేర్చడానికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్నదే చిక్కు ప్రశ్న.

చమురు ధరల ప్రభావం ఎక్కువ

గత మూడేళ్లుగా అంతర్జాతీయ విపణిలో చమురు, లోహాలు, వ్యవసాయ ఉత్పత్తుల వంటి ముడిసరకుల ధరలు బాగా తగ్గినందువల్ల, భారత్‌లో ధరలు అదుపులో ఉన్నాయి. సాధారణంగా ప్రతి 10-15 ఏళ్లకు ఒకసారి ముడిసరకుల ధరలు సర్దుబాటుకు లోనై, ప్రభుత్వానికీ ఆర్థిక భారం తగ్గుతుంది. వివిధ వర్గాలపై సబ్సిడీల ఖర్చు క్షీణిస్తుంది. గత ఏడాది నుంచి ముడి సరకుల ధరలు మళ్లీ పెరగసాగాయి. దేశం ప్రధానంగా ముడి సరకులను; చక్కెర, ఉక్కుకడ్డీల వంటి మధ్యశ్రేణి వస్తువులను; సాఫ్ట్‌వేర్ సేవలనూ ఎగుమతి చేస్తోంది. ముడి, మధ్యశ్రేణి వస్తు ఎగుమతుల వల్ల వ్యవసాయ, ప్రైవేటు రంగాలు లబ్ధి పొందినా- స్వదేశీ వినియోగదారులు ఈ వస్తువుల ధరల పెరుగుదలను చవిచూడాల్సి వస్తుంది. ఈ ద్రవ్యోల్బణం ప్రభుత్వానికి సమస్యలు తెచ్చిపెడుతుంది. 2018లో ముడి చమురు ధర పెరుగుతూనే ఉంటే, ప్రభుత్వం ఆర్థికంగా కడగండ్లను ఎదుర్కోక తప్పదు. పశ్చిమాసియాలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం చమురు ధరల్ని ఎగదోస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చమురు ధర పీపాకు 55 డాలర్లు ఉంటుందని నిరుడు అంచనా వేశారు. అంతకన్నా ఎక్కువగా పెరిగితే ప్రభుత్వ బడ్జెట్ అంచనాలు తలకిందులు కావచ్చు. చమురు ధరలకు- మన దేశ వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థితిగతులకు ప్రత్యక్ష సంబంధం ఉంది. దాదాపు 80 శాతం చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఆధారపడినందున, ధరల పెరుగుదల- దిగుమతుల బిల్లును పెంచేస్తుంది. భారత్ నెలకు రూ.55,800 కోట్ల విలువైన చమురు దిగుమతి చేసుకొంటోంది. పీపా ధర ఒక్క డాలరు అధికమైనా వార్షిక దిగుమతి బిల్లు రూ.10,000 కోట్ల మేర పెరుగుతుంది. పది డాలర్లు పెరిగితే మన జీడీపీలో 0.4 శాతానికి సమానమైన మొత్తానికి కరెంటు ఖాతా లోటు ఏర్పడుతుంది. అయినా చమురు ధర పెంచి లోటును భర్తీచేసే వెసులుబాటు ప్రభుత్వానికి ఉండదు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటమే దీనికి కారణం. అంతర్జాతీయ చమురు ధర పెరుగుదల వల్ల ఏర్పడే నష్టాన్ని పూడ్చటానికి- పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్ ధరలు పెంచేందుకు ప్రభుత్వం జంకి ఆ నష్టాన్ని తానే భరించాల్సి రావచ్చు. పెట్రోలు, డీజిలుపై ఎక్సయిజు సుంకాన్ని తగ్గించనూ వచ్చు. దీనివల్ల ఖజానాకు బొర్రె పడక మానదు.



పెట్రోలు, డీజిలు సుంకాలను లీటరుకు రెండు రూపాయలు తగ్గిస్తే ప్రభుత్వానికి ఏటా రూ.26,000 కోట్ల ఆదాయ నష్టం సంభవిస్తుందని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి వివరించారు. చమురు ధరలు పది శాతం పెరిగినప్పుడు టోకు ధరల సూచి సగటున 0.5-0.7 శాతం హెచ్చుతుందని ఐఎంఎఫ్ అంచనా. దీనితో మూడేళ్లుగా చమురు ధరల తగ్గుదల వల్ల మెరుగుపడిన ప్రభుత్వ ఆర్థిక స్థితి మళ్లీ దిగజారిపోతుంది. రిజర్వుబ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించలేని దుస్థితిలోకి జారిపోవడంతో కంపెనీలకు, వ్యక్తులకు చౌక రుణాలు దుర్లభమవుతాయి. ఇది ఆర్థికాభివృద్ధిని వెనక్కు లాగక మానదు. వేసవిలో ఆహారంతో పాటు పలు వస్తువుల ధరలు పెరుగుతాయి. చమురు తెచ్చిన ద్రవ్యోల్బణానికి ఇది తోడైతే ప్రభుత్వం, ప్రజలు ఇక్కట్లపాలు కాక తప్పదు.


డాక్టర్ ఎస్. అనంత్


రాబోయే బడ్జెట్లో అధిక పెట్టుబడుల్ని ఆహ్వానించే ప్రతిపాదనలకు పెద్దపీట వేయాలి. 2016-17లో మొత్తం పెట్టుబడులు, పూర్తయిన ప్రాజెక్టుల విలువ రూ.6.3 లక్షల కోట్లయితే, 2017-18లో వాటి విలువ నాలుగు లక్షల కోట్ల రూపాయలకు మించదని భారత ఆర్థిక రంగ పర్యవేక్షణ సంస్థ లెక్కగట్టింది. కొత్త పెట్టుబడి ప్రతిపాదనలు 60 శాతం తగ్గిపోనున్నాయని బాంబు లాంటి వార్త పేల్చింది. 2004-05 తరవాత ఎన్నడూ లేనంత తరుగుదల ఇది. వస్తుసేవలకు గిరాకీ పెరుగుతుందనే నమ్మకం కొరవడటమే దీనికి కారణం. ప్రభుత్వం తక్షణం వస్తుసేవల వినియోగాన్ని పెంచే చర్యలు తీసుకోవాలి. వినియోగదారులు ఇప్పటికే భారీగా అప్పులు చేసి ఉన్నారు కాబట్టి, ఇప్పట్లో కొత్తగా రుణాలు తీసుకునే సత్తా వారికి ఉండదు. వ్యక్తిగత వ్యయాలు పెరగవు కనుక ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమొక్కటే మార్గం. ప్రభుత్వం ఖర్చు చేసే మొత్తాలు బహుళజాతి కంపెనీలకు కాకుండా వినియోగదారుల జేబుల్లోకి వెళ్లేలా జాగ్రత్తపడాలి. వినియోగదారుల వల్ల గిరాకీ పెరిగితే పెట్టుబడులు, ఉపాధి బాగా వృద్ధిచెందుతాయి.

వస్తుసేవలకు గిరాకీ పెరగాలి

ప్రభుత్వం నిరుడు రహదారులు, గృహ నిర్మాణంపై బాగా వ్యయం చేసింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దెబ్బతిన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి ఈ బడ్జెట్లో భారీ రాయితీలిస్తే అవి వేగంగా కోలుకుంటాయి. వ్యవసాయం తరవాత ఎక్కువ ఉపాధిని సృష్టించే రంగమిది. ఎంఎస్ఎంఈ యూనిట్లు దేశమంతటా వ్యాపించి ఉండటంవల్ల విస్తృతంగా ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఎంఎస్ఎంఈ కోసమే ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు నెలకొల్పడానికి రాష్ట్రప్రభుత్వాలకు నిధులిచ్చి ప్రోత్సహించాలి. భారీ ప్రాజెక్టుల కోసం వెంపర్లాడుతూ చిన్న పరిశ్రమలపై శీతకన్ను వేసే ధోరణిని రాష్ట్రప్రభుత్వాలు వదలించుకోవాలి. ఎంఎస్ఎంఈ యూనిట్లకు కొత్త టెక్నాలజీ, నిధులు, భూములు, విద్యుత్ సౌకర్యమిచ్చి ప్రోత్సహించడం ఆవశ్యకం. అవి భారీ పరిశ్రమల్లా ఏవో కొన్ని ప్రాంతాలకు పరిమితం కాకుండా దేశమంతటా వ్యాపించి ఉంటాయి. కనుక ఉపాధి అవకాశాలూ విస్తృతమవుతాయి. గ్రామాల్లో రహదారులు, జల వనరుల నిల్వ, పంపిణీ ప్రాజెక్టుల నిర్మాణంలో స్థానికులకు భాగస్వామ్యం కల్పిస్తే వారి ఆదాయాలు మెరుగుపడి వస్తుసేవలకు గిరాకీ పెరుగుతుంది.

దేశంలోని భూములన్నింటినీ మళ్లీ సర్వే చేసి భూ రికార్డుల్లో సమకాలీన మార్పుచేర్పులు జరపడానికి ప్రభుత్వం బాగా పెట్టుబడి పెట్టాలి. ప్రతి 30 ఏళ్లకు ఒకసారి భూముల రీ సర్వే జరగాలని 'కాగ్' సూచించింది. అనేక రాష్ట్రాల్లో భూముల సర్వే జరిగి 40-50 ఏళ్లవుతోంది. నిధులు, సిబ్బంది కొరత దీనికి మూలకారణం. భూముల రిజిస్ట్రేషన్, రెవిన్యూ- రాష్ట్రాల జాబితాలోని అంశాలు కాబట్టి కేంద్ర నిధులతో అవే రీ సర్వే జరపాలి. దీనికి మూడు నాలుగేళ్లలో రూ.50,000 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఆ ఖర్చుకు అపార ప్రయోజనం లభిస్తుంది. రీ సర్వేకి హెచ్చు సంఖ్యలో సిబ్బంది అవసరపడతారు. వారికి చెల్లించే జీతభత్యాలు గ్రామాల్లో వినియోగాన్ని, గిరాకీని పెంచుతాయి. భూ రికార్డుల్ని డీమ్యాట్ రూపంలోకి మార్చడం ఎంతో అవసరం. దీనివల్ల బినామీ లావాదేవీలకు, నల్లధన వ్యాప్తికి అడ్డుకట్ట పడుతుంది. రానున్న బడ్జెట్లో ఈ ప్రతిపాదనలన్నీ చేపడితే ప్రజల ఆదాయాలు, వాటితో పాటు వినియోగం, గిరాకీ పెరిగి కొత్త పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు మిన్నంటుతాయి. ప్రభుత్వం దీన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ రంగంపై రాయితీలను వర్షిస్తూ పోవడం ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం తోడ్పడదు. జీఎస్టీ వల్ల తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని కార్పొరేట్ వర్గాలూ చెబుతున్నాయి. అది నిజం కావడానికి ఇంకా ఒకటి లేదా రెండేళ్లు పడుతుంది. ప్రభుత్వం ఈలోగా తొందరపడిపోయి, కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు గుమ్మరించాలని చూడకూడదు!

పలు రంగాలపై పెట్టుబడుల పెంపుదలతో మేలు



ఎన్‌డీఏ ప్రభుత్వం భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించాలనే ధ్యేయం పెట్టుకున్నా, రకరకాల కారణాల వల్ల అది నెరవేరడం లేదు. ఒక దేశ ఎగుమతులు వృద్ధిచెందితే ఉద్యోగావకాశాలూ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. భారత్ నుంచి ప్రధానంగా సేవలు, ముడి సరకులు ఎగుమతి అవుతుంటాయి. వాటితో పోలిస్తే పారిశ్రామిక ఎగుమతులు అంతగా లేవు. ఈ పరిస్థితిలో ఉపాధి సృష్టికి వ్యవసాయం, వ్యాపారం, సేవలు, గనుల రంగాలే ప్రధాన ఆధారం. ఏటా ఉపాధి విపణిలో ప్రవేశించే రెండు కోట్లమందికి ఈ రంగాలు పని చూపలేవు. మొత్తంమీద పారిశ్రామిక ఉత్పత్తుల కన్నా ముడి సరకులు, మధ్యశ్రేణి వస్తువుల ఎగుమతులు పెరగడం ఆనందదాయకం కాదు. ఇటీవల భారతీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. కంపెనీల విలీన, స్వాధీనాలకూ విదేశీ నిధులు అందుతున్నాయి. దీనివల్ల రూపాయి విలువ పెరిగి మన ఎగుమతులు ఖరీదవుతున్నాయి. కార్మికులను అధికంగా ఉపయోగించే రంగాల ఎగుమతులు దీనివల్ల దెబ్బతిని ఉపాధికి ముప్పు వస్తోంది.

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టడానికి ముందున్న స్థాయికి గిరాకీ ఇంకా చేరకపోవడమూ ఉపాధి అవకాశాలకు గండికొడుతోంది. బడా కంపెనీల వస్తు నిల్వలు ఈమధ్య తగ్గినప్పటికీ- అవన్నీ అమ్ముడయ్యాయని, దీనివల్ల కొత్త సరకుల తయారీకి కంపెనీలు అదనపు సిబ్బందిని నియమించుకుంటాయని భావించనక్కర్లేదు. కంపెనీల సరకు టోకు, చిల్లర వర్తకుల వద్దకు చేరినా వాటిని వినియోగదారులు కొనేస్తున్నారని చెప్పలేం. జీఎస్టీని ప్రవేశపెట్టిన ఆరు నెలల తరవాత కూడా సూరత్ వంటిచోట్ల జౌళి మిల్లులు తమ స్థాపిత సామర్థ్యంలో 25 శాతాన్ని మాత్రమే ఉపయోగించుకొంటున్నాయి. గిరాకీ లేకపోవడం వల్ల ఇలా జరుగుతోంది. గిరాకీ లేకపోతే కొత్త పెట్టుబడులు ఎవరు పెడతారు, అవి లేకుంటే కొత్త ఉద్యోగాలు ఎలా పుట్టుకొస్తాయన్నవే ఎదురవుతున్న ప్రశ్నలు. దుస్తులు, తోలు వస్తువులు, పాదరక్షల తయారీ రంగాల్లో అదనంగా 300 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడితే లక్షన్నర ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని 2017 ఆర్థిక సర్వే అంచనా వేసింది. కాబట్టి ఈ రంగాల్లో గిరాకీ పెంచే చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలి.

గోడ మీది పిల్లివాటం


వీరేంద్ర కపూర్

ఒక్కోసారి కొన్ని విషయాల్లో నిర్దిష్టవైఖరి అనుసరించక తప్పని పరిస్థితిని రాజకీయాలు కల్పిస్తాయి. ముఖ్యమైన అంశాల్లో ఊగిసలాట, అస్పష్ట విధానం పనికిరావు. అవునా, కాదా... ఈ రెండింటిలో ఏదో ఒక మార్గాన్ని ఎంచుకోవలసిందే. ఈ విషయంలోనే కాంగ్రెస్ పార్టీకి పెద్ద చిక్కొచ్చిపడుతోంది. తానొవ్వక, నొప్పింపక అన్న తరహాలో- ఎవ్వరితోనూ ఎలాంటి పేచీ లేకుండా అందరికీ అన్నీ పద్ధతిలో ఇన్నాళ్లుగా ఆ పార్టీ సాగిపోతోంది. విదేశీ వ్యవహారాలైనా, ఆర్థిక విధానమైనా దానితీరు అంతే. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో కొంత సదభిప్రాయం మిగిలే ఉంది. అందుకే ఎన్నో ఎన్నికల విజయాలు సాధించగలిగింది. పెద్దపెద్ద నాయకులు ఎంతోమంది ఆ పార్టీని విడిచి వెళ్లారు. ఇదివరకటి సిద్ధాంతాలు, ఆదర్శాలవంటివీ ఇప్పుడు లేవు. అయినప్పటికీ కాంగ్రెస్ నేటికీ నిలదొక్కుకొని ఉండటానికి గల కారణం- స్వాతంత్ర్యోద్యమంలో ఆ పార్టీ పోషించిన క్రియాశీలపాత్రే.

దాటవేతలో దిట్ట!

ఒకప్పుడు సామ్యవాదం గురించి పెద్దపెద్ద మాటలు మాట్లాడిన ఆ పార్టీ, క్రమేపీ డబ్బు సంచులే సర్వస్వంగా భావించే స్థితికి దిగజారింది. కాంగ్రెస్ నాయకుల నుంచి కార్యకర్తల దాకా అంతా అవినీతికి లాకులెత్తారు. హామీలు, పథకాలు అటకెక్కాయి. ప్రజాసంక్షేమం పడకేసింది. రాజ్యాంగపీఠికలో పొందుపరచిన సామ్యవాదం బోర్లాపడింది. కాంగ్రెస్ పార్టీ కాస్తా ఒక కుటుంబ ఆస్తిగా మారిపోయింది. సాగినంతకాలం అలా సాగిపోయింది. సిద్ధాంత బలిమి, గట్టి సంస్థాగత నిర్మాణం కలిగిన పార్టీలు రంగ ప్రవేశం చేయడంతో కాంగ్రెస్‌కు గట్టిసవాలు ఎదురైంది. దాంతో ఆ పార్టీ ప్రభావం పరిమితం కాసాగింది. అయినప్పటికీ ఆ పార్టీ పాఠాలు నేర్చుకోలేదు. పాత పద్ధతులనే కొనసాగిస్తోంది. మండల్ రిజర్వేషన్లు, మందిర్ సమస్య, ఉమ్మడి పౌరస్మృతి... ఇలా ఏ విషయం తీసుకున్నా నేటికీ అస్పష్ట విధానమే అనుసరిస్తోంది. ఇటీవలి పార్లమెంటు శీతకాల సమావేశాల సందర్భంగా ఈ సంగతి మరోసారి రుజువైంది. అత్యంత కీలకమైన తలాక్ సమస్యపై ఆ పార్టీ దాటవేత వైఖరి అవలంబించింది. ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందేదాకా ఆ పార్టీ నిద్రపోయింది. బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. బిల్లుకు ఏ విధమైన సవరణలూ ప్రతిపాదించలేదు. బిల్లులో అందుకు కారణం. ఈ బిల్లు విషయంలో నిజంగానే ఏమైనా అభ్యంతరాలు ఉంటే, లోక్‌సభలోనే ప్రస్తావించి ఉండాల్సింది. విస్తృతస్థాయి చర్చకు పట్టుపట్టి ఉండాల్సింది. ఈ బిల్లు చట్టమై, పాలక ఎన్‌డీఏకు ఎక్కడ లబ్ధి చేకూరుతుందోనన్న అనుమానం రావడంతోనే కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకొంది. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకుంది. తన వాదనతో సాధారణ ప్రజానీకాన్ని ఒప్పించే ప్రయత్నం ఆ పార్టీ చేయలేదు. ముస్లి



రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకుంటున్న కాంగ్రెస్ సభ్యులు✦ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముస్లిము మహిళల విజయ సూచిక (పాత చిత్రాలు)

'తలాక్'పై కాంగ్రెస్ వింత వైఖరి

కొన్ని అంశాలు అస్పష్టంగా ఉన్నాయని అనిపిస్తే, ఆ విషయాన్ని ప్రస్తావించలేదు. పాలకపక్షం ఎలాంటి చర్చ లేకుండా లోక్‌సభలో బిల్లుకు ఆమోదం పొందేవరకు మిన్నకుండిపోయింది. ఒకేసారి ముమ్మార్లు తలాక్ చెప్పి, భార్య నుంచి విడాకులు పొందే భారతీయ ముస్లిములను శిక్షించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది.

ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందేదాకా చూస్తూ ఉండిపోయిన కాంగ్రెస్ పార్టీ, బిల్లు అక్కడి నుంచి రాజ్యసభకు రాగానే జూలువిదిల్చింది. ఎగువసభలో కాంగ్రెస్‌కు, దాని మిత్రపక్షాలకు కలిపి సంఖ్యాధిక్యత ఉండటమే ములపై పట్టుకలిగి ఉన్న ఇమాం- ముల్లా-మౌల్వీత్రయం మెప్పు పొందితే చాలనుకొంది. ముస్లిముల ప్రగతిపథాన్ని అడ్డుకొంటున్న ఛాందసులతో జట్టుకట్టింది. ముస్లిం జనాభాలో దాదాపు సగం మందిని తక్షణ తలాక్ బారినుంచి కాపాడే ప్రభుత్వ ప్రయత్నానికి మోకాలడ్డింది. బిల్లుమీద రాజ్యసభలో లేనిపోని అభ్యంతరాలు లేవనెత్తి దాన్ని సెలక్టు కమిటీకి పంపాల్సిందేనని పట్టుపట్టిన కాంగ్రెస్ పార్టీ, ముస్లిం మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే మతమూఢులకే వంతపాడింది.

భారతదేశంలో ముస్లిములు 18 కోట్లకు పైగా ఉంటారని అంచనా. దేశంలోని అతిపెద్ద అల్పసంఖ్యాక వర్గమిది. ఇలాంటి ముస్లిం మతవర్గానికి లైంగిక న్యాయం, సమానత కల్పించడానికి ఉద్దేశించిన ప్రగతిశీల బిల్లుకు అవరోధాలు కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తాను ఎవరి పక్షమో చాటుకొంది. వెంటవెంటనే ముమ్మార్లు తలాక్ చెప్పి, భార్యలకు విడాకులు ఇవ్వడాన్ని అనేక ముస్లిం దేశాల్లో ఇప్పటికే నిషేధించారు. భారతదేశంలోని ముస్లిం మహిళలకు మాత్రం ఈ విషయంలో న్యాయం జరగకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అడ్డుకోవడం దారుణం. మధ్యయుగాల నాటి ఆచారాలే నేటికీ కొనసాగాలన్నది ఆ పార్టీల ఉద్దేశం.

లోపలి ఆలోచన వేరు

ముమ్మార్లు తలాక్ చెప్పడం అక్రమమని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు చెప్పింది. దాని స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం చట్టం తేదలిస్తే, దాన్ని నిరోధించడం ద్వారా ఆ పార్టీ ఎవరికి మేలు చేయదలచిందో అర్థమవుతూనే ఉంది. ముమ్మార్లు తలాక్ చెప్పి, భార్యకు విడాకులిచ్చే భర్తను శిక్షించకుండా వదిలేస్తే, ఈ దురాచారం ఎలా అంతమవుతుంది? వరకట్నం అడుగుతున్నవారిని, బాల్య వివాహాలు చేస్తున్నవారిని శిక్షిస్తున్నప్పుడు- తలాక్ ద్వారా విడాకులు ఇస్తున్నవారిని ఎందుకు శిక్షించకూడదు? తలాక్ చెప్పి విడాకులు ఇచ్చిన భర్తను జైలుకు పంపిస్తే భార్య మనోవర్తి మాటేమిటి, చిన్న పిల్లల సంరక్షణ బాధ్యత ఎవరిదీ అంటూ కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. చట్టప్రకారం ఆ భార్యకు తగినంత మనోవర్తి ఇప్పించేందుకు, చిన్న పిల్లల పోషణ, బాధ్యత తీసుకొనేందుకు అవకాశాలు ఉన్నాయి. అంతేతప్ప, ఈ బిల్లు ఏకపక్షంగా ఏమీలేదు. పెళ్లి అనేది పవిత్ర క్రతువు కనుక, ముస్లిముల సున్నితమైన వివాహ వ్యవస్థలో జోక్యం చేసుకోకుండా ఉంటేనే నయమని సంస్కరణలను వ్యతిరేకిస్తున్నవారు వాదిస్తున్నారు. ఇలాంటప్పుడు ముస్లిం మహిళలు తరతరాల శృంఖలాల నుంచి బయటపడేదెన్నడు? అసలు సంస్కరణల గురించే ఆలోచించవద్దంటే ఎలా? సంస్కరణల పేరుతో తమ మత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవారికి వ్యతిరేకంగా మూకుమ్మడిగా ఓటువేస్తారన్నది ముస్లిముల మీద పడిన ముద్ర. అందుకే వారిని ప్రత్యేకంగా చూడాలని, వారి జోలికి వెళ్లరాదనీ అంటున్నారు. కాంగ్రెస్ తాజా వైఖరికి ఇదే అతిపెద్ద కారణమై ఉంటుంది!


శిల్పి

కఠిన శిలను కళాకారుడు ఓ సుందర శిల్పంగా తీర్చిదిద్దుతాడు. ఉలితో ఎంతో నైపుణ్యంగా కరిగించి, చివరికి ఓ కమనీయ రూపమిస్తాడు. ప్రాణం పోస్తాడు. రాతికి కవళికలు, కదలికలు కలిగిస్తాడు. ఎన్నింటినో అందులోకి ఆవాహన చేస్తాడు. అలాంటి అద్భుత అవకాశం తనకే వస్తే- మనిషి ఏం చేయాలి, ఏం చేస్తున్నాడు? ఆ శిల్పం మీద అతడికి ఎలాంటి అధికారం, హక్కు ఉండవు. ఏ విధంగా చూసినా, అల్పమైన రుసుముకు అనల్పమైన సౌందర్యాన్ని సృష్టించి ఇచ్చేంతవరకే శిల్పి ప్రమేయం! భగవంతుడు అటువంటి ఒక ప్రాణ శిలను చేతుల్లో పెడితే, దాన్ని ఎంతో గొప్ప జీవనశిల్పంగా మలచుకోవాల్సిన మనిషి ఏం చేస్తున్నట్లు?

మనిషికి భగవంతుడు జీవాన్నిచ్చాడు. జీవితంగా మలచుకొమ్మన్నాడు. జీవన వ్యాపార స్పృహ కలిగించాడు. వనరులతో పాటు విచక్షణ శక్తి ప్రసాదించాడు. అంతే తప్ప- నీళ్లలోకి దూకి చావాలని కాదు. నిప్పంటించుకొని కాలిపోవాలని కాదు. ఇది జీవితం. అనన్యమిది. అనుపమానమిది. భగవంతుడు జీవసంబంధ బీజాన్ని మానవుడి చేతుల్లోనే పెట్టాడు. 'నీలో నీవే నాటుకొని మొలకెత్తా'లన్నాడు. చివురుటాకుల చేతులు చాచి ఆనందంగా ఎదగాలన్నాడు. అంతటా విస్తరించాలన్నాడు.

మొక్క కంటే తీసిపోయినవాడు కాదు మనిషి! మొదట్లో పాదు నుంచి కనీసం కదలలేని ఆ చిన్న మొలక ఎంతగానో ఎదుగుతుంది. చిగురించిన క్షణం నుంచి చివరి క్షణం వరకు, ఆ తరవాతా దానిలో అదే ఎదుగుదల తత్వం ఉంటుంది. అలాగే మనిషి తనను తానే తీర్చిదిద్దుకునే అపురూపమైన అవకాశమిచ్చాడు భగవంతుడు. శరీరం, మనసు, బుద్ధి, జ్ఞానం, ఆరోగ్యం- అన్నింటినీ ఇచ్చాడు. ఎలా అంటే- అన్నీ ప్రాణికి ఇష్టమయ్యేలా, అతడు తనను తాను ఉద్ధరించుకునేలా, జన్మ సార్థకమయ్యేలా! దేవుడు ఉదారుడు. నిరంతర ప్రేమమయుడు. మనిషికిది అర్థం కాదు. అతడు అమాయకుడు, అయోమయుడు! కొన్నిసార్లు- కాదు- అనేకసార్లు. తనకు దైవం ఇచ్చినవేమిటో అతడికే పూర్తిగా తెలియదు.

మట్టిముద్ద ఇస్తే, కొందరు బాలలు దాన్ని అందమైన బొమ్మగా మారుస్తారు. అలంకారాలు చేస్తారు. ఆభరణాలతో అలంకరిస్తారు. పెద్దల మాటేమిటి? జీవితం, దాని పరిణామాలు అన్నీ వారివే. శిల, శిల్పంలా సంబంధం లేనివి కావు. జీవిత శిల్పం మనిషిదే. పిల్లలకిచ్చే మట్టి



ముద్దలా ప్రాణం, కదలికలు, వనరులు, విధివ్యాపారాలు లేనిది కాదు శరీరం. అన్నింటినీ దైవమే అమర్చి ఇచ్చాడు. ఇది పంచభూత సమన్వితం. పంచేంద్రియాల సమూహం. పంచప్రాణాల మయం. పింగళ సుషుమ్న నాడులు, ఆధ్యాత్మిక కేంద్రాలు, షట్చక్రాలు... ఈ దేహ వైభవం అనంతం. ఇదొక పరమాద్భుత చైతన్య యంత్రం. దీన్ని మనిషి నిశ్చేతన యంత్రంగా మార్చకూడదు. జీవన శిల్పాన్ని ఎడాపెడా తిప్పడం తగదు. ఏ కీలుకు ఆ కీలు విరవరాదు. విలువ తెలియనప్పుడు అలాగే ఉంటుంది. ఔన్నత్యం అర్థం కానప్పుడు ఆ విధంగానే సాగిపోతుంది. మొక్కలా మనిషి ఎదగడం లేదు. విస్తరించడం లేదు. పైగా, తనలోకి తాను కుదించుకుపోతున్నాడు.

భగవానుడు విశ్వసించి ఉదారంగా అందజేసిన ఈ అపురూప సజీవ శిలను ప్రతి మనిషీ అద్భుత శిల్పంగా రూపుదిద్దుకోవాలి. శిలను శిల్పంగా మలచడం దైవానికి రాక కాదు. చేతకాక కాదు. ఆ కళను మనిషికి నేర్పించాలని, మనిషీ అది నేర్చుకోవాలని ఆయన కోరిక. అందమైన ఆటలోని ఆనందాన్ని మనిషి ఆస్వాదించాలన్నదే భగవానుడి అభిమతం. ఎంతో సానుకూలమైన, స్పందనాశీలత కలిగిన శిల ఇది. దీన్ని శిల్పంగా మలచలేని, ఆ పని రాని మనిషి- దీనిలోకి దైవాన్ని ఆవాహన చేయలేడు. ఆరాధనీయంగా మార్చలేడు. తనను తాను ఆ స్థాయికి మలచుకున్నారు కాబట్టి, రామకృష్ణ పరమహంస తనకు తానుగా ఆత్మార్చన, పుష్పార్చన చేసుకున్నారు. కనీసం ఆ ప్రయత్నమైనా ప్రారంభించకుంటే- మానవ జన్మకు అర్థం పరమార్థం రెండూ ఉండవు.

- చక్కిలం విజయలక్ష్మి

అంతర్యామి

తెలంగాణ చారిత్రక వైభవాన్ని చాటి చెబుతాం: మంత్రి చందూలాల్

నేటి నుంచి సదస్సు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రాచీన వారసత్వ సంపద, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఉద్దేశంతో 19, 20 తేదీల్లో మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో 'తెలంగాణ త్రూ ఏజెస్' అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి చందులాల్ పేర్కొన్నారు. పురాతత్వ శాఖను ఇక నుంచి హెరిటేజ్ తెలంగాణగా పిలుస్తామన్నారు. గురువారమిక్కడ సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కోటిలింగాలలో లభ్యమైన నాణేలు, ఇతర ఆధారాల ప్రకారం ఈ గడ్డకు గొప్ప చరిత్ర ఉందని తెలుస్తోందన్నారు. ఇలాంటి వాటిపై పరిశోధనలను ప్రోత్సహించేలా సదస్సులో చర్చలు ఉంటాయన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధక విద్యార్థులతో పాటు.. అమెరికా, బ్రిటన్, ఇటలీ, గ్రీస్ దేశాలకు చెందిన ఐదుగురు పురాతత్వ పరిశోధకులు సదస్సులో పాల్గొంటారన్నారు. సాంస్కృతిక, పర్యటకశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం మాట్లాడుతూ..రాతి యుగానికి చెందిన పురాతన, చారిత్రక కట్టడాలు ఇక్కడ కన్పిస్తున్నాయని, వీటిని ప్రపంచానికి తెలియజెప్పేందుకే సదస్సు నిర్వహిస్తామన్నారు. పురావస్తుశాఖ డైరెక్టర్ ఎన్.ఆర్.విశాలాచ్చి తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టాలూ అందుకోవచ్చు

పీహెచ్‌డీ పూర్తిచేసిన వారందరూ స్నాతకోత్సవంలో వేదికపై ముఖ్యఅతిథి ద్వారా డాక్టరేట్ పట్టాలు అందుకోవచ్చని జేఎన్‌టీయూహెచ్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది మార్చిలో జేఎన్‌టీయూహెచ్ స్నాతకోత్సవం జరగనున్న నేపథ్యంలో.. వివిధ కోర్సుల్లో బంగారు పతకాలు సాధించిన వారు తప్ప మిగిలిన వారందరికీ డాక్టరేట్ పట్టాలను రిజిస్టర్ పోస్టులో పంపిస్తామని ఇటీవల అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యున్నత డిగ్రీగా పేర్కొనే పీహెచ్‌డీ పూర్తి చేసినా వేదికపై నుంచి పట్టాలను అందుకునే అవకాశం లేదనే ఆవేదన కొందరిలో వ్యక్తమైంది. అందరూ 500 లోపే ఉంటారని అంచనాకు వచ్చిన జేఎన్‌టీయూహెచ్ వారికి కూడా అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు వారికి సంక్షిప్త సందేశాల ద్వారా సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణలో సుజుకి మోటార్స్

- మంత్రి కేటీఆర్‌కు సంస్థ ఛైర్మన్ హామీ
- పెట్టుబడులు పెట్టాలని వివిధ సంస్థలకు మంత్రి పిలుపు

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణలో సుజుకి పరిశ్రమను ఏర్పాటు చేస్తామని సుజుకి మోటార్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒసాము సుజుకి మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. త్వరలోనే తమ ప్రతినిధి బృందం తెలంగాణను సందర్శించి, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తుందన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా గురువారం రెండోరోజు జపాన్‌లోని షిజువొక రాష్ట్రంలో కేటీఆర్ పర్యటించి, సుజుకితో భేటీ అయ్యారు. వాహనాల తయారీని అత్యంత ప్రాధాన్య రంగంగా గుర్తించి, భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పారిశ్రామిక విధానం, టీఎస్ఐపాస్‌ల గురించి చెప్పారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు



సుజుకి మోటార్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒసాము సుజుకితో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు వివేక్

పెట్టేందుకు ముందుకు రావాలన్నారు. ఇందుకు సుజుకి స్పందిస్తూ- తెలంగాణ పారిశ్రామిక విధానం అద్భుతమనీ, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ సుజుకి మ్యూజియాన్ని సందర్శించి, వాహనాల తయారీ చరిత్రను తెలుసుకున్నారు. తర్వాత షిజువొక గవర్నర్ కవాకాస్తుహైటాతో సమావేశమయ్యారు. తెలంగాణలో పర్యటించాలని ఆహ్వానించగా, మార్చిలో వస్తామని గవర్నర్ చెప్పారు. తర్వాత షిజువొక బ్యాంకు ప్రతినిధులను మంత్రి కలిశారు. తెలంగాణలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో పెట్టుబడులకు సహకారం కోరారు. షిజువొక బ్యాంకును అక్కడ నెలకొల్పాలన్నారు. తర్వాత మంత్రి సకురాయి లిమిటెడ్, స్టాన్లీ ఎలక్ట్రిక్, ఏఎస్‌టీఐ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఆటోమోటివ్ విడిభాగాల పరిశ్రమలను రాష్ట్రంలో నెలకొల్పాలని కోరారు.

అనధికారికంగా హైదరాబాదే దేశ రెండో రాజధాని

హైదరాబాద్‌కు అధికారికంగా హోదా ఇవ్వకపోయినా, దేశ రెండో రాజధానిగా ఇప్పటికే గుర్తింపు పొందిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దిల్లీ తర్వాత రాష్ట్రపతి అధికార నివాసం ఇక్కడే ఉందన్నారు. గురువారం పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్‌కి ఆయన ట్విట్టర్‌లో సమాధానమిస్తూ, ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉపాధ్యాయ ఖాళీలు పదమూడు వేలే

- 40 వేల పోస్టులు ఏ ప్రాతిపదికనో భాజపా చెప్పాలి
- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

ఈనాడు, హైదరాబాద్: 'తెలంగాణ రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయ ఖాళీలు 13 వేలు మాత్రమే... అందులో 8,792 పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రకటన ఇచ్చాం. మిగిలినవి పదోన్నతుల ద్వారా భర్తీ అవుతాయి' అని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టంచేశారు. అందుకు భిన్నంగా ఉపాధ్యాయ ఖాళీలు 40 వేలు ఉన్నాయని ఏ



ప్రాతిపదికన చెబుతున్నారని ఆయన భాజపా నేతలను ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందని, 40 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తదితరులు విమర్శలు చేసిన నేపథ్యంలో కడియం స్పందించి గురువారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అమలు చేస్తున్న పథకాలను కేంద్రం ప్రశంసించి మిగతా రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచిస్తుంటే... రాష్ట్ర భాజపా నేతలు మాత్రం విమర్శిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత విద్యార్థుల డ్రాపౌట్లు తగ్గాయని, ఈ విషయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు తక్కువగా ఉందని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక రాష్ట్రానికి వచ్చిన కొత్త విద్యాసంస్థలేమిటో భాజపా నేతలే చెప్పాలన్నారు. కేంద్రానికి తామిచ్చిన వినతి పత్రాలను రాష్ట్ర భాజపా నేతలకూ పంపుతున్నామని, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, దత్తాత్రేయ తమ పలుకుబడి ఉపయోగించి ఆయా సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తే మంచిదన్నారు. తెలంగాణలో తెదేపాను తెరాసలో విలీనం చేయాలన్న తెదేపా నేత మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని కడియం శ్రీహరి పేర్కొన్నారు.

ప్రాజెక్టులకు రూ.46 వేల కోట్లు అవసరం

- ప్రతిపాదించిన చీఫ్ ఇంజినీర్లు

ఈనాడు, హైదరాబాద్: గుత్తేదారులతో చేసుకొన్న ఒప్పందాల ప్రకారం పనులు జరగాలంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారీగా బడ్జెట్ కేటాయించాలని ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు ప్రతిపాదించినట్లు తెలిసింది. తెలంగాణలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ ఇలా అన్నింటికీ 2018-19లో రూ.46వేల కోట్లు అవసరమని చీఫ్ ఇంజినీర్లు ప్రతిపాదించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదలశాఖ అన్ని ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లను కోరింది. 2017-18లో రూ.25వేల కోట్లు కేటాయించినా, ఇప్పటివరకు ఆర్థికశాఖ విడుదల చేసిన నిధులను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలివ్వాలని సూచించింది. ఎంత గడువులోగా పూర్తి చేయాలో పనుల ఒప్పందంలో స్పష్టంగా ఉందని, ఆమేరకు ప్రతిపాదనలిచ్చామని, ఎంత కేటాయించేది ప్రభుత్వానికి సంబంధించినదని పలువురు ఇంజినీర్లు పేర్కొన్నారు. మొత్తం రూ.46వేల కోట్లు ప్రతిపాదించగా, ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.13వేల కోట్లు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ.11వేల కోట్లు కోరినట్లు తెలిసింది. మిషన్‌కాకతీయతో సహా చిన్ననీటి వనరులకు రూ.ఐదువేల కోట్లు ప్రతిపాదించినట్లు సమాచారం. సీతారామ ఎత్తిపోతల, దిండి, ప్రాణహిత, దేవాదుల, ఎస్.ఎల్.బి.సి పథకాలకూ భారీగా కోరినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలపై మంత్రి హరీశ్‌రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జోషితో చర్చించాక తుది ప్రతిపాదనలు ఆర్థికశాఖకు పంపనున్నట్లు నీటిపారుదలశాఖ వర్గాలు తెలిపాయి.

కల్వకుర్తి కాలువ సామర్థ్యం పెంపునకు సిఫార్సు: కల్వకుర్తి ఎత్తిపోతల కాలువ సామర్థ్యాన్ని ఐదువేల క్యూసెక్కులకు పెంచాలని నీటిపారుదలశాఖ నియమించిన కమిటీ సిఫార్సు చేసింది. ఈ పథకం ద్వారా 3800 క్యూసెక్కుల ప్రవాహానికి తగ్గట్లుగా మొదట డిజైన్ చేసి తర్వాత నాలుగువేల క్యూసెక్కులకు పెంచారు. గత ఖరీఫ్‌లో మోటార్లను పూర్తిస్థాయిలో నిర్వహించినపుడు కాలువలకు గండ్లు పడటం, దెబ్బతిన్న నేపథ్యంలో విశ్రాంత ఇంజినీర్ ఇన్‌చీఫ్ విజయప్రకాశ్, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీఓ), మహబూబ్‌నగర్ జిల్లాల చీఫ్ ఇంజినీర్లతో నీటిపారుదల శాఖ కమిటీని నియమించింది.

ఎన్‌జీవోలు, కలెక్టర్ల జోక్యాన్ని నివారించాలని వినతి

ఈనాడు, హైదరాబాద్: కొన్ని జిల్లాల్లో సర్కారు బడుల్లో విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన బోధనా విధానానికి సమాంతరంగా సొంత పద్ధతులను అమలు చేయాలని కలెక్టర్లు ఆదేశించడం, స్వచ్ఛంద సేవాసంస్థలు ఒత్తిడి తేవడం వల్ల ఉపాధ్యాయులపై పనిభారం అధికమవుతోందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆవేదన వ్యక్తంచేసింది. ఈ మేరకు కమిటీ నాయకులు సీహెచ్ రాములు, చావ రవి, కొండల్‌రెడ్డి, రఘుశంకర్‌రెడ్డి, లింగారెడ్డి, పోచయ్య తదితరులు గురువారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్యకు ఫిర్యాదు చేశారు. సెలవుల మంజూరు అధికారం ప్రధానోపాధ్యాయులకే ఉండాలని కోరుతూ ఈనెల 19, 20 తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు.

సర్పంచుల ఎన్నిక ప్రత్యక్ష విధానంలోనే జరగాలి

- పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు, అనుమానాల నివృతికి అఖిల పక్షాన్ని పిలవాలి
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో సర్పంచుల ఎన్నిక ప్రత్యక్ష విధానంలోనే జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు, ఎన్నికలపై అనుమానాలను నివృత్తి చేసేందుకు అఖిలపక్షాన్ని పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్ట సవరణలు, ఎన్నికలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క, శాసనసభ, మండలిలో విపక్ష నేతలు జానారెడ్డి, షబ్బీర్



సమావేశమైన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, భట్టి, షబ్బీర్‌అలీ, తదితరులు

అలీ, జీవన్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు వీహెచ్, పొన్నాల లక్ష్మయ్య, చిన్నారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలను తెరాస సర్కారు నిర్వీర్యం చేసిందని, కేంద్ర నిధులు మినహా..రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వలేదన్నారు. ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడంలో ఆరితేరిన కేసీఆర్.. వార్డు సభ్యులను కొనేందుకే పరోక్ష ఎన్నికలకు మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనవరి 23న అన్ని గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహిస్తామని, 27న అన్ని గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందచేస్తామని, 30న ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు పంచాయతీ ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలని వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. పంచాయతీలుగా మారే తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 లక్షల చొప్పున కేటాయించాలన్నారు. రైతులకు కొత్త పాసు పుస్తకాల పంపిణీకి ముందే బ్యాంకుల్లో ఉన్నవాటిని విడిపించాలన్నారు. 2017 డిసెంబరు 15న ప్రకటించాల్సిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల సంఘం ఇంత వరకు ప్రదర్శించలేదని, ఇందులో ప్రభుత్వ కుట్ర దాగుందనే అనుమానం కలుగుతోందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల్నే వాడాలని, వార్డుల పునర్విభజనపై ఈసీ అఖిలపక్షాన్ని పిలవాలని ఉత్తమ్ కోరారు.

ఎన్నికలను న్యాయబద్ధంగా నిర్వహించాలి

పంచాయతీ ఎన్నికలను న్యాయబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డిని కాంగ్రెస్ నేతలు కోరారు. గురువారం మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీ ప్రతినిధులు నిరంజన్, వినోద్‌రెడ్డి, మహ్మద్ ఆబిద్ రసూల్‌ఖాన్, శ్యాంమోహన్, రాజేశ్వర్‌రావు తదితరులతో కూడిన బృందం నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ... ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించకపోవడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తొలగించిన ఓటర్ల వివరాలను పార్టీలకు ఇవ్వాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఈసీని కోరామన్నారు. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఆగస్టు వరకు ఉన్న నేపథ్యంలో న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు చెప్పారు.

ఎయిమ్స్‌కు నిధులివ్వండి

కేంద్రానికి ప్రధాన కార్యదర్శి లేఖ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను నెలకొల్పడానికి వీలుగా వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ వైద్యంలో ఎయిమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు ఆవశ్యకత ఉందని, నాణ్యమైన వైద్యసేవలు లభించాలని రాష్ట్రప్రజలు కోరుకుంటున్నారని తెలిపింది. 2014 అక్టోబరు 9న దిల్లీలో జరిగిన వైద్యఆరోగ్య ముఖ్యకార్యదర్శుల సమావేశంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రే స్వయంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఎయిమ్స్ తరహా వైద్యసంస్థలను నెలకొల్పాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారని, ఎయిమ్స్ కోసం 200 ఎకరాలను గుర్తించాలని సూచించారని పేర్కొంది. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లోనూ తెలంగాణలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారనీ, రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా గతంలో ఎయిమ్స్‌ను త్వరితగతిన తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్రానికి లేఖ పంపించారంది. వీటిని పరిగణనలోకి తీసుకొని 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఎయిమ్స్ నెలకొల్పడానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ గురువారం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి ప్రీతి సుదాన్‌కు అధికారికంగా లేఖ పంపించారు.

అందుబాటులోకి సంచార దంత వైద్యం: ఆరోగ్య మంత్రి

గ్రామీణంలో ప్రజలు ఎదుర్కొంటున్న దంత సమస్యలను వారి ఊళ్లలోకే వెళ్లి పరీక్షించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సంచార దంత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.40 లక్షల వ్యయంతో అధునాతన వైద్యపరికరాలు, డిజిటల్ ఎక్స్‌రే వంటి నిర్ధారణ పరీక్షల పరికరాలతో కూడిన నూతన బస్సును శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు. ఇందులో తేలికపాటి దంత శస్త్రచికిత్సలను చేయడానికి అనుకూలంగా వాహనాన్ని రూపొందించారు.

భారీగా గుట్కా తయారీ

- రూ.3.60కోట్ల విలువైన సరకు పట్టివేత
- మహారాష్ట్రకు ఎగుమతి చేస్తున్న ముగ్గురి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న గుట్కా రాకెట్‌ను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. పాతబస్తీలోని ఇస్మాయిల్‌నగర్‌లో గుట్కా తయారీ కర్మాగారాన్ని నిర్వహిస్తున్న ముగ్గురు నిందితులు షుజాత్ అలీఖాన్, ఖాజాసలీముద్దీన్, మహ్మద్ రహీముద్దీన్‌లను అరెస్ట్‌చేశారు. దాదాపు రూ.3.60కోట్ల విలువైన 84 గుట్కాసంచులను, 8 గుట్కా తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను నగర కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు గురువారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మల్లేపల్లిలో నివాసముంటున్న షుజాత్ అలీఖాన్‌కు పాతబస్తీలో పలు వ్యాపారాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిషేధిత జాబితాలో ఉన్న గుట్కా తయారు చేస్తే రూ.కోట్ల లాభాలొస్తాయని అతను భావించి, గుట్కాను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న వ్యాపారుల వివరాలు సేకరించాడు. ఔరంగాబాద్‌లో ఉంటున్న గోఖలే, అలీమ్‌లు రూ.కోట్లలో గుట్కాను అమ్ముతున్నారని తెలుసుకుని వారిని సంప్రదించాడు. గుట్కా తయారీకి అవసరమైన ముడిసరుకులు అందిస్తామని, ప్యాకింగ్ చేసి పంపితే రూ.లక్షలు ఇస్తామని వారు షుజాత్‌కు చెప్పారు. ఇందుకు అంగీకరించిన షుజాత్ గుట్కా తయారీ కోసం ఇస్మాయిల్‌నగర్‌లో ఓ గోదాంను అద్దెకు తీసుకున్నాడు. తయారీ, ప్యాకింగ్, కర్మాగార నిర్వహణ బాధ్యత సలీముద్దీన్‌కు, గుట్కా సంచులను మహారాష్ట్రకు తరలించే బాధ్యతను రహీముద్దీన్‌కు అప్పగించాడు. గుట్కా తయారీ కోసం 50మంది కూలీలను కాన్పూర్ నుంచి రప్పించారు. ఏడాది నుంచి సాగుతున్న వీరి అక్రమాల గురించి కొద్దిరోజుల క్రితం పోలీసులకు సమాచారమందింది. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్ కర్మాగారంలో పనిచేస్తున్న వారి కదలికలపై నిఘా ఉంచారు. బుధవారం అర్ధరాత్రి దాడి చేసి



పాతబస్తీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు, యంత్రాలు, వాహనాలు

ఔరంగాబాద్ తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆరు లారీలను, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో కొందరు నిందితులు అక్రమంగా గుట్కా తయారు చేసి రైళ్లు, ఆర్టీసీ బస్సులు, లారీలు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో తరలిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని నగర కమిషనర్ వి.వి.శ్రీనివాస్ తెలిపారు. ఇకపై గుట్కా, గంజాయి తరలిస్తున్న నిందితుల తోపాటు రైల్వే, ఆర్టీసీ శాఖలపైనా కేసులు నమోదు చేయనున్నామని వివరించారు.

శిక్షణ వ్యయాన్ని సర్కారే భరించాలి

- ద్విచక్ర అంబులెన్సు సేవకుల అభ్యర్థన

ఈనాడు, హైదరాబాద్: అత్యవసర వైద్యంలో అత్యంత వేగంగా ప్రాథమిక చికిత్స అందించాలనే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించిన ద్విచక్ర అంబులెన్సు వాహనచోదకులు, సాంకేతిక నిపుణులు సేవలు ప్రారంభించిన మలి రోజే గురువారం తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ద్విచక్ర అంబులెన్సు సేవల్లో పాల్గొనడానికి అత్యవసర వైద్యసేవలు, పరిశోధన సంస్థ(ఈఎంఆర్ఐ) శిక్షణకు అభ్యర్థులను ఆహ్వానించింది. శిక్షణ కాలానికి రూ.16 వేలు రుసుము నిర్దేశించింది. మిగిలింది ఇప్పటి వరకూ నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చింది. ఐదో బృందానికి శిక్షణ ఇచ్చే క్రమంలో మెప్మా పథకం కింద నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించడంతో.. తమకూ ఉచిత పథకాన్ని వర్తింపజేయాలని విధుల్లో చేరిన అభ్యర్థులు ఈఎంఆర్ఐని కోరారు. తాము చెల్లించిన రుసుమును వెనక్కివ్వాలని అభ్యర్థించారు. ఈ విషయంపై జాతీయ ఆరోగ్య మిషన్ పథకాల ముఖ్యఅధికారి డాక్టర్ శ్రీనివాసరావును 'ఈనాడు' సంప్రదించగా.. 'అభ్యర్థుల నుంచి ఈఎంఆర్ఐ శిక్షణకు రుసుమును స్వీకరిస్తున్న విషయం మా దృష్టికి రాగానే ఉన్నతాధికారులతో మాట్లాడాను. రుసుమును తిరిగి చెల్లించాలని ఆదేశించాం' అన్నారు.

ఉద్యోగుల బీమా న్యాయస్థానాన్ని ఆశ్రయించండి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ఉద్యోగుల బీమా చట్టం-1948 కింద ఈఎస్ఐ కార్పొరేషన్ జారీచేసిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ఉద్యోగుల బీమా న్యాయస్థానం(ఎంప్లాయిస్ ఇన్సూరెన్స్ కోర్టు)లో అప్పీలు దాఖలు చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్(ఫైనాన్స్)కు హైకోర్టు స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్ ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఈఎస్ఐ చట్టం కింద బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొంటూ ఈఎస్ఐ అధికారులు ఉత్తర్వులు జారీచేయడాన్ని సవాలు చేస్తూ.. జీహెచ్ఎంసీ(ఫైనాన్స్) కమిషనర్ హైకోర్టును ఆశ్రయించగా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. చిత్రంలో ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజల వద్దకు ఎన్టీఆర్ సిద్ధాంతాలు

అమరావతిలో నిలువెత్తు విగ్రహం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఒక సామాన్యుడు తన జీవితంలో సాధించిన విజయాలతో తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నందమూరి తారకరామారావు వ్యక్తిత్వాన్నీ, ఇచ్చిన స్ఫూర్తినీ రాబోయే తరాలకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. ప్రజల వద్దకు ఎన్టీఆర్ సిద్ధాంతాలను తీసుకువెళ్తామన్నారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం నెలకొల్పుతామనీ, ఎన్టీఆర్ మెమోరియల్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఖైరతాబాద్, అమీర్‌పేట, న్యూస్‌టుడే: దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు 22వ వర్ధంతి సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ఘాట్‌లోని ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, తెదేపా నేతలు నివాళులర్పించారు. బాలకృష్ణ, హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, తారకరత్న, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, నారా బ్రాహ్మణిలతో పాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రమణ, సీనియర్ నేతలు మోత్కుపల్లి, పెద్దిరెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం ప్రయత్నాలు కొనసాగిస్తామని చెప్పారు. తెదేపా రాష్ట్ర కార్యాలయంలోనూ ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.



ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న బాలకృష్ణ. చిత్రంలో ఎల్. రమణ తదితరులు

తెదేపా లేదనేకంటే తెరాసలో విలీనమే మేలు

మోత్కుపల్లి సంచలన వ్యాఖ్యలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో తెలుగుదేశం పార్టీ లేదనే కంటే తెరాసలో విలీనం చేస్తే గౌరవంగా ఉంటుందని తెదేపా సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సమయం కేటాయించడం లేదనీ, వచ్చి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో తెదేపా అంతరించి పోయిందన్న వాతావరణం నెలకొందనీ, భుజాన ఎత్తుకుని కాపాడుకుందామన్నా సహకరించే వారు లేరన్నారు. మనుగడలేకుండా పోయిందనే కంటే తెరాసలో విలీనం చేయడమే మేలనీ, తద్వారా పార్టీకి గౌరవం ఉంటుందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఘాట్ వద్ద ఉన్న తెతెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ స్పందిస్తూ అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

మోత్కుపల్లి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం: లోకేష్

మోత్కుపల్లి వ్యాఖ్యలను ఏపీ మంత్రి నారా లోకేష్ ఖండించారు. అవి పూర్తిగా ఆయన వ్యక్తిగతమన్నారు. గురువారం కలెక్టర్ల సదస్సు జరుగుతున్నందునే చంద్రబాబు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కి వెళ్లలేదన్నారు.

అవగాహన లేకుండా సీఎం ప్రకటనలు: చాడ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ చట్టాలపై ఏమాత్రం అవగాహన లేనట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. గురువారం మఖ్దూం భవన్‌లో ఆయన మాట్లాడారు. గడువుకు ముందే ఎన్నికలు నిర్వహిస్తామని, ప్రత్యక్ష పద్ధతిలో కాకుండా పరోక్షంగా చేపడతామంటూ చేస్తున్న ప్రకటనలు సీఎం అవగాహన రాహిత్యాన్ని చాటుతున్నాయన్నారు. నయీం కేసులో కొనసాగుతున్న పరిణామాలపై ఈనెల 24న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇసుక మాఫియా ఆగడాలపై పుస్తకాన్ని ముద్రించబోతున్నట్లు చెప్పారు. సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన బహుజన ఫ్రంట్‌లో చేరే విషయాన్ని తాము ఇప్పుడే చెప్పలేమన్నారు.

దీర్ఘాయుష్షు ప్రోటీన్ గుట్టువిప్పారు

వాషింగ్టన్: దీర్ఘాయుష్షుతో సంబంధమున్న ఓ ప్రోటీన్ రహస్యాల గుట్టును శాస్త్రవేత్తలు విప్పారు. మధుమేహం, ఊబకాయం, క్యాన్సర్ వంటి ఎన్నో వ్యాధుల చికిత్సల్లో కొత్త విధానాలను రూపొందించేందుకు.. ఈ పరిణామం దోహదపడే అవకాశాలున్నాయి. ఆయుష్షు, జీవక్రియల నియంత్రణలో క్లోతో ప్రోటీన్లు కీలక పాత్ర పోషిస్తాయి. వాటిలో ఒకటైన బెటా-క్లోతో ప్రోటీన్ 3-డీ నిర్మాణాన్ని.. తాజాగా అమెరికాలోని యేల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఎక్స్-రే క్రిస్టలోగ్రఫీ విధానాన్ని ఉపయోగించి బయటపెట్టారు. ఫలితంగా దీని సంక్లిష్టమైన నిర్మాణ తీరు, చికిత్స సామర్థ్యం గురించి తెలుసుకునేందుకు వారికి వీలు చిక్కింది. ఎఫ్‌జీఎఫ్21 అనే హార్మోన్‌ను బెటా-క్లోతో గ్రహిస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇన్సులిన్ పట్ల స్పందనను, గ్లూకోజ్ సంబంధిత జీవక్రియలను ఎఫ్‌జీఎఫ్21 ప్రేరేపిస్తుందని.. ఫలితంగా బరువు తగ్గడానికి కారణమవుతుందని పేర్కొన్నారు.

వేరుసెనగ కొనుగోలుకు మార్కెట్ రుసుం రద్దు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో పండించే వేరుసెనగ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు టీఎస్ ఆయిల్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించినందున మార్కెట్ రుసుం రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

శంషాబాద్‌లో విదేశీ కరెన్సీ పట్టివేత

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ విమానాశ్రయంలో సుమారు రూ.1.05కోట్ల విలువైన విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి దుబాయికి విదేశీ కరెన్సీని తరలించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు.

నేరస్థుల్లో మార్పు తెచ్చేందుకే సర్వే

- నేరాలు వదిలేస్తే ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు
- రాష్ట్రవ్యాప్తంగా 2.18 లక్షల మంది వ్యవస్థీకృత నేరస్థులు
- సర్వే విజయవంతమైంది: డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్ ఠాణా పరిధిలో మాన్గర్ బస్తీలో పర్యటించిన డీజీపీకి సమస్యలు విన్నవించుకుంటున్న స్థానికులు

ఈనాడు, హైదరాబాద్, రాయదుర్గం, మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: దొంగతనాలు, హత్యలు, దోపిడీలు చేస్తూ పదే పదే పోలీసులకు పట్టుబడుతున్న నేరస్థులు నేరప్రవృత్తిని విడిచిపెడితే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. పదేళ్ల నుంచి వ్యవస్థీకృతంగా నేరాలకు పాల్పడుతున్న వారి వివరాలు సేకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో గురువారం సమగ్ర సర్వే చేపట్టామన్నారు. పోలీసు రికార్డుల్లో ఉన్న 2.18 లక్షల మంది నేరస్థుల తాజా స్థితిగతులను గుర్తించేందుకు సర్వే చేపట్టినట్లు వివరించారు. హైదరాబాద్‌లోని మాంగార్‌బస్తీ, మాదాపూర్, సరూర్‌నగర్‌లలో సర్వే తీరును ఆయన పరిశీలించారు. కొంతమంది నిందితులతో స్వయంగా మాట్లాడారు. హబీబ్‌నగర్ ఠాణా పరిధిలో సర్వేను స్వయంగా సమీక్షించి, క్షేత్రస్థాయి సమాచారాన్ని జాగ్రత్తగా, కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. దొంగతనాలు, దోపిడీలు, ఇళ్లల్లో చోరీలను మానుకున్న వారి వివరాలను సేకరిస్తున్నామని, ఇంకా నేరచర్యలకు పాల్పడుతున్న వారి కదలికల్ని గుర్తించేందుకు ఇళ్లకు జియోట్యాగింగ్ చేస్తున్నట్లు డీజీపీ వివరించారు. సమగ్ర వివరాలను డేటాబేస్‌లో పొందుపరుస్తామని, ఆ సమాచారం ఆధారంగా వారి జీవనోపాధి, ప్రవృత్తిలో మార్పుల్ని గుర్తించి అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. తాము చేపట్టిన సంస్కరణల ద్వారా ప్రభావితులై జనజీవన స్రవంతిలోకి వచ్చే వారికి పునరావాసం కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాల ద్వారా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

హబీబ్‌నగర్ ఠాణా ఇన్‌స్పెక్టర్ మధుకర్‌స్వామి మాంగార్‌బస్తీలో నేరస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.. 250 మంది ఇక్కడ తాము నేరాలకు పాల్పడబోమంటూ ప్రతిజ్ఞ చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నేరస్థుల సమగ్ర సర్వే విజయవంతమైందని, వివరాలను టీఎస్‌కాప్ యాప్‌లో నమోదు చేసే క్షేత్రస్థాయి పోలీసులకు అభినందనలు తెలిపారు. పెడతామనీ, దీనివల్ల నేరస్థుల కదలికలపై దృష్టిపెట్టేందుకు, నేరాల్ని అదుపు చేసేందుకు వీలవుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని నేరరహితంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయ్యాక కరుడుగట్టిన నేరస్థులతో సమావేశాలు నిర్వహించి కౌన్సెలింగ్, పునరావాసం, ప్రభుత్వ పథకాల గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నేరగాళ్ల విషయంలో ఆయా రాష్ట్రాలతో కలిసి ఈ విధానం అమలు చేసి వారి ఆటలు కట్టిస్తామన్నారు.

సమగ్ర సర్వే విజయవంతం..: తెలంగాణలో చేపట్టిన నేరస్థుల సమగ్ర సర్వే విజయవంతమైంది. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పోలీసులు సర్వేలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు పాలుపంచుకున్నారు. దాదాపు 830 పోలీసు స్టేషన్ల పరిధిలో గత పదేళ్లలో తీవ్రమైన, వ్యవస్థీకృత, ఆస్తుల సంబంధిత, మహిళలపై జరిగిన నేరాల్లో నిందితులు, నేరస్థులుగా ఉన్నవారితో పాటు అనుచరులు పేర్లున్న చిరునామాలకు స్వయంగా వెళ్లి సమాచారం తీసుకున్నారు. సర్వేలో భాగంగా సమాచార సేకరణలో ఎలాంటి అవకతవకలు, లోపాలకు తావివ్వకూడదంటూ ఎప్పటికప్పుడు డీజీపీ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి డీసీపీలు, ఎస్పీలు, ఐజీ, కమిషనర్లు, డీసీపీలు, ఏసీపీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లకు సూచనలు, సలహాలు అందించారు. సమగ్ర సర్వే పూర్తయ్యేందుకు మరో రెండు రోజుల సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఒకేచోట నివాసం ఉన్న నేరస్థుల వివరాలు తీసుకోగా.. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న, మరో ప్రాంతానికి వలసవెళ్లిన నేరగాళ్ల సమాచారం సేకరించేందుకు కొంత సమయం పడుతోంది. నేరచరిత కలిగిన రాజకీయ నేతల వివరాలూ సేకరిస్తున్నట్లు సమాచారం.

పేదలకు అభివృద్ధి ఫలాలు అందాలి

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, చెన్నై: అభివృద్ధి ఫలాలు దేశంలోని పేదలందరికీ దక్కాలని.. అప్పుడే వారు అభివృద్ధిలో తమ భాగస్వామ్యం ఉందని భావిస్తారని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. చెన్నైలో గురువారం ఘనంగా జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈవో - ఫియో) అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. దేశంలోని ఎగుమతిదారులు అధునాతన ఉత్పత్తుల తోపాటు వ్యవసాయ సంబంధిత ఆహార ఉత్పత్తుల పైనా దృష్టి సారించాలన్నారు. ఎగుమతిదారుల ఇబ్బందులు త్వరలోనే తొలుగుతాయన్నారు. నూతన మార్కెటింగ్ వ్యవస్థపై శ్రద్ధపెట్టి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర కీలకమన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటివి రానున్న రోజుల్లో మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. సంపదను తొలుత సృష్టించాలని, అనంతరం దాన్ని పంచాలని సూచించారు. సంపద సృష్టించిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' చొరవ దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, దేశీయ గిరాకీని పెంచడం తదితర బహుళ కార్యక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.

భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న భాజపా ప్రభుత్వాలు

- 'ఇండియాటుడే' సదస్సులో ప్రకాశ్‌రాజ్, కంచ ఐలయ్య ధ్వజం
- న్యాయస్థానాలే శరణ్యం: నటుడు విశాల్
- చలనచిత్రాలను ఆ కోణంలో చూడొద్దు: దర్శకుడు శశిధరన్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల్లోని భాజపా ప్రభుత్వాలు భావప్రకటన స్వేచ్ఛను దారుణంగా హరిస్తున్నాయని, తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై ఎదురుదాడికి యత్నిస్తున్నాయని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్, సామాజికవేత్త కంచ ఐలయ్య ధ్వజమెత్తారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండియాటుడే' సదస్సులో 'భావప్రకటన స్వేచ్ఛ' అంశంపై జరిగిన చర్చలో వీరితోపాటు, తమిళ నటుడు విశాల్, ఎస్.దుర్గ చిత్ర దర్శకుడు శశిధరన్ పాల్గొన్నారు. ఇందులో పద్మావత్, ఎస్.దుర్గ చిత్రాలతోపాటు పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య తదితర అంశాలపై వాడివేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. పద్మావత్ చిత్రం విడుదల కోసం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా అమలు చేయలేకపోవడం ప్రభుత్వాల అసమర్థత అని విమర్శించారు. సినిమాపై రాజస్థాన్‌లోని రాజపుత్రులు మాట్లాడుతున్నారంటే వారికి సంబంధించిన అంశమనుకోవచ్చు. కానీ, గుజరాత్, హరియాణాలకేం సంబంధం? అని ప్రశ్నించారు. 'దేశంలో ఎన్నో దారుణాలు జరుగుతున్నా ప్రధాని మౌనంగా ఎందుకున్నారు? ఆయన గురించి ఏదైనా మాట్లాడితే 'నువ్వు హిందూ వ్యతిరేకివి' అని నన్ను నిందిస్తున్నారు. నిజానికి నేను హిందూ వ్యతిరేకిని కాదు. ప్రధాని మోదీకి వ్యతిరేకిని, కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డేకి వ్యతిరేకిని, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షాకు వ్యతిరేకిని. అనంతకుమార్ రాజ్యాంగాన్ని మారుస్తామన్నారు. దీనిని నేను ప్రశ్నిస్తూ ప్రెస్‌మీట్ పెడితే.. బీఫ్ తినేవాడినంటూ నా గురించి వారు మాట్లాడతారు. నేను ఇటీవల వెళ్లిన సభ వేదికను గోమూత్రంతో శుద్ధి చేశారు. ఎక్కడికి వెళ్లినా ఇలాగే చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు. దేవతల పేరిట మటన్, చికెన్ దుకాణాలు పెడితే భాజపా వాళ్లకు అభ్యంతరం ఉండదు కానీ, ఎస్.దుర్గ అని సినిమాకు పేరు పెడితే మాత్రం సహించరు.'' అని ప్రకాశ్‌రాజ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తమకంటే గొప్ప నటుడని ఆయన విమర్శించారు. కంచ ఐలయ్య మాట్లాడుతూ.. 'మోదీ ప్రభుత్వం ముమ్మారు తలాక్‌పై చూపిన శ్రద్ధ, దళితులకు అర్చకత్వ హక్కులపై చూపించడం లేదు?' అని పేర్కొన్నారు. విశాల్ మాట్లాడుతూ.. వ్యక్తులు, సంస్థలు సృష్టించే వివాదాలు పరిష్కారం కావాలంటే సినిమా వాళ్లు న్యాయస్థానాలను ఆశ్రయించడమే ఉత్తమ మార్గం. అక్కడైతేనే న్యాయం దొరుకుతుందని అంతా భావిస్తున్నారు. సెన్సార్ బోర్డు ధ్రువీకరించిన తర్వాత చిత్రాన్ని వ్యతిరేకించడం సబబు కాదన్నారు. దర్శకుడు శశిధరన్ మాట్లాడుతూ.. "నేను రూపొందించిన ఎస్.దుర్గ సినిమాకు మతానికి అసలు సంబంధమే లేదు. సినిమాను చూడకుండానే లేనిపోనివి ఆపాదిస్తున్నారు' అని అన్నారు. సదస్సు ప్రారంభంలో ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలకు భాజపా తెలంగాణ అధికార ప్రతినిధి కృష్ణసాగర్ రావు అభ్యంతరం చెప్పారు. హిందూ వ్యతిరేక, వామపక్ష మద్దతుదారులనే చర్చలో కూర్చోబెట్టడం వల్ల ఏకపక్షంగా మాట్లాడుతున్నారని విమర్శించడంతో కలకలం రేగింది. నిర్వాహకుల జోక్యంతో సద్దుమణిగింది.

తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ఎవరో?

- ఎన్నికల సంఘానికి చేరని అధికారుల జాబితా
- ఏపీ సీఈవోగా ఆర్పీ సిసోడియా పేరు ఖరారు
- వచ్చే వారంలో బాధ్యతల స్వీకారం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎవరన్నది ఇంకా తేలలేదు. రాష్ట్ర ప్రభుత్వం జాబితా పంపకపోవడం వల్లనే నిర్ణయం వెలువడనట్లు తెలుస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిగా ఆర్పీ సిసోడియా నియామకానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోద ముద్ర వేసింది.

రాష్ట్ర విభజన నాటి నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు భన్వర్‌లాల్ ముఖ్య ఎన్నికల అధికారిగా(సీఈవో) వ్యవహరిస్తూ వచ్చారు. గతేడు అక్టోబరు 31న ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత ఆయా పోస్టులు ఖాళీ అయ్యాయి. తాత్కాలిక ఏర్పాటుగా అదనపు కమిషనర్‌గా ఉన్న అనూప్ సింగ్‌కు ముఖ్య ఎన్నికల అధికారి బాధ్యతలను ఎన్నికల సంఘం అప్పగించింది. నిజానికి భన్వర్‌లాల్ పదవీ విరమణకు కొద్ది రోజుల ముందు నుంచే ముఖ్య ఎన్నికల అధికారుల నియామకానికి అధికారుల జాబితాలను పంపాల్సిందిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖలు రాసింది.

ఆంధ్రప్రదేశ్ పంపిన జాబితా నుంచి సిసోడియా నియామకానికి కేంద్ర ఎన్నికల సంఘం సంసిద్ధత వ్యక్తంచేసింది. ఆయన వచ్చే వారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

జాబితా కోసం నిరీక్షణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొంత కాలానికి ముఖ్య ఎన్నికల అధికారి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అధికారుల జాబితాను కేంద్రానికి పంపింది. ఆ జాబితాపై కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తంచేసింది. మరో జాబితా పంపాల్సిందిగా కోరింది. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల సంఖ్య తక్కువగా ఉండటం, ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి ఎన్నికలు జరిగే అవకాశాల్లేకపోవడంతో ప్రభుత్వం ఈ అంశానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదన్నది అధికార వర్గాల సమాచారం. తెలంగాణ సీఈవోపై నిర్ణయం వెలువడని నేపథ్యంలో..సిసోడియాకే తాత్కాలికంగా ఈ రాష్ట్ర బాధ్యతలు కూడా అప్పగిస్తారా? ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా ఉన్న అనూప్‌సింగ్‌నే కొంతకాలం కొనసాగిస్తారా? అన్నది ప్రస్తుతం సందిగ్ధంగా మారింది.

టైర్ల గోదాములో భారీ అగ్నిప్రమాదం


మంటల్లో కాలిపోతున్న గోదాము

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతం కారణంగా టైర్ల గోదాములో భారీ అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం బండ్లగూడలో జరిగింది. పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపిన ప్రకారం.. స్థానికంగా ఉన్న అగర్వాల్ రబ్బరు పరిశ్రమకు చెందిన గోదాములో గురువారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. భద్రతాసిబ్బంది వాటిని ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మంటలు ఉద్ధృతమై అగ్నికీలలు ఎగిసి పడటంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సాయంత్రం వరకు మంటలను ఆర్పేందుకు నిర్విరామంగా కృషి చేశారు. రబ్బరు పరిశ్రమలో తయారైన లారీ, మినీ వ్యాన్, ద్విచక్రవాహనాలు, సైకిల్ టైర్లను ఎప్పటికప్పుడు గోదాముకు తరలించేందుకు మూతపడిన పరిశ్రమను అద్దెకు తీసుకున్నారు. ప్రమాద సమయంలో దాదాపు రెండు లక్షల టైర్లు, ట్యూబులు ఉన్నాయని, నష్టం రూ.కోట్లలో ఉండే అవకాశాలున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు. పరిశ్రమలో ఒక్కసారిగా ఎగిసిన మంటలతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లకు సెగ తగిలింది. దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

భావి పరిశోధకులకు తొలిమెట్టు 'జిజ్ఞాస'

ఘనంగా రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తు పరిశోధకులకు జిజ్ఞాస పోటీల్లో పాల్గొనడం తొలిమెట్టు అని తెలంగాణ కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రాష్ట్రస్థాయి అధ్యయన నివేదికల పోటీలను గురువారం జేఎన్ఏఎఫ్ఏయూలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని పరిశోధనాత్మక జిజ్ఞాసను వెలికితీయడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సృజన వేదికలుగా ఉన్నాయన్నారు. ఈ విద్యాసంవత్సరం 16 విభాగాల నుంచి 480 అధ్యయన నివేదికలు ప్రదర్శనకు ఎంపికయ్యాయని చెప్పారు. సీసీఎంబీ మాజీ సంచాలకుడు డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ మానవాళి అస్తిత్వ చైతన్యాన్ని మార్చే పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, శిక్షణ పరిశోధన సంస్థ(ఈపీటీఆర్ఐ) శాస్త్రవేత్త వేణు మాట్లాడుతూ ఎందుకు.. ఏమిటి.. ఎలా..అనే జిజ్ఞాసతో కూడిన ఆలోచనలతో విద్యార్థులు సునిశిత పరిశీలన.. పరిశోధన చేయాలని సూచించారు. తొలిరోజు జువాలజీ విభాగం నుంచి 24 ప్రాజెక్టులు, వృక్షశాస్త్రం, మైక్రో బయాలజీల నుంచి 28 ప్రాజెక్టులను విద్యార్థులు సమర్పించారు. ఈనెల 27వరకూ సైన్స్, కామర్స్, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం, భాషా విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయి. కార్యక్రమంలో జిజ్ఞాస రాష్ట్ర సమన్వయకర్త నాన్సీ సెరీనా పాల్గొన్నారు.

ఎనిమిది మంది కానిస్టేబుళ్ల అరెస్టు

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసిన కేసులో..

కోదాడ పట్టణం, నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒకరికి బదులు మరొకరు కానిస్టేబుల్ పరీక్షను రాసిన కేసులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన 8 మంది కానిస్టేబుళ్లను సీఐడీ అధికారులు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న చిలుకూరుకు చెందిన ఎం.నాగేశ్వరరావు, కోదాడ గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కలకోవకు చెందిన బుర్రి వెంకటేశ్వర్లు, మఠంపల్లిలో విధులు నిర్వహిస్తున్న చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన బుడిగం నాగేశ్వరరావు, సూర్యాపేట పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన అప్సర్,మిర్యాలగూడ వన్‌టౌన్ ఠాణాకు చెందిన నాగరాజు, నల్గొండ ఏఆర్ విభాగానికి చెందిన రమేష్, కొండమల్లెపల్లిలో పనిచేస్తున్న ఉపేందర్, వాడపల్లిలో పనిచేస్తున్న సందీప్ 2009లో జరిగిన కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో గురువారం సీఐడీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై 2010లో కేసు నమోదైంది. కానిస్టేబుళ్లఅరెస్టు విషయాన్ని ఉన్నతాధికారులు ధ్రువీకరించారు.

పర్యాటకానికి సంబంధించి మీ అనుభవాలు, సందేహాలు పంపించండి

మా చిరునామా:

విహారి
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

mail id ■ vihari@eenadu.in


గ్లౌవ్స్ వేసుకున్నా.. బ్రౌజ్ చేయొచ్చు

చలికాలంలో విహారయాత్రలకు ఎక్కువగానే వెళ్తుంటాం. ఎముకలు కొరికే చలిని తట్టుకోవడానికి ఆపాద మస్తకం రక్షణ కవచాలు ధరిస్తుంటాం! అందులో చేతులకు వేసుకునే గ్లౌవ్స్ కూడా ఉంటాయి. ఇవే పెద్ద చిక్కు తెచ్చిపెడతాయి. గ్లౌవ్స్ ఉన్న చేతులతో చరవాణి తాకేతెరను ఎంత తడిమినా అది తెరుచుకోదు. పోనీ.. ఫోన్ వాడిన ప్రతిసారీ గ్లౌవ్స్ తొలగిద్దామా అంటే అదీ కుదరదు. టచ్ స్క్రీన్ వింటర్ గ్లౌవ్స్ వేసుకుంటే ఈ ఇబ్బందులు ఉండవు. వీటికి ఉండే గ్రిప్‌తో సులువుగా ఫోన్ ఆపరేట్ చేయొచ్చు. ఇంటర్నెట్ బ్రౌజ్ కూడా చేయొచ్చు. వేలిముద్ర లాక్ పెట్టుకుంటే మాత్రం.. గ్లౌవ్స్ తీసేయాల్సిందే! ఆన్‌లైన్ అంగట్లో టచ్ స్క్రీన్ గ్లౌవ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.500 నుంచి రూ.2,000 వరకూ ఉంది.



పదండి.. ప్రణాళిక ఇదండి

ఎప్పుడెప్పుడు.. ఎక్కడెక్కడికి..



నడి వేసవిలో రాజస్థాన్ పర్యటనకు వెళ్తే ఆనందం ఏముంటుంది. భారీ వర్షాలప్పుడు హిమగిరి సోయగాలు చూస్తానంటే ఎలా కుదురుతుంది. ఒక్కో ప్రాంతం సందర్శించడానికి ప్రత్యేకమైన సమయం ఉంటుంది. ఆ కాలంలో వెళ్తేనే అసలైన ఆనందం దొరుకుతుంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు ఎప్పుడు వెళ్లాలి? అక్కడి పర్యాటక ఆకర్షణలు ఏమిటి? ఈ వివరాలు తెలుసుకోండి. ఏ సీజన్‌లో ఏ ప్రాంతానికి వెళ్లాలి, వేసవి సెలవుల్లో ఎక్కడ విహరించాలో.. ఇప్పట్నుంచే ప్రణాళికలు రూపొందించుకోండి.



ఎడారి దారిలో..

చుట్టూ ఉన్న ఎడారే రాజస్థాన్ పర్యాటక రంగానికి ఒయాసిస్! రాజులు పోయినా.. వారు నిర్మించిన ప్రాసాదాలు నేటికీ ఠీవీగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో నిప్పుల కొలిమిలా ఉండే ఈ ఎడారి ప్రాంతం.. శీతాకాలంలో దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులతో భలేగా ఉంటుంది.

నవంబర్–ఫిబ్రవరి పర్యటనకు అనుకూల సమయం. ఇదే సీజన్‌లో ఇక్కడ బికనీర్ ఒంటెల పండగ, జైపూర్ మ్యూజిక్ ఫెయిర్, పుష్కర్ ఫెయిర్, జైసల్మేర్ ఫెస్టివల్ ఇలా సంప్రదాయ పండగలు ఎన్నో జరుగుతుంటాయి. థార్ ఎడారిలో జీప్ సఫారీ మంచి జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

జూన్–సెప్టెంబర్: పేరుకే వానాకాలం. కానీ, ఇక్కడ భారీ వర్షాలేం ఉండవు. ఈ సమయంలోనూ వెళ్లిరావొచ్చు.

దర్శనీయ స్థలాలు: జైపూర్, అజ్మీర్, బికనీర్, పుష్కర్, జోధ్‌పూర్, జైసల్మేర్...

కశ్మీరు లోయలో..

పర్యాటక ప్రియులు ఒక్కసారైనా చూడాలనుకునే ప్రాంతం జమ్మూ కశ్మీర్. సంస్కృతి, ఆహార్య వ్యవహారాలు ఆకట్టుకుంటాయి. హిమగిరి సొగసులు, శ్రీనగర్‌లో హౌస్‌బోటు షికారు మధురానుభూతిని మిగుల్చుతాయి.

జనవరి–ఫిబ్రవరి: దట్టమైన మంచుతో ఉంటుంది. స్కేటింగ్ విన్యాసాలు, హిమసీమల్లో విహరించాలని భావించేవారు ఈ సమయంలో వెళ్తుంటారు.

మార్చి–జూన్: సమశీతోష్ణంగా ఉంటుంది. పిల్లలతో వచ్చి జాలీగా సెలవులు గడపవచ్చు.

సెప్టెంబర్–అక్టోబర్: లేహ్-లద్దాఖ్ దారిలో బైకులు దూసుకుపోతుంటాయి. కశ్మీరు లోయ సౌందర్యం చూడాలంటే ఇది అనువైన సమయం.

దర్శనీయ స్థలాలు: శ్రీనగర్, లెహ్, లద్దాఖ్, ఉదంపూర్, పుల్వామా, వైష్ణోదేవి ఆలయం





ఆధ్యాత్మికం.. పర్యాటకం..

దైవ భూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌లో ఎన్నో పుణ్యతీర్థాలు ఉన్నాయి. చార్‌ధామ్ యాత్రలోని క్షేత్రాలన్నీ ఇక్కడే కొలువుదీరాయి. హిమాలయాల సౌందర్యం, హిమనీ నదుల వయ్యారాలు.. ఉత్తరాఖండ్‌ను పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దాయి.

డిసెంబర్–జనవరి: మంచు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. హిమాలయాల సౌందర్యం చూడాలనుకుంటే వెళ్లొచ్చు.

ఫిబ్రవరి–మే: ప్రశాంత వాతావరణం ఉంటుంది. నైనిటాల్, డెహ్రాడూన్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

జులై–సెప్టెంబర్ భారీ వర్షాలు కురుస్తాయి. ఇది ప్రతికూల సమయం.

అక్టోబర్–నవంబర్: సాహసక్రీడలకు అనుకూలం. మంచుతెరల్లో ఇక్కడి ప్రదేశాలు మరింత మనోహరంగా కనిపిస్తాయి.

దర్శనీయ స్థలాలు: చార్‌ధామ్ యాత్ర (కేదార్‌నాథ్, బద్రినాథ్, గంగోత్రి, యమునోత్రి), రుషీకేశ్, హరిద్వార్, నైనిటాల్, అల్మోరా, డెహ్రాడూన్

పవిత్ర సంగమం



హిందువులు అత్యంత పవిత్రంగా భావించే వారణాసి ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్. ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ కూడా ఈ రాష్ట్రంలోనే ఉంది. ఆధ్యాత్మిక సుగంధాలు, గంగా, యమున తరంగాలు, నవాబుల హవేలీలు లాంటి ఎన్నో విశేషాల సంగమం ఉత్తర్‌ప్రదేశ్.

ఏప్రిల్–మే: ఎండలు ఎక్కువ. పర్యాటకుల సందడి తక్కువ. అయితే ఎండలు ఎలా ఉన్నా.. మే మాసాంతంలో పర్యాటకులు కాశి, ప్రయాగ క్షేత్రాలకు వస్తుంటారు.

జులై–సెప్టెంబర్: ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుంటాయి. ఈ సమయంలో హోటల్ గదుల అద్దెలు తక్కువగా ఉంటాయి.

అక్టోబర్–ఫిబ్రవరి: పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. శివరాత్రి సమయంలో కాశిలో ఆధ్యాత్మిక వైభవం చూసి తీరాల్సిందే!

దర్శనీయ స్థలాలు: వారణాసి, ఆగ్రా, మథుర, లఖ్‌నవు, అలహాబాద్ (త్రివేణి సంగమం), అయోధ్య, ఝాన్సి, సారనాథ్, ఆలీగఢ్, ఫతేపూర్ సిక్రి



ఈశాన్య సౌందర్యం

ఈశాన్య భారతంలో పొదిగిన ఏడు రాష్ట్రాలు పర్యాటక రంగంలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి. సిక్కిం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ పర్యాటక కేంద్రాలుగా అలరిస్తున్నాయి. ఇక్కడి ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి కట్టిపడేస్తాయి.

నవంబర్–ఫిబ్రవరి: చల్లటి వాతావరణం, నిర్మలమైన ఆకాశం ఆహ్లాదాన్నిస్తాయి.

జూన్–అక్టోబర్: వర్షాలు కురుస్తుంటాయి. ఆకాశంలో కారుమబ్బులు, పర్వత పంక్తులపై మంచు తెరలు ప్రకృతికాంత సరికొత్తగా కనిపిస్తుంది. జలధారలతో లోయలన్నీ పొంగిపోతుంటాయి. పర్యాటకులకు కావాల్సినంత ఆనందం దొరుకుతుంది.

దర్శనీయ స్థలాలు: షిల్లాంగ్, చిరపుంజి (మేఘాలయ), జిరో, తవాంగ్ (అరుణాచల్ ప్రదేశ్), మాజులీ, గువాహటి (అస్సాం), ఐజ్వాల్ (మిజోరాం), ఇంఫాల్ (మణిపూర్)



సంప్రదాయాల పట్టుకొమ్మ

వాణిజ్య సంపదతో తులతూగే గుజరాత్‌లో పర్యాటక కేంద్రాలు చాలానే ఉన్నాయి. అతిథులను ఆకర్షించడంలో గుజరాత్ పర్యాటక శాఖ ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్యాకేజీలు ప్రకటిస్తుంటుంది.

సెప్టెంబర్–అక్టోబర్: గుజరాత్‌లో దసరా, దీపావళి పండగలు ఘనంగా జరుగుతాయి. గుజరాతీయుల సంప్రదాయాలు, ఆచారాలు తెలుసుకోవాలనుకున్నా, ఆహార పదార్థాలు రుచి చూడాలనుకున్నా.. ఇది సరైన సమయం.

నవంబర్–ఫిబ్రవరి: ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ. ఇదే సమయంలో రణ్ ఆఫ్ కచ్ ఫెస్టివల్ కూడా జరుగుతుంది. తెల్లటి ఇసుక తిన్నెల్లో.. వెన్నెలను చూసేందుకు వేలాదిగా పర్యాటకులు తరలి వస్తుంటారు.

దర్శనీయ స్థలాలు: సోమ్‌నాథ్ ఆలయం, ద్వారకా, అక్షరధామ్, అహ్మదాబాద్, సబర్మతి ఆశ్రమం, గిర్ అభయారణ్యం...

ఎన్నెన్నో అందాలు..



భారతావని హృదయసీమగా పేరున్న మధ్యప్రదేశ్‌లో పర్యాటకానికి ఊతమిచ్చే ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. ఆధ్యాత్మిక కేంద్రాలు, సాత్పురా పర్వత శ్రేణులు, దట్టమైన అడవులు, కోటలు, రాజప్రాసాదాలు ఇలా ఎన్నెన్నో అందాలు.. పర్యటక పటంలో మధ్యప్రదేశ్‌ను దర్జాగా నిలబెట్టాయి.

అక్టోబర్–ఏప్రిల్: వాతావరణం అనుకూలంగా ఉంటుంది. డిసెంబర్, జనవరి మాసాల్లో చలి ఎక్కువగా ఉన్నా.. పర్యాటకులకు ఆనందం పంచుతుంది.

ఏప్రిల్–మే: ఎండలు ఎక్కువగా ఉంటాయి.

జూన్–సెప్టెంబర్: వర్షాకాలంలో నర్మదా నది పరివాహక ప్రాంతాలు అందంగా కనిపిస్తాయి. వింధ్య-సాత్పుర పర్వత శ్రేణుల్లోని జలపాతాలు నిండైన ప్రవాహంతో కళకళలాడుతుంటాయి.

దర్శనీయ స్థలాలు: జ్యోతిర్లింగ క్షేత్రాలు ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ఖజురహో, సాంచి, జబల్‌పూర్, భోపాల్, చిత్రకూట్, హనువంతియా, పచ్‌మఢీ, పాతాల్‌కోట్, గ్వాలియర్ మరెన్నో..

గో.. గో.. గోవా



టీనేజ్ కుర్రాడి మొదలు.. ఓల్డేజ్ పెద్దాయన వరకు గోవా అనగానే.. లెట్స్ గో అంటారు. ఏడాది పొడుగునా పర్యాటకుల సందడి కనిపిస్తుందిక్కడ.

నవంబర్–ఫిబ్రవరి: దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తారు. చిన్నా-పెద్దా కార్నివాల్స్ జరిగే సీజన్ ఇది.

జులై–సెప్టెంబర్: ఈ సమయంలో గోవా అందంగా ఉంటుంది. చిరుజల్లుల వేళ బీచ్‌లో విహారం మరచిపోలేని అనుభూతినిస్తుంది.

ఏప్రిల్–మే: పర్యాటకుల తాకిడి ఉండదు. ఎండలు తట్టుకునే స్థాయిలోనే ఉంటాయి. ఈ సమయంలో గదుల అద్దె తక్కువగా ఉంటుంది. బడ్జెట్ ధరలోనే స్టార్ హోటల్‌లో బస చేయవచ్చు.

చూడాల్సినవి: గోవా బీచుల్లో సరదాగా గడపవచ్చు. ఓల్డ్ గోవా మొత్తం చుట్టి రావొచ్చు.

తుంగ అల.. హంపి కళ

కర్ణాటకలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రాంతాలెన్నో ఉన్నాయి. పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలకు కొదవలేదిక్కడ.

అక్టోబర్–ఫిబ్రవరి: అనుకూలం. మైసూర్ దసరా ఉత్సవాలు, హంపి ఉత్సవాలు ఈ సీజన్‌లోనే జరుగుతాయి.

జూన్–సెప్టెంబర్: సీజన్ ఓ మోస్తరుగా ఉంటుంది. ఆధ్యాత్మిక కేంద్రాలకు పర్యాటకుల తాకిడి ఎక్కువ.

ఏప్రిల్–మే: వేసవిలో ఎండలు మెండుగా ఉంటాయి. కర్ణాటక స్వర్గధామం కూర్గ్‌లో మాత్రం వేసవి పసందుగా ఉంటుంది.

దర్శనీయ స్థలాలు: గోకర్ణం, బెంగళూరు, మైసూర్, శ్రీరంగపట్నం, కూర్గ్, చిక్ మంగళూర్, మురుడేశ్వర్...



రుతురాగాల వేళలో..



పడమటి కనుమల్లో ఒదిగిన కేరళలో ఆధ్యాత్మిక కేంద్రాలు, జలపాతాలు, సముద్ర తీరాలు.. ఇలా ఎన్నో!

నవంబర్–ఫిబ్రవరి: వాతావరణం బాగుంటుంది. హిల్‌స్టేషన్లు, జలపాతాలు, సముద్ర తీరాలకు వెళ్లొచ్చు.


మే–జూన్: నైరుతి రుతుపవనాల రాకతో.. తొలకరి చినుకుల్లో తడిసిపోవాలని పర్యాటకులు చాలామంది ఇక్కడికి వస్తుంటారు.

ఆగస్టు: ఈ నెలలోనే కేరళ నూతన సంవత్సరాది ఓనమ్ పండగ జరుగుతుంది. ఆ సమయంలో ఇక్కడి పల్లెల్లో పడవ పందేలు, నృత్య ప్రదర్శనలు విశేషంగా జరుగుతుంటాయి.

దర్శనీయ స్థలాలు: అలెప్పీ, తిరువనంతపురం, మున్నార్, వాయనాడ్, శబరిమల, గురువాయూర్ ఇలా ఎన్నో..

ఆధ్యాత్మిక విహారం

ఆధ్యాత్మిక కేంద్రాలు, వేసవి విడిదులు తమిళనాడు పర్యాటక రంగానికి ఊతమిస్తున్నాయి. సంప్రదాయ వేడుకలు విహారయాత్రకు వచ్చే వారికి అదనపు ఆనందాన్ని అందిస్తాయి.



నవంబర్–ఫిబ్రవరి: మధ్యాహ్నం ఉక్కపోత ఉన్నా.. ఉదయం, సాయంత్రం చల్లగా ఉంటుంది. పర్యాటకులు ఎక్కువగా వచ్చే సీజన్ ఇది. ధనుర్మాసంలో తమిళనాట ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది.

జులై–నవంబర్: అడపాదడపా భారీ వర్షాలు కురుస్తాయి. అయినా, దసర, దీపావళి పండగలప్పుడు కంచి, మదురై, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాలు కిటకిటలాడుతుంటాయి.

మార్చి–మే: వేసవిలో ఎండలు దానికి తోడు ఉక్కపోత చికాకు కలిగిస్తాయి. ఈ సమయంలో ఊటీ, కొడైకెనాల్, ఎలగిరి హిల్స్ వంటి ప్రాంతాలకు వెళ్లొచ్చు.

దర్శనీయ స్థలాలు: అరుణాచలం, మహాబలిపురం, కంచి, మదురై, కుర్తాళం, రామేశ్వరం, కన్యాకుమారి, చిదంబరం, కుంభకోణం, శ్రీరంగం మరెన్నో..

చూసొద్దాం

నల్లమల కానలో మల్లెల వాన

కొండలు, లోయలు, భారీ వృక్షాలు, వాటికి అల్లుకున్న లతలు.. నల్లమల వనసౌందర్యం గురించి ఎంత చెప్పినా తక్కువే! సుమారు 3,500 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న నల్లమల అడవుల్లో ఆధ్యాత్మిక కేంద్రాలు, జలపాతాలు, విహార కేంద్రాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి మల్లెల తీర్థం. నల్లమల సిగలో.. ప్రకృతి తురిమిన విరులపాతం ఇది. దట్టమైన అటవీ మార్గం గుండా సాగే మల్లెలతీర్థ యాత్ర..మనసుకు ఉల్లాసాన్ని కలిగిస్తుంది.

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో వాతావర్లపల్లికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ మల్లెల తీర్థం. కిలోమీటర్ దూరం నుంచే జలధారల హోరు వినిపిస్తుంటుంది. జలపాతానికి కొంత దూరంలో టికెట్లు తీసుకోవాలి. ఎత్తయిన కొండ నుంచి సుమారు 300 మెట్లు దిగితే మల్లెల తీర్థం చేరుకోవచ్చు. సగం మెట్లు దిగామో.. లేదో.. చెట్ల గుబురుల నుంచి జలపాత విన్యాసాలు కనిపిస్తాయి.

వంద అడుగుల ఎత్తు..

మల్లెల తీర్థం జలపాతం ఎత్తు సుమారు 100 అడుగులు. రెండు పర్వతాల మధ్యనున్న లోయలో నుంచి దూకే జలపాతం నీళ్లు.. దిగువనున్న మరో లోయలోకి చేరుతాయి. పైనుంచి దూకే జలధారలు మల్లెల్లా మెరుస్తూ.. జడివానలా కురుస్తాయి. అందుకే ఈ జలపాతానికి మల్లెల తీర్థం అని పేరు వచ్చింది. ఫిబ్రవరి మాసాంతం వరకు ఇక్కడ జలధారలు కనువిందు చేస్తాయి. జలపాతం ముందుండే గుండం చాలా లోతుగా ఉంటుంది. గుండంలోని నీళ్లు రెండు గుట్టలను చీల్చుకుంటూ ఉత్తర దిశగా సాగుతాయి. కాస్తంత దూరంలోనే ఆరు చిన్న చిన్న జలపాతాలను ఏర్పరుస్తాయి. అయితే చెట్లు, గుబురుగా ఉన్న పొదలు కప్పేయడంతో వీటి దగ్గరికి వెళ్లడం కష్టమే!

మల్లెల తీర్థం పరిసరాల్లో స్థానిక గిరిజనులు అల్పాహారం, చిరుతిళ్లు అమ్ముతుంటారు. భోజనం, బస దొరకాలంటే జలపాతానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్ననూరు (హైదరాబాద్ వైపు), దోమలపెంట (శ్రీశైలం వైపు) గ్రామాలకు చేరుకోవాలి. మన్ననూరులో వనమాలి గెస్టహౌజ్ విడిదికి అనుకూలం. దోమలపెంటలోని వన మయూరి అతిథి గృహం కృష్ణానది ఒడ్డున ఉంటుంది. ఇవి రెండూ అటవీ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వనమాలి గెస్ట్‌హౌజ్ సమీపంలో పర్యావరణ విద్యా ప్రదర్శనశాల, షావలి దర్గా ఉంటాయి.



ఎలా వెళ్లాలంటే..

- హైదరాబాద్ నుంచి శ్రీశైలం దారిలో.. మన్ననూరు దాటాక 25 కిలోమీటర్లకు వాతావర్లపల్లి గ్రామం వస్తుంది. అక్కడి నుంచి మల్లెల తీర్థానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి.
- శ్రీశైలం నుంచి వచ్చే వాళ్లు.. దోమలపెంట మీదుగా వాతావర్లపల్లికి చేరుకోవాలి. అక్కడి నుంచి ఆటోల్లో మల్లెల తీర్థం వెళ్లొచ్చు.

చూడాల్సిన ప్రదేశాలు

- శ్రీశైలం (57 కిలోమీటర్లు)
- టైగర్ సఫారీ, మన్ననూరు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ (17 కిలోమీటర్లు)
- లొద్ది మల్లన్న ఆలయం (25 కిలోమీటర్లు)
- ఉమామహేశ్వర ఆలయం (47 కిలోమీటర్లు)


దిక్సూచి

ఏ దేశమేగినా..

ఊరుకాని ఊరుకు వెళ్లారు. దేశం కాని దేశానికేగారు. అంతా బాగానే ఉంటుంది. అక్కడన్నీ వింతగానే తోస్తాయి. ఆనందాన్ని అందిస్తాయి. కడుపులో ఎలుకలు పరిగెత్తడం మొదలయ్యాక గానీ, అసలు సంగతి బోధపడదు. మంచి రెస్టారెంట్ ఎక్కడుందో, స్థానికంగా ఎలాంటి ఆహారం లభిస్తుందో తెలియదు. శాఖాహారులకైతే ఈ విషయంలో మరిన్ని చిక్కులు ఎదురవుతుంటాయి. వీటికి పరిష్కారం చూపిస్తుంది హ్యాపీకౌ (HappyCow) యాప్. ఇది మీ ఫోన్‌లో ఉంటే చాలు.. మీ ఆత్మారాముడు ఆవురావురుమనే పరిస్థితి తలెత్తదు. ఈ యాప్‌లో దేశవిదేశాల్లోని ప్రముఖ నగరాల్లో ఉన్న శాఖాహార రెస్టారెంట్లు, హోటళ్ల వివరాలు లభిస్తాయి. ఆ రెస్టారెంట్లలో లభించే పదార్థాలు, వాటికి వినియోగదారులు ఇచ్చిన రేటింగ్‌లు, రివ్యూలు అన్నీ అందుబాటులో ఉంటాయి. వినియోగదారులు మెచ్చిన హోటల్ ఏంటో.. వారు నచ్చిన పదార్థాలేంటో తెలుసుకొని వెళ్లిపోవడమే తరువాయి!



ఈనాడు సినిమా



రవితేజ, రాశీ ఖన్నా

స్టైల్‌గా టచ్ చేశాడు

రవితేజ కథానాయకుడిగా లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'టచ్ చేసి చూడు'. రాశీ ఖన్నా, సీరత్ కపూర్ కథానాయికలు. విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించనున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "రవితేజ ఇమేజ్‌కి తగ్గట్టుగా రూపుదిద్దుకొన్న చిత్రమిది. వక్కంతం వంశీ తయారు చేసిన కథ చాలా బాగుంది. మా చిరకాల మిత్రుడైన రవితేజతో ఈ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఒకొక్క పాటని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తున్నాం. టీజర్‌కి, పాటకి మంచి స్పందన లభించింది. రవితేజ స్టైలిష్‌గా కనిపిస్తున్నారనే ప్రశంసలు వ్యక్తమయ్యాయి. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జామ్ 8, కథనం: దీపక్‌రాజ్, మాటలు: శ్రీనివాస్‌రెడ్డి, ఛాయాగ్రహణం: ఛోటా కె.నాయుడు.

అరవయ్యో యేట రామానుజాచార్యగా నటిస్తా



రత్నం, బాలకృష్ణ, సి.కల్యాణ్

"నాకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. మన దేశంలో రకరకాల మతాలు, కులాలున్నాయి. అన్ని గ్రంథాల్లోని సారాన్ని తెలుసుకొని జీవిత గమనాన్ని సాగిస్తుంటా. నా అరవయ్యో యేట రామానుజాచార్యగా నటిస్తా" అన్నారు ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ. ఆయన నటించిన 'జై సింహా' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. కె.ఎస్.రవి కుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన ఆ చిత్ర విజయోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు బాలకృష్ణని ఆశీర్వదించారు. 'జై సింహా'లో బ్రాహ్మణుల ఔన్నత్యాన్ని, గౌరవాన్ని చాటి చెప్పేలా సన్నివేశాల్ని తీర్చిదిద్దారని చిత్రబృందాన్ని మెచ్చుకొన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ "బ్రాహ్మణులుగా పుట్టడం పుణ్యఫలం. వాళ్ల గొప్పతనాన్ని చాటి చెప్పేలా మా సినిమాలో సన్నివేశాలున్నాయి. రామానుజాచార్యులు అంతా సమానమే అని చెబుతూ, చాపకూటి సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. అష్టాక్షరి మంత్రాన్ని కూడా రాసి ప్రచారం చేశారు. ఆయన పాత్రలో నేను నటించబోతున్నా. ప్రేక్షకులతో విడదీయలేని అనుబంధం నాది. వైవిధ్యమైన ప్రయత్నాలు చేసిన ప్రతిసారీ నా సినిమాల్ని ఆదరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సమష్టికృషి ఫలితంగానే 'జై సింహా' ప్రేక్షకాదరణ పొందుతోంది. ఒక పాత్ర, ఆ పాత్రకున్న ఆత్మ, అందులో లీనమవ్వడమే నటనంటే. నా సినిమాల్లో అన్నీ ఉండాలి. కె.ఎస్.రవి కుమార్ ఆలోచనలు కూడా నాలాగే ఉంటాయి. అందుకే ఈ సినిమాని చక్కగా మలిచారు. త్వరలోనే ఎన్టీఆర్ జీవిత కథతో సినిమా తీస్తున్నాం. మహానుభావుడైన ఆయనకి కొడుకుగా పుట్టడం నా పూర్వజన్మసుకృతం. మన తెలుగు వాళ్లకి ఘన చరిత్ర ఉంది. వందేళ్ల కిందటే గండి విశ్వనాథ శాస్త్రిని జర్మనీవాళ్లు కిడ్నాప్ చేసి వేదసారాంశాన్ని తెలుసుకొని సాంకేతికంగా ఎదిగారు. ఇప్పటికి కూడా ఆయన ఫొటో అక్కడ మన రాయబార కార్యాలయంలో ఉంది. అలాంటి చరిత్ర మనది. అదంతా వెలుగులోకి రావడంలో సినిమా కీలక పాత్ర పోషిస్తోంది. తొలి తెలుగు రాజ్యం శాతవాహనులది. ఆ చరిత్ర ఆధారంగా 'గౌతమీపుత్ర శాతకర్ణి' తీశాం" అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ "2500 మంది బ్రాహ్మణులతో 'జై సింహా'లోని సన్నివేశాల్ని కుంభకోణంలో తీశాం. బాలకృష్ణ ఎంతో తపనతో నటించారు. ఆయన్నుంచి మరిన్ని ఉత్తమ చిత్రాలొస్తాయ"న్నారు. "బాలకృష్ణని తలచుకొంటే పూనకం వచ్చినట్టుగా ఉంటుంది. మంచి సంభాషణలు రాయడానికి అదే కారణం" అన్నారు రచయిత రత్నం. మా అధ్యక్షుడు శివాజీరాజా మాట్లాడుతూ "అర్చన చేయడానికి అర్చకుడు ఎంత ముఖ్యమో, వైద్యానికి వైద్యుడు అంత ముఖ్యం. సంభాషణలు చెప్పడానికి బాలకృష్ణ కూడా అంతే ముఖ్యం" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్యకు చెందిన హనుమంతాచార్యులు, తెలంగాణ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు దర్శనం శర్మ, తులసీ శ్రీనివాస్, ప్రభాకర్, చలపతిరావు పాల్గొన్నారు.

అసలేంటీ ఊరి గొడవ!



నాగశౌర్య, రష్మిక మండన్న

అది ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని ఊరు. ఒక వైపు తమిళ జనాలు, ఇంకొకవైపు తెలుగువాళ్లు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాల్సిన వాళ్ల మధ్య వైరం. దాంతో ఊరి మధ్యలో కంచె. అటువైపు వాళ్లు ఇటు రావడానికి వీల్లేదు. ఇటువైపు వాళ్లు అటు వెళ్లడానికి లేదు. అసలు వాళ్ల మధ్య అంత గొడవ ఎందుకు? ఆ ఊరికి చదువుకోవడానికి వెళ్లిన ఓ అబ్బాయికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఊరి జనాలు మళ్లీ కలిశారా లేదా? తదితర విషయాలు తెలియాలంటే 'ఛలో' చూడాల్సిందే. నాగశౌర్య కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రష్మిక మండన్న కథానాయిక. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. ఉషా ముల్పూరి నిర్మాత. శంకరప్రసాద్ ముల్పూరి సమర్పిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు చిరంజీవి ముఖ్య అతిథిగా ఈ నెల 25న హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక నిర్వహించనున్నారు. గురువారం ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "ఒక కొత్త నేపథ్యంతో సాగే చిత్రమిది. కథ, కథనాలతో పాటు సంభాషణలు ఆకట్టుకొనేలా ఉంటాయి. త్రివిక్రమ్ శిష్యుడైన వెంకీ కుడుముల గురవు తరహాలోనే మంచి హాస్యంతో సన్నివేశాల్ని తీర్చిదిద్దారు. నాగశౌర్య కెరీర్‌లో గుర్తుండిపోయేలా విజయం సాధిస్తుంది. నాగశౌర్య, రష్మిక జోడీ ఆకట్టుకుంటుంది. ముందస్తు విడుదల వేడుకకి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరవుతుండడం ఆనందంగా ఉంది. ఘనంగా వేడుకని నిర్వహించబోతున్నాం" అన్నారు.



సమంత

నటుడు, దర్శకుడు కాశీనాథ్ కన్నుమూత



కాశీనాథ్

కన్నడ సినీ చరిత్రలో సంచలన నటుడిగా, దర్శకుడిగా పేరొందిన కాశీనాథ్ (65) గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో కన్నుమూశారు. రెండేళ్లుగా రక్త క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బెంగళూరు బసవనగుడి ప్రాంతంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏడు నెలలుగా ఆయనను హార్ట్‌స్కిల్స్ ఫోమా అనే వ్యాధి పీడించింది. 'చౌక' ఆయన నటించిన చివరి చిత్రం. ఆయన నాలుగున్నర దశాబ్దాలపాటుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నారు. కర్ణాటకలోని ఉడుపి జిల్లా, కుందాపుర సమీపంలోని కోటేశ్వర గ్రామంలో కాశీనాథ్ జన్మించారు. బెంగళూరులోని విజయా కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ఆరంభంలో శాస్త్రవేత్త అవ్వాలనుకున్న ఆయన.. ఆ సమయంలోనే 'స్లిప్' పేరుతో లఘు చిత్రాన్ని రూపొందించారు. అదే ఆయనను చలనచిత్ర రంగంవైపు మళ్లేలా చేసింది. 1975లో 'అపురూప అతిథిగళు' సినిమాకు దర్శకత్వం వహించిన ఆయన, దాదాపుగా 13 సినిమాలకు దర్శకత్వం వహించారు. సుమారు 40 సినిమాల్లో నటించారు. కాశీనాథ్ నటించిన పలు చిత్రాలు తెలుగులో కూడా విడుదలయ్యాయి. 'అనుభవం', 'వింత శోభనం', 'భూలోకంలో రంభ ఊర్వశి మేనక', 'జాక్‌పాట్' తదితర చిత్రాలు తెలుగు ప్రేక్షకుల్ని అలరించాయి. కాశీనాథ్ నివాసం ఎప్పుడూ శిష్యులతో ఓ గురుకులంలా ఉండేదని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. ప్రముఖ దర్శకుడు, నటుడుగా గుర్తింపు పొందిన ఉపేంద్రతో పాటు, దర్శకుడు సునీల్‌కుమార్ దేశాయ్, వి.మనోహర్, అలనాటి నటి, ప్రస్తుత సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఉమాశ్రీ తదితరులు కాశీనాథ్ పరిచయం చేసిన వాళ్లే.

కదిలి వచ్చిన చిత్ర పరిశ్రమ

కాశీనాథ్ ఇక లేరన్న విషయం తెలియగానే కన్నడ చిత్ర పరిశ్రమలో విషాదం అలుముకొంది. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించేందుకు నటీనటులు ఆయన నివాసానికి తరలివచ్చారు. శివరాజ్‌కుమార్, సుదీప్, ఉపేంద్ర, కుమార్ గోవిందు తదితరులు కాశీనాథ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన లేని లోటు చిత్ర పరిశ్రమకు ఎప్పటికీ తీరదని వ్యాఖ్యానించారు. అభిమానులు అంతిమ దర్శనం చేసుకునేందుకు అనువుగా బసవనగుడిలోని ఏపీఎస్ కళాశాల మైదానంలో సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంచారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (ఎలక్ట్రానిక్ సిటీ)

వెండితెర రారాజు



దుల్కర్ సల్మాన్

జెమినీ గణేశన్ కింగ్ ఆఫ్ రొమాన్స్‌గా పేరు సంపాదించారు. వెండితెరపై ఆయన పోషించిన పాత్రలే ఆ గుర్తింపుని తీసుకొచ్చాయి. ఎన్నో ప్రేమకథల్లో ఒదిగిపోయి ప్రేక్షకులకు చేరువైన ఆయన వ్యక్తిగత జీవితం కూడా సినిమాని తలపిస్తుంటుంది. ప్రముఖ నటి సావిత్రిని వివాహమాడిన ఆయన దశాబ్దాలపాటు వెండితెరని ఏలారు. సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న 'మహానటి'లో జెమినీ గణేశన్ పాత్ర కీలకం. ఆ పాత్రని యువ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ పోషించాడు. సావిత్రిగా కీర్తి సురేష్ నటిస్తుండగా.. సమంత, విజయ్ దేవరకొండ, మోహన్‌బాబు ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. జెమినీ గణేశన్ పాత్ర నేపథ్యంలో సాగే సన్నివేశాల చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. దాంతో చిత్రబృందం ఆయన లుక్‌ని ట్విట్టర్ ద్వారా విడుదల చేసింది. జెమినీ గణేశన్ పాత్రలో సహజత్వం ఉట్టిపడేలా కనిపిస్తున్నాడు దుల్కర్.

నన్ను నేను మార్చుకుంటున్నా!



సోనాక్షి సిన్హా

బాలీవుడ్ అందాల భామ సోనాక్షి సిన్హాకు గత ఏడాది అంతగా కలిసిరాలేదు. ప్రయోగాత్మక పాత్రల్లో నటించినా పేరైతే వచ్చింది కానీ ఆ సినిమాలు బాక్సాఫీసు వద్ద బోల్తాకొట్టాయి. కానీ ఈ ఏడాది సోనాక్షి చేతినిండా సినిమాలే. ఐదు చిత్రాలు ఆమె నుంచి రానున్నాయి. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. "ఈ ఏడాది 'బూమ్ బూమ్ ఇన్ న్యూయార్క్', 'హ్యాపీ బాగ్ జాయేగీ' చిత్రాల్లో నటిస్తున్నాను. ఈ రెండూ హాస్య ప్రధానంగా సాగేవే. దీంతో ఈ సినిమాల్లో నటించడం చాలా సరదాగా ఉంది. దీంతో పాటు 'దబాంగ్ 3' లాంటి భారీ చిత్రంలోనూ నటిస్తున్నాను. ఇవి కాకుండా మరో రెండు చిత్రాలకు సంబంధించిన వివరాలు త్వరలోనే వెల్లడిచేస్తాను. ఎప్పటికప్పుడు నన్ను మార్చుకొంటూ ముందుకెళ్లడమే కాదు పాత్రల్లోనే సంతోషాన్ని వెతుక్కొంటున్నాను" అని చెప్పింది. గత ఏడాది సోనాక్షి ఎంతో కష్టపడి చేసిన 'ఇత్తేఫాక్', 'నూర్' లాంటి చిత్రాలు మంచి ఫలితాన్ని ఇవ్వలేదు. "ఫలితం మాట ఎలా ఉన్నా ప్రేక్షకులు ప్రయోగాత్మక చిత్రాలు చూడటానికి ముందుకొస్తున్నారు. వైవిధ్యమైన కథలతో సినిమాలు చేయడం రిస్క్ కాదు అనే భరోసా దర్శక నిర్మాతల్లోనూ పెరగడం మంచి పరిణామం" అని చెప్పింది సోనాక్షి.

కామెడీ...అడల్ట్ కామెడీ ఒకటే!

చిత్ర పరిశ్రమలో అడల్ట్ కామెడీ చిత్రాల సంఖ్య ఈ మధ్య కాలంలో పెరుగుతూ వస్తోంది. అడల్ట్ కామెడీ చిత్రాలు చేయడానికి మీరు సిద్ధమేనా అంటే "కామెడీ, అడల్ట్ కామెడీ అంటూ దేన్నీ నేను వేరుగా చూడను. ఏ సినిమా చూసినా నవ్వుకొంటానంతే. ఇదంతా నా వ్యక్తిగతం. సినిమాల విషయానికొచ్చేసరికి నా ఆలోచనలు వేరుగా ఉంటాయి. నేను ఎలాంటి సినిమా చేసినా నా కుటుంబంతో కలిసి చూసేలా ఉండాలి. ఈ నియమం ఉల్లంఘించకుండా ఉండే ఏ చిత్రంలోనైనా నేను నటిస్తాను" అని సమాధానమిచ్చింది సోనాక్షి.

సీమ ప్రేమ



రాధికా పాటిల్

రాఘవ్, కరాణ్య కత్రీన్, మీనాకుమారి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'బంగారి బాలరాజు'. కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కేఎండీ.రఫి, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మిస్తున్నారు. రాధికా పాటిల్ ఓ ప్రత్యేకగీతంలో ఆడిపాడింది. దర్శకుడు మాట్లాడుతూ "రాయలసీమలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ప్రేమకథా చిత్రమిది. పరువు, ప్రతిష్ఠల నేపథ్యంలో సాగుతుంది. శాంతాబాయ్ పాటతో కుర్రాళ్లని అలరిస్తున్న రాధికా పాటిల్ ఈ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. గీతామాధురి పాడిన పాటలో మంచి నృత్యం చేసింది. ఈ నెల చివరి వారంలో టీజర్‌ని విడుదల చేస్తాం" అన్నారు. శ్రవణ్; ఎన్.వి.చౌదరి, సారిక రామచంద్రరావు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: చిన్ని కృష్ణ, చిట్టిబాబు రెడ్డిపోగు, ఛాయాగ్రహణం: జి.ఎల్.బాబు.

అలా ఆలోచిస్తే గందరగోళమే!

ఎంత సంపాదించినా, ఎంత పేరొచ్చినా ఇంకా ఏదో కావాలి అనిపిస్తుంటుంది. ఇది మానవ నైజం. తృప్తి అనేది లేకపోతే మానసిక శాంతి అనేది కూడా ఉండదు. ఈ విషయం నేను ఎప్పటికీ మర్చిపోను. నా వాళ్లు అనుకున్న వాళ్లకూ ఇదే విషయం చెబుతా అంటోంది సమంత. "నేను పుట్టడంతోనే సినిమా స్టార్‌ని కాదు కదా... అన్నీ కలిసొచ్చి ఇంతమంది ప్రేక్షకుల అభిమానం పొందగలిగాను. నా ఆర్థిక స్థితిగతులు మారాయి. ఇంకా ఏదో కావాలి అని అనుకోలేదు కాబట్టే ఆత్మ సంతృప్తి దక్కింది. అలా కాకుండా నా సినిమాల సంఖ్య ఇంకా పెరగాలి, ఇంకా కోట్లాది రూపాయలు వెనకేసేయాలి... ఇలా ఆలోచిస్తే జీవితం గందరగోళం అవుతుంది. మనకున్న దాంతో తృప్తి పడాలి, మనకున్న దాంట్లోనూ కొంత ఇతరులకు పంచి తృప్తి పడాలి" అని చెప్పింది సమంత. ప్రస్తుతం 'రంగస్థలం', 'మహానటి' చిత్రాలతో బిజీగా ఉందీ భామ.



సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్

మరోసారి మెరిపిస్తారట!

'టైగర్ జిందా హై' చిత్రం ప్రేక్షకులతో జేజేలు కొట్టించుకొంది. బాక్సాఫీసు వద్ద రికార్డుల మోత మోగించింది. సల్మాన్‌ఖాన్, కత్రినా కైఫ్ యాక్షన్ హంగామా ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ఓ వైపు యాక్షన్‌లో సత్తా చాటుతూనే పాటల్లో అందాల విందు చేసింది కత్రిన. దాదాపు ఐదేళ్ల తర్వాత కలిసి నటించి అభిమానుల్ని ఖుషీ చేసిందీ జంట. ఇప్పుడు మరోసారి ఈ జంటను వెండితెరకు తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నారు దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్. ఆయన దర్శకత్వంలో సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భరత్'. ఇందులో కథానాయికగా కత్రినాను ఎంచుకొనే అవకాశాలున్నాయి. 'ఇప్పటివరకూ ఈ సినిమాలో నాయిక ఎవరనేది నిర్ణయించలేదు. కత్రినా పేరైతే నా మనసులో ఉంది. ఆమెతో నాకు మంచి స్నేహం ఉంది. ఏ విషయం గురించి అయినా చర్చించుకుంటాం. 'భరత్'లో పాత్రకు కత్రినానే అనుకొంటే వెంటనే ఆమెతో చెప్పేస్తాను"అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు అలీ అబ్బాస్ జాఫర్. సల్మాన్, కత్రినా నటించడం ఖాయమైనట్టు బాలీవుడ్ వర్గాల సమాచారం.

ఆక్స్‌ఫర్డ్‌లో 'ప్యాడ్‌మ్యాన్'

గ్రామీణ మహిళల రుతుక్రమ సమస్యలను తొలగించేందుకు తక్కువ ధరకు శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేసి అందించిన సామాజిక కార్యకర్త తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనాథం. ఈయన నిజ జీవితం ఆధారంగా అక్షయ్‌కుమార్ హీరోగా తెరకెక్కిన 'ప్యాడ్‌మ్యాన్', ఈనెల 25న విడుదలవుతోంది. అక్షయ్ భార్య, నటి, ట్వింకిల్‌ఖన్నా ఈ చిత్రానికి నిర్మాత. ఇప్పుడీ సినిమాకి అరుదైన గౌరవం దక్కింది. ట్వింకిల్‌ఖన్నాకు ప్రఖ్యాత 'ఆక్స్‌ఫర్డ్ యూనియన్'లో ప్రసంగించే అరుదైన అవకాశం దక్కింది. అంతేకాదు ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో ప్రదర్శించబోతున్న తొలి భారత సినిమాగా 'ప్యాడ్‌మ్యాన్' అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఈ వేదికపై ఇంతకుముందు మైకెల్ జాక్సన్, సల్మాన్ రష్దీ, దలైలామా, శశిథరూర్ వంటి ప్రముఖులు ప్రసంగించారు.

వసుంధర

కంచిపట్టు చీరలు సంప్రదాయ వేడుకలకు సరైన ఎంపిక. మరి వాటికి నెమళ్లూ, గుర్రాల సోయగం తోడైతే అదిరిపోవడం ఖాయం. అలా అలరించేవే ఈ ప్రత్యేక కంచిపట్టు చీరల వస్త్రశ్రేణి.

కంచిపట్టుపై నెమళ్ల కనికట్టు...

ఫ్యాషన్ ఫ్యాషన్









ఆకర్షించే కుంకుమ రంగు కంచిపట్టు బ్రొకేడ్ చీరపై పసిడి వర్ణంలో మెరిసిపోయే మయూరాల చేనేత పనితనం.. డైమండ్ కట్ స్ట్రిప్స్, ఖాదీ అంచు అదనపు హంగులు.

గులాబీ రంగు కంచిపట్టు బ్రొకేడ్ చీరపై వెండి రంగు నెమళ్లూ, గుర్రాల మోటిఫ్‌లు.. సంప్రదాయాన్ని ప్రతిబింబించే అంచు.. చీర అందాన్ని పెంచాయి.

నారింజా, గులాబీ రంగుల మేళవింపులో వచ్చిన టిష్యూ కంచిపట్టు చీర ఇది.. దానిపై పసిడి, వెండి రంగుల్లో వచ్చిన నెమళ్ల మోటిఫ్‌లు ప్రత్యేక ఆకర్షణ.

లేత ఆకుపచ్చ కంచిపట్టు చీరమీద గళ్లు.. అంచూ, కొంగు చివర్లకు ముదురు గులాబీ రంగుతో చేసిన పనితనం కొత్త కళ తెచ్చింది.

మోడల్: అమిష్కా పవార్
ఫొటోలు: దండా శ్రీనివాసరావు

ఆరాధిస్తున్నారా.. ఆధారపడుతున్నారా?

ప్రేమలో పడ్డాక ఈ రెండింటికీ పెద్దగా తేడా తెలియదు. ఎప్పుడూ ప్రేమించినవాళ్ల తలపుల్లోనే ఉండటం, ఓ చిన్న పలుకూ, చూపూ, పిలుపు కోసం తహతహలాడటం.. ఏ కాస్త ఆలస్యమైనా కుంగిపోవడం.. ఇదంతా ఏమిటీ? ఓ మహత్తరమైన బంధంలో ఇమిడిపోవడంలో భాగమా? లేకపోతే మన వ్యక్తిత్వాన్ని కోల్పోవడమా? మనసులో ఎక్కడో మూల ఈ సందేహాలు వేధిస్తూనే ఉంటాయి. మీరు మానసికంగా ఎదుటివాళ్లపై విపరీతంగా ఆధారపడుతున్నారేమో తెల్సుకోవడానికి వీటినో సారి చూడండి..



స్నేహం మీతో మాత్రమే! : మీకు నచ్చినవాళ్లు తమ స్నేహితులతో కలిసి ఆనందిస్తుంటే ఉడుక్కుంటున్నారా? మీరు అతనిపై ఉద్వేగపరంగా ఆధారపడుతున్నారనడానికి ఇదో కొండగుర్తు. స్నేహం, ఆనందాల విషయంలో ఎవరి వ్యక్తిత్వం వారిదని తెలుసుకోండి. ఆ అవగాహనని ఆచరణలో పెట్టినప్పుడే.. మీ ప్రేమ కలకాలం నిలుస్తుంది.

మీకు ఇష్టంలేకున్నా : అతనికి క్రికెట్ అంటే వీరాభిమానం. అతనికోసం మీరూ టీవీ ముందు గంటల తరబడి కూర్చోవాలనుకుంటున్నారు! క్రికెట్ అంటే మీకూ ఇష్టం ఉండి చూడటం వేరు. ఇష్టం లేకున్నా అతనికోసం అలా కూర్చోవడం వేరు. ఈ రెండోది అతనిపై మానసికంగా ఆధారపడుతున్నందుకు గుర్తు.

మీకంటూ ఓ ప్రపంచం ఉందా? : ప్రేమలో పడ్డాక కూడా మీరు మీ ఖాళీ సమయాన్ని మీదైన అభిరుచులతో నింపగలుగుతున్నారా? పుస్తకాలు చదవడం, పర్యటనలూ.. ఇవన్నీ చేయగలుగుతున్నారా? అలా చేయగలిగితే మీరు మానసికంగానూ, ఉద్వేగపరంగానూ ఎవరిపైనా ఆధారపడుతున్నట్టు కాదు. అలాకాకుండా ఎక్కడికెళ్లినా అతనూ ఉండాలని కోరుకుంటే.. చిక్కే. కాబట్టి, మీరెంతగా ప్రేమలో తలమునకలైనా మీదైన లోకాన్ని వదులుకోవద్దు.

స్నేహితులతో కాసేపు...

ఒకప్పుడు విపరీతంగా బాధ్యతలున్నవారే ఒత్తిడికి లోనయ్యేవారు. ఇప్పుడు మారిన జీవనశైలి ప్రతి ఒక్కరినీ దాని బారిన పడేస్తోంది. వారిలో యువతా ఉన్నారు. చదువూ, ప్రేమా, స్నేహాలూ, అలవాట్లు వంటివన్నీ కూడా ఒత్తిడికి గురిచేసే అంశాలే. మరి దాన్ని ఎలా అధిగమించాలో చూడండి.



- మీ సరదాలూ, సంతోషాలతో ఆరోగ్యకరమైన జీవనశైలి పెంచుకోండి. స్నేహితులతో కలిసి సరదాగా ట్రెక్కింగ్, సైక్లింగ్, టెన్నిస్ వంటివి ప్రయత్నించండి. వారాంతాల్లో మొదలుపెడితే... ఆ ఆసక్తి మీకు ఆరోగ్యాన్నీ అందిస్తుంది. ఒత్తిడినీ దూరంగా చేస్తుంది.
- మొబైల్, ట్యాబ్‌ల్లో గంటలు గంటలు చేసే ఛాటింగ్... కూడా ఒకవిధంగా ఒత్తిడికి దారితీస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి వాటిని వినియోగాన్ని తగ్గించి కుటుంబసభ్యులూ, స్నేహితులతో ఎక్కువసేపు గడిపేలా చూసుకోవడం మంచిది.
- యుక్తవయసులో ప్రేమలూ, ఆకర్షణలూ సహజమే. కానీ వాటినే ప్రపంచంగా బతికేయొద్దు. మీ ప్రేమ నిజమే అనుకుంటే 'కాస్త స్థిరపడేవరకూ....' అనే హద్దు తప్పనిసరిగా పెట్టుకోవాల్సిందే. ఇదే మీ మధ్య బంధాన్ని బలపరుస్తుంది. ఒత్తిడీ ఉండదు.
- చిన్నవయసులోనే ఉద్యోగం సాధిస్తే.. దానికంటూ ఓ ప్రణాళిక పెట్టుకోవడం మొదలుపెట్టాలి. వృత్తి, వ్యక్తిగత జీవితానికి ఓ సరిహద్దు అంటూ గీసుకోవాలి. చాలా తక్కువ సమయంలోనే పేరు తెచ్చుకోవాలనుకోవడం మంచిదే కానీ.. అది ఒత్తిడిగా మారకుండా చూసుకోవడం మంచిది.

నన్ను చూసి.. పిల్లల్ని దాచేసేవారు!



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా విడుదల చేసే క్యాలెండర్‌లో ఫొటో.. అదీ మొదటి పేజీలో పడటం అంటే మాటలా..? అలాంటి అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకుంది గీతావర్మ. ఆమె ప్రముఖురాలేం కాదు. సాధారణ ఏఎన్ఎం.. అదేనండీ.. గ్రామీణ ఆరోగ్య సేవకురాలు. మరి ఆ గుర్తింపు ఎలా వచ్చిందంటారా? గీత కష్టానికి అందిన ప్రతిఫలం అది. ఆ వివరాలు వసుంధరతో ఇలా పంచుకున్నారు..

మా స్వస్థలం హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లా మహూనాగ్. ఏడాదిలో ఆరునెలలకు పైగా పర్వత శ్రేణులపై మంచు పరుచుకుని ఉంటుంది. ఆ కనుమల మధ్యలోయల్లోని నిరుపేద చిన్నారులకు టీకాలు వేయడం నా పని. ఓ గ్రామీణ ఆరోగ్య సేవకురాలిగా సెరాజ్ లోయ ప్రాంతం నుంచి రాయగఢ్ వరకూ ఉండే గర్భిణులూ, పిల్లలకు టీకాలు వేయాలి. అమ్మానాన్నలకి నేనొక్కదాన్నే సంతానం. నేను చిన్నగా ఉన్నప్పుడే నాన్న మాకు దూరమయ్యాడు. దాంతో అమ్మే అన్నీ తానైంది. మా ప్రాంతంలో ఇంట్లో అబ్బాయి ఉంటేనే ఆ కుటుంబానికి విలువ. అందుకే మా బంధువులు అమ్మకు రెండో పెళ్లి చేయాలనుకున్నారు. అమ్మ వినలేదు సరికదా... నన్నే అబ్బాయిగా పెంచుతానని చెప్పింది. యాపిల్ పండ్ల తోటల్లో, ఇళ్లల్లో పనిచేసి నన్ను చదివించింది. అమ్మ కష్టం చూస్తే స్కూలు మానేయాలనిపించేది. అమ్మ మాత్రం 'చదువుకుంటేనే బతకగలవ'ని పదేపదే చెప్పేది. స్కూలు అయిపోవడం ఆలస్యం అమ్మ ఎక్కడుంటే అక్కడకు పరుగెత్తేదాన్ని. తనకు సాయం చేశాకే నా హోంవర్క్. పదోతరగతి అయ్యాక ఏఎన్ఎం (ఆక్సిలరీ నర్స్ మిడ్‌వైఫెరీ) డిప్లొమా కోర్సు పూర్తిచేశా.





వారిని ఒప్పించడమే సమస్య...

డిప్లొమా అయ్యాక ఆరేళ్ల కిందట ఏఎన్ఎంగా శిక్షణ తీసుకుని మండి జిల్లాలో నా సేవలు మొదలుపెట్టా. ఈ జిల్లాలో గతేడాది ప్రపంచ ఆరోగ్యసంస్థ, కేంద్రప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా మశూచీ, రుబెల్లా నిర్మూలనకు అతిపెద్ద టీకా కార్యక్రమం ప్రారంభించాయి. దానికి నేను ఎంపికయ్యా. వాటిని కొండల మధ్య సెరాజ్ లోయలోని అటవీ ప్రాంతంలో ఉన్న పిల్లలకు వేయాలి. అక్కడ గిరిజనా, ఇతర ప్రాంతాల నుంచి వలసలకు వచ్చిన కుటుంబాలే ఎక్కువ. దాదాపు అందరూ నిరక్షరాస్యులే. వ్యాధుల పట్ల ఏ మాత్రం అవగాహన ఉండదు. నెలల పాపాయి నుంచీ 15 ఏళ్ల లోపు వారికి రుబెల్లా టీకా వేయాలి. ఇది ఓ వైరస్‌కు మందు అని చెప్పి వారిని ఒప్పించడం చాలా కష్టం. కొందరు తల్లిదండ్రులయితే నేను వెళ్లేసరికి పిల్లలు కనపడకుండా దాచేసేవారు. వాళ్లకు కేవలం అవగాహన కల్పించేందుకే రెండు నెలలు తిరగాల్సి వచ్చేది. అక్కడ ఎంతమంది చిన్నారులు ఉన్నారో ముందే చూసొచ్చేదాన్ని కాబట్టి పని ఎలాగైనా పూర్తిచేసేదాన్ని.

గర్భిణులూ అంతే...

గతేడాది 364 మందికి రుబెల్లా టీకాలు వేశా. ఏ ఇంటికైనా వెళ్లి.. మీ ఇంట్లో గర్భిణులు ఉన్నారా అంటే సమాధానం ఇచ్చేవారు కాదు. ఒకవేళ చెప్పినా టీకాకు ససేమిరా అనేవారు. వాళ్లకు టీకా వేయడంతోపాటూ బరువు చూడటం సహా, రక్త పరీక్షలూ చేయాలి. ప్రత్యేక ఆరోగ్య కార్డును అందించి జిల్లా కేంద్రానికి రప్పించాలి. పోషకాహారం, టీకాల పట్ల అవగాహన అందించాలి. ఇవన్నీ చేశాకే రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచావంటూ మా ముఖ్యమంత్రి జై రాం ఠాకూర్ అభినందించారు. యూనిసెఫ్ నుంచీ ప్రశంసలు అందాయి. అలా ప్రపంచ ఆరోగ్య సంస్థ తమ క్యాలెండర్ మొదటి పేజీలో నా ఫొటో వేసింది. ఇప్పుడు జనవరిలో పోలియో వ్యాక్సిన్ క్యాంప్ ఉంది. దాన్నీ విజయవంతంగా పూర్తిచేయాలి. నా కష్టం వెనుక మా వారి ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది.

పెదవులు నల్లగా ఉంటున్నాయి.. ఏం చేయను!

? **నా వయసు 38 సంవత్సరాలు. నా పెదవులు చాలా నల్లగా ఉంటాయి. ఇదేమన్నా ఆరోగ్య సమస్యా? పెదాలు ఆరోగ్యంగా, లేత గులాబీ వర్ణంలో కనిపించాలంటే ఏం చేయాలి?**

- శ్రీదుర్గ, విజయవాడ

✔ వంశపారంపర్యంగా వచ్చే జన్యు సమస్య వల్ల పెదవులు నల్లగా మారతాయి. అలానే ఇనుము లోపం ఉన్నా ఈ సమస్య ఎదురవుతుంది. ఇలాంటప్పుడు నీలం కలిసిన నలుపు రంగులో ఉంటాయి. అలానే లెంటిగో, నాన్‌లెంటిగో సమస్యలతోనూ ఇలా జరగొచ్చు. జన్యు సంబంధిత సమస్యలూ, డెర్మటైటిస్, కొన్ని రకాల కామెర్లు, ఒత్తిడీ, మలేరియా సమస్యలకు టెట్రాసైక్లింగ్ మందులు తీసుకున్నప్పుడూ, ఎనరక్సియా అనే ఈటింగ్ డిజార్డర్ వల్ల కూడా ఈ సమస్య తలెత్తవచ్చు. అతి శీతల వాతావరణంలోనూ నల్లగా మారతాయి. పోషకాహారలోపం, బీ విటమిన్లు తగ్గినా ఈ సమస్య ఎదురవుతుంది. ఇక కాస్మొటిక్స్ టాక్సిన్స్... అంటే లిపిస్టిక్ వేసుకున్నప్పుడు దానిలో ఉండే మెటల్ మెర్క్యురీ, సిల్వర్ వంటివీ పెదవుల్ని నల్లగా మారుస్తాయి. ఎక్కువ కాఫీ, టీలు తీసుకున్నప్పుడూ, పెదవుల్ని తరచూ తడుపుతూ ఉన్నా... హార్మోన్ల మార్పులు కూడా దీనికి కారణం కావొచ్చు. వీటితో పాటు జీవనశైలిలో మార్పులు అంటే... డ్రగ్స్, ఆల్కహాల్ తీసుకోవడం, వక్కపొడి నమలడం వంటి అలవాట్లు కూడా పెదాలకు హాని చేస్తాయి. రక్తహీనత లేకుండా చూసుకోవడం, పోషకాహార లోపాన్నీ సరిచేసుకోవడం, కామెర్ల వ్యాధిని నియంత్రించగలగడం లాంటివి చేస్తే ఈ సమస్య చాలామటుకూ తగ్గుతుంది. ముందు అసలు సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేయండి. దీన్ని సహజంగా తగ్గించుకోవాలనుకున్నప్పుడు పంచదారను కాసిని నీళ్లతో కలిపి పెదవులపై రుద్దుకోవాలి. మృతకణాలు పోయి రంగు మారతాయి. అలాగే రోజూ మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లోషన్‌నూ పెదవులకు కాస్త రాసుకోవాలి. బంగాళాదుంప గుజ్జుని రాసుకుని పదినిమిషాల తరువాత కడిగేసుకుంటే సరి. చిన్న బీట్‌రూట్ ముక్కను పెదవులపై రాసుకున్నా మార్పు ఉంటుంది. కలబందా, క్యారెట్ గుజ్జుని రాసుకున్నా కూడా ఫలితం ఉంటుంది.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

బంగారం-వెండి

18న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,950	31,050	31,100	31,100
ఆర్నమెంట్	28,920	29,060	28,900	28,850
వెండి (కిలో)	39,995	40,100	40,400	40,400
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,060	30,080	30,600	30,790
ఆర్నమెంట్	28,410	28,560	28,610	28,790
వెండి (కిలో)	40,000	40,600	39,400	39,700
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,770	30,990	-------	-------
ఆర్నమెంట్	28,680	28,820	2,861	2,879 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.00	42.40 గ్రా

గుడ్డూ... పాలకూర... కలిపి తింటే!

గుడ్డు బలవర్ధకమైన ఆహారం అని మనకు తెలుసు. దీనిలోని విటమిన్లూ, మాంసకృత్తులూ, ఖనిజాలూ, కొవ్వులు మనకు ఎంతో బలాన్నీ, ఆరోగ్యాన్ని ఇస్తాయి. బరువు తగ్గాలనుకునేవారు గుడ్డును ప్రత్యామ్నాయ పదార్థంగా ఎంచుకోవచ్చు. దాంతోపాటూ ఏయే పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుందో చూద్దామా!



పాలకూరతో... పాలకూర గుజ్జూ, గుడ్డును కలిపి ఆమ్లెట్‌గా తీసుకోవచ్చు. దీని నుంచి మనకు పోషకాలతోపాటు కావాల్సిన ఇనుము లభిస్తుంది. కప్పు పాలకూర నుంచి కేవలం ఏడు కెలోరీలు మాత్రమే లభిస్తాయి. ఇది మనకు కావాల్సిన శక్తిని ఇవ్వడమే కాకుండా జీర్ణక్రియ సాఫీగా జరిగేలా చూస్తుంది. అంతేకాదు పాలకూరను తీసుకోవడం వల్ల పొట్ట నిండినట్లుగా ఉండి చాలా సేపటి వరకు ఆకలి వేయదు.

కొబ్బరినూనెతో... వెన్నా, వంటనూనెతో వేసుకున్న ఆమ్లెట్ రుచి అమోఘం కదూ! దాంతోపాటు మీ శరీరంలో కెలొరీలూ కూడా పెరుగుతాయి. ఈసారి ఆమ్లెట్‌ను కొబ్బరినూనెతో వేసి చూడండి. వంటనూనెకు బదులుగా దీన్ని వాడటం వల్ల పొట్ట ప్రాంతంలో కొవ్వు తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతిరోజూ రెండు చెంచాల కొబ్బరి నూనెను ఇలా ప్రయత్నించడం వల్ల మంచి ఫలితం ఉంటుందట.

ఓట్ మీల్‌తో... ప్రతి రోజూ మీరు తీసుకునే ఆహారంలో ఓట్స్‌ను చేర్చుకోవడం వల్ల మీ నడుము ప్రాంతంలోని కొవ్వును తగ్గించుకోవచ్చు. దీన్ని తీసుకోవడం వల్ల పొట్ట నిండినట్లు ఉంటుంది. త్వరగా ఆకలి వేయదు. ఇది ఆహారం నెమ్మదిగా జీర్ణమవడానికి తోడ్పడుతుంది. అంతేకాదు ఆకలిని తగ్గించే, కెలొరీలను కరిగించేలా చేస్తుంది. కాబట్టి రోజూ ఓట్స్‌కు జతగా గుడ్డునూ కలిపి తీసుకుంటే మంచిది. అలా తీసుకోవడం వల్ల కెలొరీలూ ఖర్చవుతాయి, శక్తీ లభిస్తుంది.

చిట్కా

గోళ్ల పెయింట్‌తో మరక మాయం

మోజుపడి ఇష్టంగా కొనుక్కున్న కారు లేదా బైక్‌పై పొరపాటునో, గ్రహపాటునో ఏదైనా చిన్న గీత పడ్డా మనసు చివుక్కుమంటుంది. అయితే ఈ బెంగను, ఖర్చునూ తప్పించుకోవాలంటే చిన్న చిట్కా ఉందండోయ్. అదేంటంటే.. మీ కారు లేదా బైక్ ఏదైతే రంగులో ఉందో అదే కలర్ నెయిల్ పెయింట్‌ని స్క్రాచ్ పడినచోట రాయండి. చిన్న దూదితో లేదా వేలితో గీతలున్న చోట అంతటా రుద్దండి. తర్వాత దాన్ని మెల్లిగా ఐలైనర్ బ్రష్‌తో రాయండి. కొన్ని క్షణాల్లో మరక మాయమవుతుంది. మీ మనసు ఖుషీ అవుతుంది.





మోపెడ్ నుంచి భారీ ట్రక్ దాకా...
బేసిక్ బైక్ నుంచి ఖరీదైన లగ్జరీ కారు వరకు...
వాహనం ఏదైనా ముందుకు కదలాలంటే టైరు ఉండి తీరాల్సిందే...
అంతటి కీలకమైన ఆ భాగాన్ని సక్రమంగా నిర్వహించడమెలా?
ప్రమాదాల బారిన పడకుండా ఉండే మార్గాలేంటి?
టైరుపై ఉండే అంకెల కహానీ ఏంటి?
ఆటోమొబైల్ రంగంలో ఉన్న కొందరు నిపుణులతో చర్చించాం...
వాళ్లు చెబుతున్న సలహాలు, సూచనలివి.

టైరు బాగు.. టైము బాగు!

ఇంజిన్.. పెట్రోల్.. బ్రేక్.. ఈ వరుసలో వచ్చే మరో కీలకమైన భాగం టైరు. ఆటోమొబైల్‌పై అవగాహన ఉన్న ఎవరైనా చెప్పే మాటిదే. ఆ మాటకొస్తే డ్రైవరుకు, రోడ్డుకి మధ్య వారధిలా ఉండే ఒకేఒక పార్ట్ టైరు. వాహనంతోపాటు అందులో ఉన్నవారి భారం మోసేవీ.. సుఖమయ ప్రయాణం అందించేవీ.. సురక్షితంగా గమ్యస్థానం చేర్చేవీ ఆ టైర్లే. అంత ప్రాముఖ్యం ఉన్న వాటి నిర్వహణ కూడా సక్రమంగా ఉండి తీరాల్సిందే.

మన్నిక, భద్రతకు మార్గాలివి

- టైర్ల నిర్వహణలో ముఖ్యమైందీ, తేలికైందీ తగిన మోతాదులో గాలి ఉండేలా చూసుకోవడం. టైరులో గాలి తక్కువైతే లోడింగ్ సామర్థ్యం తగ్గుతుంది. టైరు ఇరుపక్కలా బీటలు ఏర్పడతాయి. మైలేజీపై ప్రభావం పడుతుంది. ఎక్కువైతే కుదుపులతో ప్రయాణం అసౌకర్యంగా ఉంటుంది. ఇవన్నీ తప్పాలంటే తరచుగా గాలి చెక్ చేయాలి.
- బైక్, కారు, ట్రక్.. వాహనం ఏదైనా టైర్లు త్వరగా పాడవడానికి, పేలిపోవడానికి, ఫెయిల్యూర్‌కి కారణం అత్యధిక భారం మోపడం. వాహన సామర్థ్యానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ బరువులు వేయొద్దు. బైక్‌లపై ట్రిబుల్ రైడింగ్, కారులో ఎక్కువమంది ప్రయాణించడం, ట్రక్‌లో అత్యధిక లోడింగ్ వేయడం ఇలాంటివే.
- ద్విచక్రవాహనాలు ఇరవై వేల కిలోమీటర్లు తిరిగితే లేదా నాలుగైదేళ్లు దాటితే టైర్లు మార్చాలి. కార్లకి యాభైవేల కిలోమీటర్లు పూర్తైతే లేదా ఏడెనిమిదేళ్లు దాటితే మార్చాలనేది నిపుణులు చెప్పే మాట.
- రాష్ డ్రైవింగ్, అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, అత్యధిక వేగం, మలుపుల దగ్గర సడెన్‌గా తిప్పడం.. టైరు వేడెక్కడానికి కారణాలు. అవి టైరు ఆయుష్షు తగ్గిస్తాయి.
- ట్రెడ్ మందం 1.65మిమీలకు తగ్గితే టైరు మార్చాలనే నిబంధనలున్నాయి. 8ఎంఎం మందం ఉన్న టైర్లు బ్రేక్ వేసిన 53మీటర్లకు ఆగితే.. 1.6మిమీల మందం ఉన్నవి 70మీటర్ల తర్వాత ఆగుతాయి. అరిగిపోయిన టైర్లు తడి రోడ్లపై జారిపోతుంటాయి. బురద రోడ్లలో కూరుకుపోతే బయటికి రాలేవు.
- రిమ్, టైర్ కాంబినేషన్ సరిగ్గా ఉండాలి. రిమ్‌లో వంపులు ఉండటం.. మట్టి, తుప్పు పడితే అవి టైర్లపై ప్రభావం చూపించి త్వరగా పాడయ్యేలా చేస్తాయి. టైరు ట్రెడ్ సందుల్లో ఇరుక్కున్న మేకులు, గాజుముక్కలు, పదునైనా రాళ్లు, లోపలి నుంచి ఏర్పడే గాలి బుడిపెలు ఒక్కోసారి టైరు పేలిపోవడానికి కారణమవుతాయి.
- ధర తగ్గుతుందనే ఉద్దేశంతో కొందరు రీట్రెడ్ టైర్ల వాడకం వైపు మొగ్గు చూపుతారు. ఇది అపాయకరం. వేడిని తట్టుకోవు. పేలిపోవడానికి అవకాశాలెక్కువ.
- ప్రతి ఐదువేల కిలోమీటర్లకు ఓసారి టైర్ల రొటేషన్‌ని చెక్ చేయాలి. పదివేల కిలోమీటర్లకు ఓసారి టైర్ అలైన్‌మెంట్‌ని పరిశీలించాలి.
- టైరు పేలిపోయి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు తరచూ చూస్తున్నాం. దీని ముఖ్య కారణాల్లో అతివేగం ఒకటి. వేసవికాలంలో రోడ్ల ఉపరితలం వేడిగా ఉంటుంది. వాహనం ఎక్కువ వేగంతో వెళ్తే వేడి, రాపిడి రెండూ పెరిగి టైరు పగిలే ప్రమాదం.
- ఆపకుండా ఎక్కువ దూరం ప్రయాణించినా టైర్లు వేడెక్కుతాయి. అందుకే దూరప్రయాణాల్లో సాధ్యమైనంత ఎక్కువ విరామాలు తీసుకోవాలి.
- బాగా పాతవి, అరిగిపోయిన వాటికి త్వరగా పంక్చర్లు పడే అవకాశం ఉంది. ఇలాంటి వాటితో అత్యధిక వేగంతో వెళ్తే బ్లోఅవుట్‌నే.

అంకెల కథ

ప్రతి టైరు మీద కొన్ని అంకెలు కనిపిస్తాయి. వాటి కథేంటంటే..



ఆరు పొరలు

బయటికి కనిపించేది టైరు ఒక్కటే కానీ ఇందులో ఆరు నుంచి ఎనిమిది పొరలుంటాయ్. ఆ వివరాలు.

❖ ట్రెడ్ స్ట్రిప్: రబ్బరుతో తయారు చేస్తారు. రోడ్లపై అయినా టైరు పట్టు కోల్పోకుండా ఉండేలా చేస్తుంది. ఇందులో క్యాప్, బేస్ విభాగాలుంటాయి. బేస్.. ట్రెడ్ వేడిని తగ్గిస్తుంది.

❖ మల్టీప్లై స్టీల్ బెల్ట్: రబ్బరులో పొదిగిన ఉక్కు తాళ్లతో తయారవుతుంది. డ్రైవింగ్‌లో స్థిరత్వం తెచ్చేలా.. కుదుపులు లేకుండా సాఫీగా సాగిపోవడానికి సాయపడతాయి.

❖ స్టీల్ కేసింగ్: ఉక్కు తాళ్లతో తయారీ. టైరు నిర్మాణంలో దృఢత్వం తీసుకురావడానికి ఉపయోగపడతాయి. అత్యధిక భారం పడ్డప్పుడు టైరు దిశ మారకుండా ఉండేందుకు తోడ్పడతాయి.

❖ ఇన్నర్ లైనర్: రబ్బరు. ట్యూబ్‌లెస్ టైరు లోపల గాలి విస్తరించడాన్ని అడ్డుకుంటుంది.

❖ సైడ్‌వాల్స్: రబ్బరుతో తయారవుతుంది. బయటి నుంచి మాలిన్యాలు లోపలికి రాకుండా అడ్డుకుంటుంది. బయటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని పడనీయదు.

❖ బీడ్ రీన్‌ఫోర్స్‌మెంట్: నైలాన్, అరమైడ్, ఉక్కుతాళ్లతో రూపొందిస్తారు. టైరులోని అంతర్గత పొరల్ని కాపాడుతుంది.

❖ బీడ్ కోర్: రబ్బరులో పొదిగిన ఉక్కు తాళ్లతో తయారీ. టైరు రిమ్‌లో స్థిరంగా కుదురుకునేలా ఉపయోగపడుతుంది.

సరికొత్తవి..

సాధారణ టైర్లు.. రేడియల్ టైర్లు.. వింటర్ టైర్లు.. ట్యూబ్‌లెస్ టైర్లు.. రోజురోజుకీ టెక్నాలజీ మారిపోతూనే ఉంది. ఆ వరుసలో..

❖ చిప్ టైరు: టైరు పరిస్థితి ఎలా ఉందో బయటి నుంచి తెలుస్తుంది. మరి లోపలి సంగతేంటి? ఇది తెలుసుకోవడానికి టైరు లోపల ఎలక్ట్రానిక్ చిప్‌ని అమర్చే టెక్నాలజీ తీసుకొచ్చింది గుడ్‌ఇయర్-డన్‌లప్ కంపెనీ. దీని సాయంతో లోపల గాలి ఒత్తిడి, ఉష్ణోగ్రత, అంతర్భాగాల పనితీరు వివరాల్ని ఇన్ఫోటైన్‌మెంట్ తెరపై చూడొచ్చు.



❖ సొంతంగా పంక్చర్: టైరు పంక్చర్ పడితే అదో పెద్ద ప్రయాస. ఈ కష్టమేం లేకుండా తనకు తానే పంక్చర్ వేసుకునే ఎయిర్ మెయింటెనెన్స్ టెక్నాలజీ (ఏఎంటీ) టైరు వచ్చేసింది. దీంట్లో భాగంగా టైరు లోపల ఒక ఎలక్ట్రానిక్ పరికరం అమరుస్తారు. పంక్చర్ పడితే ఆటోమేటిగ్గా పంక్చర్ వేసి ఉండాల్సినంతగా గాలి నియంత్రిస్తుంది ఏఎంటీ. కొన్ని కంపెనీలు మేకులు గుచ్చుకున్నా పంక్చరు పడని టెక్నాలజీ తెచ్చాయి.

❖ సోయాబీన్ టైర్లు: సాధారణ టైర్లతో పోలిస్తే పదిశాతం ఎక్కువ మన్నికగా ఉండేలా, తయారీ ఖర్చు సగమే అయ్యేలా సోయాబీన్ టైర్లు రూపొందించింది డన్‌లప్ కంపెనీ. సిలికా, రబ్బరు, సోయాబీన్ ఆయిల్‌తో కలిపి దీన్ని రూపొందించారు.

తయారీ తేదీ ముఖ్యమే



టైర్ల నిర్వహణ సరిగా ఉంటే మొత్తం వాహనం మన్నికే పెరుగుతుంది. టైర్లు బాగుండాలంటే ముందు చక్రాల అమరిక, బ్యాలెన్సింగ్ సరిగా ఉండాలి. తరచూ టైర్ రొటేషన్ చేస్తుండాలి. టైరు మార్చాల్సిన సమయం ఏంటో ట్రెడ్ ఇండికేటర్ చెబుతుంది. గాలి తక్కువ ఉన్నప్పుడు కూడా అలాగే నడిపించడం టైరు ఆయుఃప్రమాణం తగ్గిస్తుంది. దూరప్రయాణాల్లో ఏకధాటిగా వందకిమీలు మించి ప్రయాణం చేయొద్దు. ధర తక్కువనే ఉద్దేశంతో కొందరు నాణ్యతలేని టైర్లు వాడుతుంటారు. ఇవి సురక్షితం కాదు. కొత్త టైర్లు కొనేముందు తయారీ తేదీ తప్పకుండా గమనించాలి.

– గౌతం జైన్, మిచ్లిన్ టైర్ల డీలర్

నైట్రోజన్ గాలి మేలు



కారు, బైక్ టైర్లు సరిగా ఉంటే సగం ప్రమాదాల నుంచి తప్పించుకున్నట్టే. వాటి నిర్వహణలో మొదటిది తరచూ గాలి చెక్ చేసుకోవడం. కొంతమంది చాలారోజులపాటు వాహనాల్ని బయటికి తీయకుండా ఒకేచోట ఉంచుతారు. దీంతో టైర్లు పెళుసుబారి పగిలిపోయే అవకాశం ఉంటుంది. టైర్లు వేడెక్కడం కూడా నాణ్యత తగ్గడానికి, పేలిపోవడానికి ఓ కారణం. నైట్రోజన్ గాలి నింపితే ఆ సమస్య చాలావరకు పరిష్కారం అవుతుంది. ఆ గాలి టైర్లను వేడెక్కకుండా చేస్తుంది. లోపలివైపు ఉన్న మెటల్స్ తుప్పు పట్టకుండా చేస్తుంది.

– కంచర్ల శ్రీధర్‌రెడ్డి, స్నేహ టైర్స్

ప్రత్యేకం

దాహం తీర్చే కార్లు

అచ్చు తప్పేం లేదు.. పొరపాటునేమీ రాయలేదు. మీరు చదివింది నిజమే. కారులో ఓ మీట నొక్కగానే స్వచ్ఛమైన తాగునీరు బయటకొచ్చే రోజులు ముందున్నాయి. ఫోర్డ్ కంపెనీకి చెందిన డగ్ మార్టిన్, రోలింజర్ అనే ఇద్దరు ఆటోమొబైల్ ఇంజినీర్లు ఈ టెక్నాలజీకి జీవం పోశారు.



ఆలోచన: పెరూలోని లిమాలో నాలుగేళ్ల కిందట బిల్‌బోర్డ్ హోర్డింగ్ ద్వారా నీరు తయారు చేసే టెక్నాలజీ కనుగొన్నారు పరిశోధకులు. ఇదెలా పని చేస్తుందంటే భారీ హోర్డింగ్ ఊరవతల ఉండటంతో ధారాళంగా వీస్తున్న గాలి దానిపై పడుతుంది. ఆ గాలిలోని తేమ బిల్‌బోర్డ్‌పై పడి నీటిగా మారి హోర్డింగ్ స్తంభం మధ్యలో ఓ ట్యాంకులో నిల్వ అవుతుంది. అక్కడి నుంచి ట్యాప్ ద్వారా వాడుకోవచ్చు. పత్రికల్లో వచ్చిన ఈ కథనాన్ని చదివి ఇదే సూత్రంతో కారు ఏసీ నుంచి నీరు తయారు చేసే పరిశోధన మొదలుపెట్టారిద్దరూ.

పనితీరు: సాధారణంగా కారులోని ఏసీ పనిచేస్తున్నపుడు అందులోని ఎయిర్ కండెన్సింగ్ కాయిల్స్ నుంచి చిన్నచిన్న నీటి తుంపరలు వెలువడుతుంటాయి. ఆ నీరు స్వచ్ఛమైంది. ఆ తుంపరలన్నీ ఒకచోట పడేలా కారు కిందిభాగంలో ఒక తొట్టెలాంటిది ఏర్పాటు చేశారు. నిల్వ అయిన నీటిని మరింత పరిశుభ్రపరిచే ప్రక్రియను అమర్చారు. కారు లోపల ఉండే కన్సోల్ దగ్గర మన ఇంట్లో వాడే ట్యాప్‌లాంటిది ఏర్పాటు చేసి దానికి ఒక సన్నటి పైపు నీటి తొట్టెకు అమర్చి మీట నొక్కగానే ట్యాప్‌లోకి నీళ్లు వచ్చేలా ఏర్పాటు చేశారు.

గుర్తింపు: ఈ సరికొత్త ఆవిష్కరణకు 'ఫోర్డ్ ఇన్నోవేషన్ కాంటెస్ట్' అవార్డు దక్కింది. ఇంజినీర్లు పేటెంట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఈ టెక్నాలజీ వాడుకోవడానికి అప్పుడే ఐదారు ఆటోమొబైల్ కంపెనీలు మార్టిన్, రోలింజర్‌లతో చర్చలు మొదలెట్టేశాయి.

నో క్లెయిమ్ బోనస్ పొందడమిలా!

వాహన సురక్ష

ఏదైనా ప్రమాదంలో మన వాహనం దెబ్బతింటే పరిహారం పొందాలనే ఉద్దేశంతో బీమా చేయిస్తాం. కానీ నిర్ణీత కాలవ్యవధిలో ప్రమాదాల బారిన పడకుండా.. ఎలాంటి పరిహారం తీసుకోకుండా ఉంటే బీమా కంపెనీ వాహన యజమానికి కొంతమొత్తం రాయితీ ఇస్తుంది. దీన్నే నో క్లెయిమ్ బోనస్ (ఎన్‌సీబీ) అంటారు. కాంప్రహెన్సివ్ లేదా బీ పాలసీ తీసుకున్నవారు దీనికి అర్హులు. ఎన్‌సీబీ గరిష్ఠంగా యాభైశాతం వరకు పొందవచ్చు. ఉదాహరణకు బైక్ లేదా కారు ఓనరు ఏడాదికి పదివేల రూపాయల బీమా ప్రీమియం చెల్లిస్తుంటే ఎన్‌సీబీకి అర్హుడైన తర్వాత ప్రీమియంలో ఐదువేలు మాత్రమే చెల్లించొచ్చు. అదే యజమాని కొత్త వాహనం కొనుక్కుంటే దానికి బదలాయించుకోవచ్చు. అప్పుడు పాత వాహనానికి ఖరీదు కట్టే మొత్తం విలువను బట్టి ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. పాలసీ ఏదైనా మనం తీసుకునే రోజు నుంచి మరుసటి సంవత్సరం అదే రోజుకు ముందురోజు రాత్రి 12 గంటలకు ఒక సెకను ముందు ముగుస్తుంది. కాబట్టి బీమా పాలసీ పునరుద్ధరించాలనుకుంటే కొద్దిరోజులు ముందే



ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయించుకుంటే ఎటువంటి ఆటంకాలు ఉండవు. కొత్త పాలసీ అయినా, కాలపరిమితి ముగిసిన తర్వాత తీసుకున్న పాలసీ అయినా తీసుకున్న సమయం నుంచే అమలులోకి వస్తుంది. అమల్లోకి వచ్చే ముందు జరిగే ఏ నష్టానికీ బీమా కంపెనీ బాధ్యత వహించదు. ముఖ్యంగా బీ పాలసీ ఉన్న వాహన యజమానులు ఏ కారణంతో అయినా రెన్యువల్ ఆలస్యంగా చేస్తే అప్పటివరకు పొందిన ఎన్‌సీబీ సౌకర్యం కోల్పోతారు.

– నరేశ్ భైరపనేని, అడ్వొకేట్

క్లచ్ వదిలితే బండి ఆగుతోంది

మెకానిక్ గురూ

☛ **ఐదు నెలల కిందట బైక్ చైన్ స్ప్రాకెట్లు మార్పించాను. అప్పుడు టైమింగ్ చైన్ స్ప్రాకెట్లు కూడా అరిగిపోయాయి మార్చాలి అని మెకానిక్ చెప్పాడు. డబ్బుల్లేక చేయించలేదు. ఇప్పుడు బండి రన్నింగ్‌లో ఉన్నప్పుడు క్లచ్ వదిలేస్తే బైక్ ఆగిపోతోంది. క్లచ్ వదిలేస్తూ రైజింగ్ చేస్తేగానీ బండి నడవడం లేదు. ఇలా ఎందుకవుతోంది? టైమింగ్ చైన్ వదులై వాల్వులు సరిగా పనిచేయకపోవడం వల్లే ఇలా జరుగుతోందా? - సమ్మిడి దినేశ్, ఈమెయిల్**

మీ బండి సమస్య ఏంటో స్పష్టంగా అర్థం కావడం లేదు. మీరు మూడు రకాల విషయాలు ప్రస్తావించారు. అసలు విషయం ఏంటంటే చైన్ స్ప్రాకెట్లకి, టైమింగ్ చైన్‌కి ఎలాంటి సంబంధం లేదు. పైగా క్లచ్ పట్టుకున్నా, వదిలేసినా అది ఈ రెండింటిపై ఎలాంటి ప్రభావం పడదు.

ఎ) చైన్ స్ప్రాకెట్లు చిరిగిపోయి చైన్ బాగా వదులై పెద్దగా శబ్దం వస్తున్నపుడు చైన్ స్ప్రాకెట్లు మార్చుతారు.

బి) ఇంజిన్‌లో తరచూ మిస్‌ఫైర్ అవుతూ ఇంధనం ఎక్కువ ఖర్చవుతున్నా, టైమింగ్ చైన్ విరిగినా, చిరిగినా దాన్ని మార్చాలి.

సి) క్లచ్ వదిలినపుడు రైజ్ చేయాల్సిన అవసరం వస్తూ, బండి కదలికలో సమస్య వస్తోందంటే క్లచ్‌లోనే ఏదో ఇబ్బంది ఉంటుంది. మెకానిక్‌తో చెక్ చేయించండి.

☛ **నా దగ్గర ప్రీమియర్ పద్మిని 137డి, 1993 మోడల్ డీజిల్ కారు ఉంది. యాభైవేల కిమీలు తిరిగాను. కారు బాగానే ఉన్నా ఆయిల్ సీల్స్ చెడిపోయి కొద్దిరోజుల నుంచి ఇంజిన్ ఆయిల్ కారిపోతోంది. దీనికి పరిష్కారం ఏంటి?**



- కె.సాయిశంకర్‌శ్రీనివాస్, తెనాలి

మీది చాలా పాత మోడల్ కారు. మార్కెట్లో ఈ కారు ఒరిజినల్ విడిభాగాలు దొరకడం కష్టం. ప్రత్యామ్నాయం చూసుకోవాలి. వేరే బ్రాండ్‌వి అయినా సరిపోయే ఆయిల్ సీళ్లు దొరికితే.. గతంలో ప్రీమియర్ మోడల్ కార్లకు పనిచేసిన అనుభవం ఉన్న మెకానిక్ చేత బిగించండి.

- సాయిభరత్ బొప్పరాజు, motofix.in

(ఇలాంటి సమస్యలుంటే రాసి పంపండి. నిపుణులు సలహాలిస్తారు)

ఈశాన్యంపై కమల దళాల దూకుడు!



- స్థానిక పొత్తులతో రంగంలోకి
- అధికార కాంగ్రెస్, సీపీఎంలకు సవాలు విసిరే అవకాశం
- మారనున్న సమీకరణాలు

ఈనాడు: గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో సాధించిన విజయాలతో ఉత్సాహభరితంగా ఉన్న భాజపా ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాలపై దృష్టి పెట్టింది. త్వరలో జరగనున్న త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఊపును కొనసాగించాలని నిర్ణయించింది. ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దదైన అసోంలో సంపూర్ణ ఆధిక్యం సాధించి చరిత్ర సృష్టించిన ఆ పార్టీ.. కాంగ్రెస్, సీపీఎంలకు సవాలు విసిరే స్థాయికి ఎదిగింది. ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకొని రంగంలో దిగనుంది. ఒకప్పుడు ఈశాన్యంలోని ఏడు రాష్ట్రాలను ఏలిన కాంగ్రెస్ ప్రస్తుతం కేవలం మేఘాలయకే పరిమితమయింది. భాజపా దూకుడును ఎదుర్కోవడం కాంగ్రెస్, ఇతర లౌకిక పార్టీల ముందున్న పెద్ద సవాలు.

సకాలంలో ఎన్నికలపై పార్టీల హర్షం

సకాలంలో ఎన్నికల తేదీలు ప్రకటించడాన్ని ఈ మూడు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. ఎన్నికలను వాయిదా వేయించడానికి భాజపా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని సీపీఎం (త్రిపుర) అధికార ప్రతినిధి గౌతం దాస్ వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అందువల్ల త్రిపుర రాష్ట్రపతి పాలన విధించాలని భాజపా నేత మృణాల్ కాంతి దేబ్ డిమాండు చేశారు. ఎన్నికల ముందే నాగా సమస్యకు రాజకీయ పరిష్కారం వెలువడాలని డిమాండ్లు వెల్లువెత్తిన తరుణంలోనే నాగాలాండ్ పోలింగ్ తేదీ వెలువడడం గమనార్హం.

తొలిసారిగా ఎర్ర, కషాయ దళాల ఢీ

త్రిపురలో సీపీఎంగానీ, కాంగ్రెస్‌గానీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. 1993 నుంచి గత 23 ఏళ్లుగా అధికారంలో ఉన్న సీపీఎం తొలిసారిగా ప్రత్యక్ష సవాలును ఎదుర్కోనుంది. కాంగ్రెస్ కన్నా భాజపాయే ప్రధాన ప్రత్యర్థి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'లౌకిక' త్రిపురలో అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న మతశక్తులపై అప్రమత్తంగా ఉండాలని గత కొంతకాలంగా ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ చెబుతుండడమే ఇందుకు ఉదాహరణ. కొంతకాలం వరకు ఇక్కడ భాజపా బలం నామమాత్రమే అయినప్పటికీ స్థానిక ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో పొత్తు పెట్టుకొని బలపడుతోంది. భాజపా విజ్ఞప్తి మేరకు త్రిపురను విభజించాలన్న తమ అసలు నినాదాన్ని ఐపీఎఫ్‌టీ పక్కనపెట్టింది.

త్రిపుర:

బలాబలాలు

మొత్తం సభ్యులు: 60
వామపక్షాలు: 51 (2013 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం 52.5)
భాజపా: 7
కాంగ్రెస్: 2

(గత ఎన్నికల్లో భాజపాకు కేవలం 1.4 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం ఆరుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యేను తన వైపునకు తిప్పుకోవడంతో ప్రస్తుతం ఆ పార్టీలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.)

నాగాలాండ్:

ఫిరాయింపులే ప్రధానం

నాగాలాండ్ రాజకీయాలు ఎప్పుడూ అస్పష్టంగానే ఉంటాయి. ఇక్కడ పార్టీ ఫిరాయింపులే ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం భాజపా మద్దతుతో నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)కు చెందిన టీఆర్ జెలియాంగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. డెమొక్రాటిక్ అలయెన్స్ ఆఫ్ నాగాలాండ్ పేరుతో ఈ కూటమి ఏర్పాటయింది. సీట్ల సర్దుబాటుపై అవగాహన కుదరకపోవడంతో ఈ కూటమి కుప్పకూలే అవకాశం ఉంది. మరోవైపు ఎన్‌పీఎఫ్ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ పెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి నైఫియు రియోతో భాజపా పొత్తుపెట్టుకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

బలాబలాలు

మొత్తం సభ్యులు: 60
ఎన్‌పీఎఫ్: 45
భాజపా: 4
ఎన్‌సీపీ: 1
జేడీయు: 1
స్వతంత్రులు: 8

మేఘాలయ

కాంగ్రెస్‌కు గట్టిపోటీ

కాంగ్రెస్ చేతిలో ఉన్న కొద్దిపాటి రాష్ట్రాల్లో ఒకటైన మేఘాలయలో ఈ సారి ఆ పార్టీ గట్టిపోటీని ఎదుర్కోనుంది. యునైటెడ్ అలయెన్స్ పేరుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా (కాంగ్రెస్) ఇప్పటికే వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఆయనపై ఇచ్చిన ఫిర్యాదులను అధిష్ఠానం పట్టించుకోలేదన్న కోపంతో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు నేషనల్ పీపుల్స్ పార్టీలో చేరారు. మరోవైపు నేషనల్ పీపుల్స్ పార్టీ ఎన్‌డీఏలో భాగస్వామి అయినప్పటికీ, ప్రస్తుతం భాజపాతో పొత్తు పెట్టుకోకూడదని నిర్ణయించింది. పొత్తుపై ఎన్నికల అనంతరం నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పడం విశేషం.

బలాబలాలు:

మొత్తం సభ్యులు:	60
కాంగ్రెస్:	30
మిత్రపక్షం యూడీపీ:	8
భాజపా:	2
ఎన్‌సీపీ:	2
ఇతర చిన్నపార్టీలు:	18

(నేషనల్ పీపుల్స్ పార్టీకి రెండు సీట్లే వచ్చినప్పటికీ, కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రస్తుతం ఆ పార్టీ బలం ఎనిమిదికి పెరిగింది.)



క్రికెట్ బెట్టింగ్‌లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, చరవాణిలను విలేకరులకు చూపుతున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

ఆస్ట్రేలియాలో హిట్టింగ్.. నగరంలో బెట్టింగ్

రూ.44 లక్షల సొత్తు, ఇతర సామగ్రి స్వాధీనం

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆస్ట్రేలియా (సిడ్నీ)లో జరుగుతున్న బిగ్ బాస్ లీగ్-టి20పై పెద్దఎత్తున బెట్టింగ్ కాస్తున్న మూడు ముఠాల స్థావరాలపై హైదరాబాద్ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏకకాలంలో దాడులు చేశారు. పదకొండుమంది క్రికెట్ బుకీలను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి భారీఎత్తున నగదు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సిడ్నీలో జరుగుతున్న బిగ్ బాస్ లీగ్, టీ-20 మ్యాచ్‌కు సంబంధించి హైదరాబాద్ కేంద్రంగా పెద్ద ఎత్తున బెట్టింగ్ జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. ఆబిడ్స్ కింగ్‌కోఠిలోని పరల్ ప్యాలెస్‌లో నిజామాబాద్ జిల్లా గోషాలకు చెందిన బుకీ మనోజ్‌కుమార్ అగర్వాల్, అతని అనుచరులు రాజస్థాన్‌కు చెందిన మహేందర్‌కుమార్ కర్వా, మెహిదీపట్నం దిల్‌షాద్‌నగర్ కాలనీ నివాసి మహ్మద్ రియాజుద్దీన్, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన యెల్లా సురేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 7లోని శర్మ బిల్డింగ్‌లో నిజామాబాద్‌లో చీరల వ్యాపారం చేసే చిన్ని రాజేందర్, నిజామాబాద్‌లోని పోచమ్మగల్లీకి చెందిన కట్ల రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విఠల్‌వాడిలోని మెట్రో టవర్స్ అపార్ట్‌మెంట్‌లో బుకీ ముఖేశ్ కుమార్, అతని సబ్ బుకీలైన ఆటో మొబైల్ వ్యాపారి గురువిందర్‌సింగ్, గౌలిగూడ సిక్‌లేన్‌లోని ఫైనాన్స్ వ్యాపారి భుపేందర్‌సింగ్, సికింద్రాబాద్ కార్ఖానాకు చెందిన ఆనంద్‌కుమార్, మలక్‌పేట దయానంద్‌నగర్‌కు చెందిన దాగా అభిషేక్‌లను అరెస్టు చేశారు. వీరందరికీ రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్న ప్రధాన బుకీ బేగంబజార్‌కు చెందిన విశాల్ లోధియా ప్రస్తుతం పరారీలో ఉన్నాడని వివరించారు. సుమారు రూ.44.30 లక్షల నగదు, ఒకేసారి 36 మంది సబ్ బుకీలతో కార్యాకలాపాలు నిర్వహించడానికి అవసరమైన యంత్రం, మూడు టీవీలు, మూడు సెట్‌టాప్ బాక్స్‌లు, 5 ల్యాప్‌టాప్‌లు, 62 సెల్‌ఫోన్‌లు, నగదు లెక్కించే యంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఏజెంట్ల ద్వారా పంటర్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బును వసూళ్లు చేశారని నగర పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు వెల్లడించారు. వీరికి కొన్ని వెబ్‌సైట్లు సహకరిస్తున్నట్లుగా సమాచారం ఉందని, వారికి నోటీసులు ఇస్తామని చెప్పారు.

అగ్రిగోల్డ్ ఆస్తి అప్పుల మదింపు ప్రక్రియపై హైకోర్టు అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: అగ్రిగోల్డ్ కంపెనీలను స్వాధీనం చేసుకోవడానికి ముందుకు వచ్చిన సుభాష్‌చంద్ర ఫౌండేషన్(ఎస్సెల్-జీ గ్రూపు) ఆస్తి అప్పుల మదింపు ప్రక్రియలో భాగంగా అనుసరిస్తున్న విధానంపై గురువారం ఉమ్మడి హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గత డిసెంబరు 4వ తేదీ నుంచి ఇప్పటివరకు సాధించి పురోగతి ఏమీ లేదని, ఆస్తి అప్పుల మదింపు ప్రక్రియ ఇంకా చీకట్లోనే ఉందని వ్యాఖ్యానించింది. పదే పదే గడువు పొడిగించడం సాధ్యం కాదని ఉద్దేశాన్ని స్పష్టం చేయాలని సూచించింది. ఆస్తి అప్పుల మదింపు ప్రక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్సెల్ గ్రూపును ఆదేశించింది. అదేవిధంగా ఎస్సెల్ గ్రూపు ప్రతినిధులతో ఎన్ని సమావేశాలు నిర్వహించారో వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని ఆదేశించింది. కోట్ల రూపాయల డిపాజిట్‌లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఇప్పటివరకు జరిగిన ప్రక్రియపై అఫిడవిట్‌లు దాఖలు చేయాలని ఎస్సెల్ గ్రూపు, అగ్రిగోల్డ్‌ను ఆదేశిస్తూ విచారణను జనవరి 25వ తేదీకి వాయిదా వేసింది.

పునర్ దర్యాప్తు జరిపి తుది నివేదిక దాఖలు చేయండి

- సాయి ట్రస్టు సభ్యులు రత్నాకర్‌పై కేసు దర్యాప్తు ఏదశలో ఉందో పరిశీలించండి
- ఏపీ సీఐడీని ఆదేశించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి బాబా సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్‌పై సాయి కుటుంబ సభ్యులు గణపతిరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2013 నవంబర్‌లో పుట్టపర్తి పోలీసులు నమోదు చేసిన కేసులో దర్యాప్తు ఏదశలో ఉందో దృష్టిసారించాలని సీబీసీఐడీ అదనపు డీజీని హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తు అపరిష్కృతంగా ఉందా? సంబంధిత కోర్టులో తుది నివేదిక దాఖలు చేశారా? పరిశీలించాలని పేర్కొంది. ఇప్పటికే జరిగిన దర్యాప్తుతోపాటు పునర్ దర్యాప్తు చేసి విచారణ కోర్టులో తుది నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ కేసు వ్యవహారమై విచారణ కోర్టుకు వెళ్లి ఆ కేసు నుంచి మినహాయించాలని కోరుతూ గణపతిరాజు వాదనలు వినిపించుకోవచ్చని స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు రెండు వ్యాజ్యాల్లో ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శ్రీసత్యసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు రత్నాకర్‌పై 2013 నవంబర్ 26న పుట్టపర్తి పట్టణ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారని. . ఆ కేసు దర్యాప్తును సీఐడీ లేదా సీబీఐతో జరిపించాలని కోరుతూ గణపతిరాజు 2014లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. 2013లో తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు అనంతపురం జిల్లా పెనుకొండ మొదటి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఉందని ఆ కేసును రద్దు చేయాలని కోరుతూ గణపతిరాజు 2015లో హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలు చేశారు. రత్నాకర్ అక్రమాలను బయటపెట్టడంతో తనపై కక్షగట్టారన్నారు. అప్పటి డీఎస్పీ, సీఐలు రత్నాకర్‌కు అనుకూలంగా వ్యవహరించి తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారన్నారు. తనపేరున తప్పుడు ఈమెయిల్ సృష్టించిన రత్నాకర్.. ట్రస్టీ సభ్యులకు మెయిల్ చేసి రూ.25 లక్షలు డిమాండ్ చేశానని నింద మోపారన్నారు. సత్యసాయి విమానాశ్రయాన్ని ఓ ప్రైవేటు కంపెనీకి రత్నాకర్ అప్పగించే యత్నాన్ని ఇతర సభ్యులకు తెలపడంతో ప్రతీకారానికి పూనుకున్నారన్నారు. ఈ రెండు వ్యాజ్యాలపై సంయుక్త విచారణ జరిపిన న్యాయమూర్తి.. కేసు దర్యాప్తు అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో మాత్రమే మెజిస్ట్రేట్ కోర్టు లేదా ఆ కోర్టుకు చెందిన ప్రత్యేక న్యాయాధికారి 'మరింత దర్యాప్తు' చేయమని కోరగలరు. పునర్ దర్యాప్తునకు ఆదేశించే అధికారం లేదన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 482 లేదా రాజ్యాంగ అధికరణ 226 ద్వారా రాజ్యాంగబద్ధ కోర్టులు మాత్రమే పునర్ దర్యాప్తునకు ఆదేశించగలవన్నారు.

సినిమాలతో కాకతీయుల వారసత్వాన్ని ముడిపెట్టొద్దు

కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు పాపారావు

ఈనాడు, వరంగల్: కాకతీయుల చరిత్రను సినిమా సంస్కృతికి ముడిపెట్టడం సమంజసం కాదని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు బి.వి. పాపారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'కాకతీయ కళావైభవ మహోత్సవం' కార్యక్రమం వేదికగా టి.సుబ్బిరామిరెడ్డి.. నటుడు మోహన్‌బాబును సత్కరించడం అప్రస్తుతమన్నారు. జనవరి 17న హైదరాబాద్‌లో మోహన్‌బాబును 'విశ్వనట సార్వభౌమ' బిరుదుతో టి.సుబ్బిరామిరెడ్డి సత్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు పాపారావు, ప్రొఫెసర్ పాండురంగారావు దీన్ని ఖండిస్తూ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాకతీయుల వారసత్వాన్ని పరిరక్షించేందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టుతోపాటు మరికొన్ని సంస్థలు కొన్నేళ్లుగా కృషిచేస్తున్నాయని, కానీ కొందరు సినిమాలతో చరిత్రకు ముడిపెడుతుండడం వల్ల అసలు చరిత్ర మరుగున పడే ప్రమాదముందని వారు పేర్కొన్నారు.

బైరెడ్‌లో గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: గ్రామీణ మహిళలకు ఫిబ్రవరి 12 నుంచి మార్చి 30 వరకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బైరెడ్) డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని క్యాంప్‌లో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 19 నుంచి 35 ఏళ్ల వయసున్న మహిళలకు అడ్వాన్స్‌డ్ టైలరింగ్ - ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోసీ - మగ్గంవర్క్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంఎస్‌ఆఫీస్ కోర్సులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.bired.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040-29709295, 29709296, 600263501 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి హర్షవర్ధన్

శాస్త్రపరంగా దేశం అభివృద్ధి చెందాలి

కేంద్ర మంత్రి డా.హర్షవర్ధన్

హబ్సిగూడ, న్యూస్‌టుడే: శాస్త్రపరంగా దేశం అభివృద్ధి చెందాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి డా.హర్షవర్ధన్ పేర్కొన్నారు. హబ్సిగూడలోని సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐకి గురువారం విచ్చేసిన ఆయన ఎక్స్ఆర్‌డీ (ఎక్స్ రే డయాఫ్రాక్షన్) ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో మాట్లాడారు. ఆయన ప్రత్యేకంగా రూపొందించిన 'డా.హర్షవర్ధన్ యాప్' గురించి తెలియజేస్తూ పర్యావరణం, శాస్త్రీయతల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందిచాలన్నారు. ఈ యాప్ ద్వారా సమస్యలను, నూతన ఆవిష్కరణల గురించి నేరుగా తనకు తెలియజేయవచ్చని సూచించారు. నూతన ఆవిష్కరణలపై సీనియర్ శాస్త్రవేత్తలను సంప్రదించి వాటిని ఎలా వినియోగించాలనే వాటిపై పరిశోధన చేస్తున్నామన్నారు. ప్రధాని మోదీ సూచించిన నీతి ఆయోగ్ ద్వారా 100 జిల్లాలను గుర్తించి అక్కడి ప్రజలకు సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా ఎలా సహాయపడగలమో అన్వేషిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఎన్‌జీఆర్ఐ ద్వారా 2030 లోపు నీటి ఎద్దడి నివారణ, నీటి నిల్వలపై ప్రత్యేక పరిశోధనలు చేసి నీటిఎద్దడి సమస్య లేకుండా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతకుముందు పరిశోధన ప్రయోగశాలను కేంద్రమంత్రి ప్రారంభించారు. భూకంప వేదశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.వీఎమ్ తీవారి, భూకంపాల పరిశోధనాధికారి డా.శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

కలగానే జాతీయ పండగ హోదా

- మేడారం జాతరకు ఈసారైనా గుర్తింపు వచ్చేనా?
- ముమ్మరంగా రాష్ట్ర ప్రభుత్వం యత్నాలు
- గుర్తింపు దక్కితే మరిన్ని ప్రయోజనాలు



మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: ఆసియాలోని అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ పండగ హోదా కలగానే మారింది. ఆదివాసీలు రెండేళ్లకోసారి నిర్వహించే ఈ మహా జాతరకు సుమారు కోటి మందికిపైగా హాజరవుతారు. దీనికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమ్‌బంగ తదితర రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఇంతటి విశిష్టత కలిగిన జాతరను జాతీయ పండగగా ప్రకటించాలనే డిమాండ్ పదేళ్లుగా ఉన్నా గుర్తింపునకు నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి జాతర సమయంలో ప్రతిపాదనలు పంపిస్తున్నా కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఈసారైనా జాతీయ పండగ గుర్తింపు దక్కుతుందేమోనని గిరిజనులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

22 ఏళ్ల క్రితమే రాష్ట్ర పండగగా గుర్తింపు

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు పెరుగుతున్న ఆదరణ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1996 ఫిబ్రవరి 1న రాష్ట్ర పండగగా గుర్తించింది. ఏటా నిధులు విడుదల చేస్తూ జాతరను ఘనంగా నిర్వహిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నిర్వహించే రెండో జాతర ఇది. 2016లో తొలి జాతరకు ప్రభుత్వం రూ.160 కోట్ల నిధులను విడుదల చేయగా ఈ సారి రూ.80.55 కోట్లు విడుదల చేసి జాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనులు చేపడుతోంది.

జాతరకు ఈ ఏడాది జాతీయ పండగ హోదా లభించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రెండు నెలల క్రితం ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో జరిగిన సమీక్ష సమావేశంలో జాతీయపండుగగా గుర్తించాలని తీర్మానం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కాకు విన్నవించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చకు వచ్చింది. మూడు నెలల క్రితం రాష్ట్ర సచివాలయం నుంచి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయగా స్పందించి సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు అందజేయాలని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖకు విన్నవించుకుంది. ఇటీవల రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అధికారులు దిల్లీకి వెళ్లి ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి ఓరం, ఇతర మంత్రులను కలిసి జాతరకు రావాలని ఆహ్వానించడంతోపాటు జాతరను జాతీయ పండగగా గుర్తించాలని కోరారు. జాతీయ పండుగ కోసం రాష్ట్ర, జిల్లా భాజపా నేతలు కూడా ప్రయత్నిస్తున్నారు.

జాతీయ పండగగా గుర్తిస్తే మరింత ఆదరణ

మేడారం మహాజాతరకు జాతీయ పండగ హోదా లభిస్తే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు వస్తుంది. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయబద్ధంగా జరిగే వేడుకకు ప్రత్యేకత లభిస్తుంది. జాతర ఏర్పాట్లు, అభివృద్ధి కార్యక్రమలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి ప్రత్యేక నిధులను విడుదల చేస్తుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులతో జాతరకు వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చు. ప్రస్తుతం ఇరుగు, పొరుగు రాష్ట్రాల నుంచి గిరిజనులు వస్తుంటారు. జాతీయ గుర్తింపు లభిస్తే ఇతర రాష్ట్రాల గిరిజనులకు కూడా జాతర విశిష్టత తెలుస్తుంది.

భారతీయ వైద్యుడికి లండన్‌లో 12 ఏళ్ల జైలు

మహిళలపై లైంగిక వేధింపులే కారణం



జశ్వంత్ రాథోడ్

లండన్: రోగులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపణలు రుజువు కావడంతో మనదేశానికి చెందిన వైద్యుడికి లండన్‌లోని వోల్వర్‌హాంప్టన్ క్రౌన్ న్యాయస్థానం 12 ఏళ్ల కారాగారవాసం శిక్షగా విధించింది. 2008 నుంచి 2015 మధ్య నలుగురు మహిళలపై సదరు వైద్యుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని జశ్వంత్ రాథోడ్(60)పై కేసు నమోదైంది. వైద్యుడిపై రోగులకు ఉండే విశ్వాసాన్ని జశ్వంత్ దెబ్బ తీశారని న్యాయమూర్తి మైకేల్ చాల్లినర్ పేర్కొన్నారు. శస్త్రచికిత్సల సందర్భంగా 20 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలను మసాజ్ పేరిట అసహజరీతిలో తాకారని రాథోడ్‌పై ఆరోపణలు వచ్చాయి. మరో నలుగురు మహిళలు చేసిన ఆరోపణలు రుజువు కాలేదు. మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడు రాథోడ్ కుటుంబం లండన్‌కు వలస వెళ్లింది.

డోక్లామ్‌లో యథాతథ స్థితి

దిల్లీ: భారత్, చైనాల నడుమ గత ఏడాది 73 రోజుల పాటు సైనిక ప్రతిష్టంభనకు కేంద్రబిందువుగా నిలిచిన డోక్లామ్ వద్ద యథాతథ స్థితి నెలకొందని భారత్ గురువారం తెలిపింది. వివాదం పరిష్కారమయ్యాక క్షేత్రస్థాయిలో కొత్తగా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు. అక్కడ మార్పులు జరిగాయంటూ వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. వివాదాస్పద ప్రాంతంలో చైనా కొన్ని మౌలికవసతులను ఏర్పాటుచేసుకుందంటూ మీడియాలో వచ్చిన కథనాలపై ఆయన ఈ మేరకు స్పందించారు.

మోదీ నిద్రపోతున్నారు: కాంగ్రెస్

దేశ భద్రత విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజీపడుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. డోక్లామ్ వద్ద చైనా తాజాగా సైనిక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చెబుతుంటే.. ఆయన నిద్రపోతున్నారని విమర్శించింది. మరోసారి ప్రతిష్టంభనకు చైనా సిద్ధపడుతోందని పేర్కొంది. కాంగ్రెస్ విమర్శలపై భాజపా మండిపడింది. స్వప్రయోజనాల కోసం జాతీయ ప్రయోజనాలను కాంగ్రెస్ పణంగా పెడుతోందని విమర్శించింది. ఆ పార్టీ నేతలకు చైనాపై ప్రేమ ఉందని దుయ్యబట్టింది. డోక్లామ్‌లో చైనా సైన్యంతో భారత సైన్యం తలపడుతున్నప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. చైనా దౌత్యవేత్తలతో రహస్యంగా సమావేశమయ్యారని మండిపడింది.



మోటారుపైనే ప్రాణాలొదిలిన అన్నదాత

విద్యుదాఘాతంతో వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో ఓ అన్నదాత ప్రాణాలు కోల్పోయాడు. పేర్కంపల్లికి చెందిన కుర్వ మల్లప్ప(60)గురువారం బోరు మోటారుఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మంత్రి మహేందర్ రెడ్డి పరామర్శించారు. -న్యూస్‌టుడే, తాండూరు

తెలుగు తప్పనిసరి.. ఉత్తర్వులేవీ మరి?

- పుస్తక ముద్రణ, ఉపాధ్యాయ నియామకాలపై సందిగ్ధం
- ఉన్న సమయం ఇంకా 4 నెలలే..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 12వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరిగా చదువుకోవాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటివరకు దానిపై ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో అయోమయం నెలకొంది. పాఠ్య పుస్తకాలను ముద్రించాలన్నా. . ప్రైవేటు విద్యాసంస్థలు తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలన్నా ప్రభుత్వ ఆదేశాలు జారీ కావాలని, భవిష్యత్తు కార్యక్రమాలు చేపట్టేందుకూ స్పష్టత అవసరమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మార్కుల మోజులో విద్యార్థులు ముఖ్యంగా ఇంటర్మీడియట్లో సంస్కృతం సబ్జెక్టును తీసుకుంటున్నారని, దీంతో సంస్కృతానికీ, తెలుగుకూ కూడా దూరమవుతున్నారని ప్రభుత్వం భావించింది. అందుకే రాష్ట్రంలో ఏ బోర్డు పాఠ్య ప్రణాళిక అయినా...ఏ రాష్ట్రం వారైనా తెలుగును తప్పనిసరిగా చదవాల్సిందేనని తేల్చిచెప్పింది. తెలుగు తప్పనిసరి అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో, డిసెంబరు 19న ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు సమావేశంలో రెండుసార్లు ప్రకటన చేశారు. తెలుగు మహాసభలు ముగిసి నెల గడిచినా అడుగు ముందుకు పడలేదు. పాఠ్యపుస్తకాల ముద్రణకు పాఠశాల విద్యాశాఖ పరిధిలోని రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ), ఇంటర్‌బోర్డు పాఠ్య ప్రణాళిక రూపొందించాలి. మొదట తెలుగు మాతృభాష కాని వారికి ముద్రించే పుస్తకాల్లో ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలో ఒక నిర్ణయానికి రావాలి. రచయితలు, నిపుణులను ఎంపిక చేయాలి. ఆ తర్వాత పాఠ్యపుస్తక ముద్రణ విభాగం, తెలుగు అకాడమీ పాఠ్య పుస్తకాలను ముద్రించాలి. దానికి చాలా సమయం పడుతుంది. కానీ, విద్యాసంవత్సరం ప్రారంభం కావడానికి నాలుగు నెలల సమయం మాత్రమే ఉంది. తెలుగు ఉపాధ్యాయులను నియమించుకునే ప్రక్రియ చేపట్టాల్సి ఉండటంతో ప్రైవేటు పాఠశాలలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

సెన్సెక్స్ ▲178 **35260** | **నిఫ్టీ** ▲28 **10817**

రూపాయి 63.86 ▲ (ఒక అమెరికా డాలరుకు) 02 పైసలు

బంగారం 30,055 ▼ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 170

వెండి 38,890 ▼ (ముంబయిలో కిలో) రూ.లలో 330

ముడి చమురు 69.34 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,022	−92
నాస్‌డాక్	7,303	+05
నిక్కీ 225 (జపాన్)	23,763	−105
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	31,122	+139
షాంఘై(చైనా)	3,476	+31
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,701	−24
డాక్స్ (జర్మనీ)	13,281	+97


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.14	67.41
పౌండ్ స్టెర్లింగ్	80.32	93.14
యూరో	70.85	82.18
జపనీస్ యెన్/100	52.22	60.56
ఆస్ట్రేలియా డాలరు	46.28	53.55
సింగపూర్ డాలరు	43.88	51.98
థాయ్ బాత్/100	181.81	217.45
బహ్రెయిన్ దీనార్	157.44	180.43
కువైట్ దీనార్	175.75	218.93
ఒమన్ రియాల్	154.18	176.40
సౌదీ రియాల్	15.45	18.32
యూఏఈ దిర్హమ్	15.82	18.50
మలేషియా రింగిట్	14.38	17.68





గురువారం నిఫ్టీ కదలికలు

నేటి మార్కెట్

నేడూ సూచీల లాభాలు కొనసాగే అవకాశం ఉంది. డిసెంబరు త్రైమాసికానికి నిఫ్టీ 50 కంపెనీలు అంచనాలకు మించి ఫలితాలు నమోదు చేయొచ్చన్న భావనలు ఇందుకు దోహదపడొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు సైతం దిశానిర్దేశం చేయొచ్చని అంటున్నారు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేడు నిఫ్టీ 10765- 10850 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం చివరి గంటన్నర ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో.. సూచీ మళ్లీ పుంజుకోవచ్చని బ్రోకరేజీ సంస్థలు చెబుతున్నాయి. నేడు ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు రాణించొచ్చని నిపుణులు అంటున్నారు. ఇక ఎఫ్‌డీఐ పరిమితిని పెంచొచ్చన్న అంచనాలతో బ్యాంకింగ్ షేర్ల జోరు కొనసాగే అవకాశం ఉంది. అంతర్జాతీయ బలహీనతలతో లోహ కంపెనీలు డీలాపడొచ్చు.

సైయెంట్ మధ్యంతర డివిడెండు 80%

- 2017-18లో రెండో సారి
- త్రైమాసిక నికర లాభం రూ.88 కోట్లు
- ఆదాయం రూ.983 కోట్లు

ఈనాడు – హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సైయెంట్ రెండో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.4 (80 శాతం) మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి సైయెంట్ రూ.87.8 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాల నికర లాభం రూ.94.2 కోట్లతో పోలిస్తే ఈసారి 6.8 శాతం తగ్గింది. అయితే.. సవరించిన నికర లాభం రూ.108.8 కోట్లు అని కంపెనీ వెల్లడించింది. ఇదే సమయంలో ఆదాయం 7.2 శాతం వృద్ధితో రూ.917.1 కోట్ల నుంచి రూ.983.4 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ఆపరేటింగ్ మార్జిన్ 13.4 శాతం ఉండగా.. ఈ ఏడాది ఇదే కాలానికి 14.6 శాతానికి చేరింది. తక్కువ పని దినాల కారణంగా ఐటీ కంపెనీలకు రెండు, మూడు త్రైమాసికాల ఫలితాలు బలహీనంగా ఉంటాయని, తమ సంస్థ అంచనాలకు అనుగుణంగానే ఆదాయం, నికర లాభాన్ని ఆర్జించిందని సైయెంట్ ఎండీ, సీఈఓ బొడనపు కృష్ణ తెలిపారు.



రెండంకెల వృద్ధిరేటు..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి సేవల వ్యాపారంలో రెండంకెల వృద్ధిరేటును కంపెనీ అంచనా వేస్తోంది. చేతిలో ఉన్న పనుల (ఆర్డర్లు)తో పాటు మరిన్ని ఆర్డర్లు లభించగలవని, మొత్తం ఏడాదికి ఫలితాలు ఆశావహంగా ఉండగలవని కృష్ణ వివరించారు. వ్యూహాత్మక పెట్టుబడులు కొనసాగుతాయని, కంపెనీ పురోభివృద్ధికి దోహదం చేసే కంపెనీలు కొనుగోలు చేయడం కొనసాగుతుందని సైయెంట్ సీఈఓ, ప్రెసిడెంట్ అజయ్ అగర్వాల్ తెలిపారు. ఏరోస్పేస్, రక్షణ వ్యాపారంలో 12.7 శాతం, కమ్యూనికేషన్స్ విభాగంలో 15.6 శాతం, యుటిలిటీస్, జియోస్పేషియల్ వ్యాపారంలో 11.5 శాతం, రవాణా వ్యాపార విభాగంలో 43.6 శాతం వృద్ధిరేటు నమోదైనట్లు వివరించారు.

తగ్గిన అమెరికా వాటా..

అమెరికా నుంచి లభించిన ఆదాయం 58 శాతం నుంచి 55.1 శాతానికి తగ్గింది. మొత్తం ఆదాయంలో ఏరోస్పేస్, రక్షణ వ్యాపారం వాటా 35.6 శాతం నుంచి 34.7 శాతానికి తగ్గింది. 2016, డిసెంబరు నాటికి స్వచ్ఛందంగా వలస వెళ్లిన సిబ్బంది 22.6 శాతం కాగా, 2017, డిసెంబరుకు 16.8 శాతానికి పరిమితమైంది.

జియోపై మరో లక్షన్నర కోట్లు!

- రిలయన్స్ పెట్టుబడులపై మూడీస్ అంచనా
- నేడు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫలితాలు



దిల్లీ: మొబైల్ సేవల నుంచి మరిన్ని సేవలకు విస్తరిస్తున్నందున, రిలయన్స్ జియోపై రాబోయే 3-4 ఏళ్లలో మరో 23 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్షన్నర కోట్ల)ను రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పెట్టుబడి పెడుతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ అంచనా వేస్తోంది. అత్యధిక వేగం డేటా (4జీ)తో మొబైల్ సేవలు ప్రారంభించేందుకు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై ఇప్పటికే ఆర్ఐఎల్ 31 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2 లక్షల కోట్ల) పెట్టుబడి పెట్టిన సంగతి విదితమే. తొలుత ఉచిత సేవలతో ఆరంభించి, ఉచిత కాల్స్- తక్కువ డేటా ఛార్జీలను కొనసాగిస్తున్న జియో, ప్రతినెలా భారీఎత్తున కొత్త చందాదార్లను ఆకర్షిస్తోంది. చందాదార్ల సంఖ్యాపరంగా 4వ స్థానంలోకి చేరింది. జియో గణాంకాలతో సహా, డిసెంబరు త్రైమాసిక ఫలితాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ నేడు వెల్లడించనుంది.

కొత్త సేవల కోసమే: మొబైల్ సేవల విస్తరణతో పాటు ఇళ్లకు ఫైబర్ కేబుల్ వేసేందుకు, డిజిటల్ టీవీ, వాణిజ్య సంస్థలకు ప్రత్యేక సేవలు అందించాలన్నది జియో ప్రణాళిక. 4జీ ఫీచర్ ఫోన్ల కోసం కూడా జియోకు పెట్టుబడులు అవసరమన్నది అంచనా.

బ్యాంకింగ్ షేర్ల విజృంభణ

- ప్రైవేటులో 100% ఎఫ్‌డీఐ అనుమతిస్తారన్న వార్తలు
- కొత్త గరిష్ఠాలకు సూచీలు
- చివర్లో లాభాల స్వీకరణ

బ్యాంకింగ్ షేర్లు విజృంభించడంతో సూచీల్లో లాభాల ర్యాలీ కొనసాగింది. వరుసగా రెండో రోజూ జీవన కాల గరిష్ఠాలను తాకాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పరిమితిని 100 శాతానికి, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 49 శాతానికి పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వార్తలు వెలువడటమే ఇందుకు నేపథ్యం. విదేశీ మదుపర్ల స్థిరమైన కొనుగోళ్లు సైతం ఇందుకు కలిసొచ్చాయి. కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాల మెరుగ్గా ఉండొచ్చన్న అంచనాలు కూడా సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. చివర్లో మదుపర్లు లాభాలు స్వీకరించడంతో సూచీలు కొద్దిపాటి లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,366.45 పాయింట్ల వద్ద దూకుడుగానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ 35,507.36 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణ ఎదుర్కొన్న సూచీ.. 35,166.44 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 178.47 పాయింట్ల లాభంతో 35,260.29 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 35,081.82 పాయింట్లను అధిగమించింది. నిఫ్టీ సైతం 10,887.50 దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 28.50 పాయింట్ల లాభంతో 10,817 దగ్గర స్థిరపడింది. నిఫ్టీకి సైతం ఇది రికార్డు ముగింపు కావడం విశేషం. గత అత్యధిక ముగింపు 10,788.55 పాయింట్లను నిఫ్టీ అధిగమించింది.

సమీక్ష

డోజోన్స్ @ 26,000

అమెరికా ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీ డోజోన్స్ చరిత్రలో తొలిసారిగా 26,000 పాయింట్ల పైకి చేరింది. కేవలం 8 ట్రేడింగ్ సెషన్లలోనే సూచీ 25,000 పాయింట్ల నుంచి 26,000కు చేరడం గమనార్హం. బోయింగ్, ఐబీఎం, ఇంటెల్ వంటి దిగ్గజ షేర్ల లాభాలు ఇందుకు దన్నుగా నిలిచాయి. గత 11 ట్రేడింగ్ సెషన్లలో డోజోన్స్, నాస్‌డాక్‌లు జీవనకాల గరిష్ఠాలకు చేరడం ఇది ఏడోసారి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ రూ.5 లక్షల కోట్లు

ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరో ఘనత సాధించింది. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి బ్యాంక్ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ల తరవాత, రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ సాధించిన మూడో దేశీయ సంస్థ ఇదే కావడం విశేషం. రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ అధిగమించిన తొలి బ్యాంక్ కూడా ఇదే.

సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభాలతో ముగిశాయి. ఐటీసీ 2.61%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.15%, హెచ్‌డీఎఫ్‌సీ 1.99%, ఎం అండ్ ఎం 1.83%లు రాణించిన వాటిలో ఉన్నాయి. అదానీ పోర్ట్స్ (4.32%), టాటా స్టీల్ (2.89%), కోల్ ఇండియా (2.81%), సన్‌ఫార్మా (1.22%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల్లో బ్యాంకింగ్ 0.69%, ఐటీ 0.13% చొప్పున రాణించాయి. స్థిరాస్తి, లోహ, మౌలిక, విద్యుత్, పీఎస్‌యూ, చమురు- గ్యాస్ షేర్లు 4.07 శాతం వరకు డీలాపడ్డాయి.

నేటి బోర్డు సమావేశాలు: ★ రిలయన్స్ ఇండస్ట్రీస్ ★ ఐటీసీ ★ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ★ విప్రో ★ కోటక్ మహీంద్రా బ్యాంక్ ★ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ★ హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ ★ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ★ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ★ జుబిలెంట్ ఫుడ్ వర్క్స్ ★ అతుల్ ★ కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ ★ ఎన్ఐఐటీ టెక్నాలజీస్ ★ పీసీ జువెలర్ ★ టాటా ఎలెక్సీ ★ వీఎస్‌టీ ★ జేపీ అసోసియేట్స్ ★ చెన్నై పెట్రోలియం ★ ద్వారికేశ్ షుగర్



ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో గంట మోగిస్తున్న సిల్లీమాంక్స్ ఎండీ సంజయ్ రెడ్డి. పక్కన ఎన్ఎస్ఈ దక్షిణ ప్రాంత అధిపతి అచల్ తదితరులు

డిజిటల్ ప్రకటనలకు ఆదరణ

- 2020 నాటికి రూ.18,000 కోట్ల మార్కెట్
- ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో సిల్లీ మాంక్స్ నమోదు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం డిజిటల్ ప్రకటనలపై దాదాపు రూ.13,000 కోట్లు వ్యయం చేస్తుండగా, 2020 నాటికి ఇది రూ.18,000 కోట్ల చేరగలదని హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీ సిల్లీ మాంక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ సంజయ్ రెడ్డి తెలిపారు. ఇందులో 60 శాతం మొబైల్ కంటెంటే ఉంటుందన్నారు. చిన్న సంస్థల కోసం ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో సిల్లీ మాంక్స్ గురువారం నమోదైన సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.120 ధరతో కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఇష్యూకు 17.23 రెట్ల స్పందన లభించిందని.. రూ.120 ధరకు రూ.12.6 లక్షల షేర్ల జారీ ద్వారా కంపెనీకి రూ.15.12 కోట్లు లభించాయి. సమీకరించిన నిధుల ద్వారా డిజిటల్ కంటెంట్ అభివృద్ధిపై కంపెనీ దృష్టి పెట్టనుంది. భవిష్యత్తులో బంగ్లా, మరాఠీ, హిందీ సహా దేశీయ భాషల్లో కంటెంట్, చైనా, ఆగ్నేయ ఆసియా మార్కెట్ల కోసం కూడా డిజిటల్ కంటెంట్‌ను అభివృద్ధి చేయనున్నామని సంజయ్ రెడ్డి తెలిపారు.

మార్కెట్ కబుర్లు


- ■ నాడీ సంబంధమైన రుగ్మతల చికిత్స కోసం అభివృద్ధి చేస్తున్న కొత్త రసాయన సమ్మేళనాలకు చైనా, శ్రీలంకల నుంచి ఒక్కొక్కటి చొప్పున పేటెంట్లు లభించినట్లు **సువెన్ లైఫ్ సైన్సెస్** తెలిపింది.
- ■ మధ్యప్రదేశ్‌లో రూ.730 కోట్ల విలువైన రహదారి ప్రాజెక్ట్ ఆర్డరును ఎన్‌హెచ్ఏఐ నుంచి దక్కించుకున్నట్లు **దిలీప్ బిల్డ్‌కాన్** ప్రకటించింది.
- ■ అంతర్జాతీయ ఏరోస్పేస్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ తయారీ సంస్థ నుంచి 50 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.319 కోట్లు) ప్రాజెక్ట్ పొందినట్లు **ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్** తెలిపింది.
- ■ సౌరశక్తి ప్రాజెక్టులకు రుణాలు అందించేందుకు **యెస్ బ్యాంక్‌**తో ఆమ్‌ప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది.
- ■ ఇమ్యూనాలజీ, ఆంకాలజీలలో బయోసిమిలర్ల అభివృద్ధి, తయారీ, విక్రయాల కోసం నొవార్టిస్‌కు చెందిన సాండోజ్‌తో అంతర్జాతీయ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు **బయోకాన్** వెల్లడించింది.
- ■ కమొడిటీ ఎక్స్ఛేంజీ **ఎన్‌సీడీఈఎక్స్** కొత్త మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా విజయ్ కుమార్ వెంకటరామన్ నియమితులయ్యారు.
- ■ సెబీ విధించిన రెండేళ్ల నిషేధంపై ప్రైస్ వాటర్‌హౌస్ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) నేడు విచారించనుంది.
- ■ ఒక రకం హెక్సావాలెంట్ వ్యాక్సిన్ తయారీ, విక్రయానికి సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో **పాన్‌ఏషియా బయోటెక్** ఒప్పందం కుదుర్చుకుంది.
- ■ మసాలా బాండ్ల ద్వారా రూ.2000 కోట్లు సమీకరించేందుకు **ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్** బోర్డు ఆమోదం తెలిపింది.
- ■ **న్యూజెన్ సాఫ్ట్‌వేర్** ఐపీఓకు మొత్తంగా 8.22 రెట్ల స్పందన లభించింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)


కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017−18	2016−17	2017−18	2016−17
అదానీ పోర్ట్స్(కన్సా)	1,001	837.58	2,689	2,209
అదానీ ఎంటర్‌ప్రైజెస్(కన్సా)	350.55	339.95	9,938	8,606
డీబీ కార్ప్ (కన్సా)	78.10	118.10	602.46	483.37
జెన్సార్ టెక్నాలజీస్(కన్సా)	59.1	80	793.7	786.5

ఇండియాబుల్స్ హౌసింగ్



రూ.1222 వద్ద ప్రారంభమై రూ.1212.10–1264.50 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.1209.35తో పోలిస్తే రూ.34.35 (2.84%) లాభంతో రూ.1243.70 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 46,38,248.

భారతీ ఇన్‌ఫ్రాటెల్



రూ.365 వద్ద మొదలై రూ.342.25– 365.05 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.366.10తో పోలిస్తే రూ.22.30 (6.09%) నష్టంతో రూ.343.80 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 42,56,014 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1954.00
హిందుస్థాన్ యునిలీవర్	1406.90
ఇన్ఫోసిస్	1164.90
మైండ్‌ట్రీ	693.60
యాక్సిస్ బ్యాంక్	597.15
స్టెరిలైట్ టెక్నాలజీస్	405.00
డాబర్ ఇండియా	368.60
ఐసీఐసీఐ బ్యాంక్	353.20
ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్	303.00

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

ఎంసీఎక్స్	830.20
సీఎల్ ఎడ్యుకేట్	278.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
18/01	9,015	7,120	1,895	4,396	5,053	−657
17/01	7,883	7,258	625	4,688	4,520	169
16/01	8,203	7,510	693	4,003	4,249	−246
12/01	5,857	6,015	−158	3,264	2,568	696
11/01	4,978	5,601	−624	3,636	2,866	770

18వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	412
బెంగళూరు	405	చెన్నై	410
19న		చిత్తూరు	403
విజయవాడ/గోదావరి	412	నమక్కల్	395

ఎన్ఎస్ఈ



గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 416.25 (433.40) 8794103
AMBUJA CEMEN 275.65 (277.15) 1271915
ASIAN PAINTS 1188.25 (1193.75) 500762
AUROBIND PHA 645.85 (657.25) 2636988
AXIS BANK LT 584.80 (585.20) 9466991
BAJAJ AUTO L 3201.20 (3194.15) 282478
BAJAJ FINANC 1660.70 (1701.20) 961692
BHARTI AIRTE 495.00 (499.90) 7131552
BHARTI INFRA 343.80 (366.10) 4256014
BOSCH LTD 19903.70 (19954.25) 9788
BPCL 470.25 (479.85) 3671246
CIPLA 603.65 (607.15) 1028921
COAL INDIA L 283.05 (290.95) 3784420
DR. REDDYS 2461.50 (2491.85) 584198
EICHER MOTOR 27954.40 (28222.85) 49399
GAIL 468.50 (480.55) 3484599
HCL TECH 954.25 (952.85) 934750
HDFC 1896.80 (1858.35) 6605642
HDFC BANK 1934.30 (1890.50) 4162385
HERO MOTOCOR 3593.35 (3566.85) 345926
HINDALCO IND 253.90 (262.75) 11341249
HINDUSTAN UN 1356.95 (1371.20) 2465412
HPCL 411.75 (420.30) 2914389
ICICI BANK 346.15 (343.25) 31504669
INDIABULLS H 1243.70 (1209.35) 4638248
INDIAN OIL 378.05 (384.05) 5348803
INDUSINDBANK 1680.10 (1657.45) 2327815
INFOSYS LTD 1152.70 (1152.10) 6602485
ITC 273.40 (266.05) 26442702
KOTAK MAHIND 1046.50 (1027.10) 3648214
LARSEN & TOU 1360.80 (1353.35) 4966982
LUPIN 921.05 (919.35) 2318124
M&M 759.25 (745.35) 2810014
MARUTI SUZIK 9368.70 (9313.90) 686971
NTPC LTD 172.15 (174.25) 6900318
ONGC 194.10 (195.70) 6247782
POWER GRID C 197.00 (197.40) 13839476
RELIANCE IND 919.70 (924.50) 4289053
SBI 303.25 (307.10) 40000111
SUN PHARMA 576.70 (583.75) 3679687
TATA CONSULT 2918.20 (2888.95) 1104739
TATA MOTORS 418.95 (422.95) 9579830
TATA STEEL L 751.75 (774.00) 4616814
TECH MAHINDR 552.65 (554.90) 2158972
ULTRATECH 4408.65 (4544.25) 626579
UPL LIMITED 800.50 (780.75) 5203775
VEDANTA LIMI 326.70 (334.90) 13916937
WIPRO 325.35 (325.70) 1770781
YES BANK LTD 341.20 (342.40) 35465087
ZEE ENTERTAI 595.85 (593.10) 4229588

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1541.90 (1548.50) 100083
ACC 1839.00 (1840.50) 733461
ASHOK LEYLAN 120.90 (124.45) 10351616
AVENUE SUPER 1135.45 (1167.35) 471953
BAJAJ FINSER 4922.60 (4964.90) 211086
BANK OFBAROD 162.35 (165.20) 16765567
BEL 171.10 (176.05) 3178455
BHEL 97.45 (99.90) 9461595
BRITANNIA 4631.50 (4749.80) 177923
CADILA HEALT 437.60 (440.25) 335848
COLGATE PALM 1159.20 (1141.85) 353631
CONTAINER 1439.10 (1429.00) 713977
CUMMINS INDI 906.20 (932.65) 692992
DABUR INDIA 364.65 (358.90) 1240349
DLF LIMITED 250.20 (262.60) 6764646
EMAMI LIMITE 1261.15 (1236.65) 167997
GLAXOSMI CON 6625.65 (6523.25) 20225
GLAXOSMI PHA 2473.25 (2486.35) 14738
GLENMARK PHA 625.75 (630.90) 754679
GODREJ CONSU 1035.15 (999.35) 1319819
HAVELLS INDI 552.10 (559.35) 377507
HINDUSTAN ZI 308.30 (323.15) 2229509
ICICI PRU LI 412.45 (419.65) 636099
IDEA CELLULR 101.10 (103.50) 14011771
INTERGLOBE A 1191.30 (1200.60) 204291
JSW STEEL LT 279.80 (285.05) 8128594
LIC HOUS.FIN 551.85 (558.10) 1201369
MARICO LIMIT 311.00 (310.75) 953935
MCDOWELL 3683.50 (3684.60) 407106
MOTHERSON 378.80 (384.10) 1941064
MRF 68804.45 (70420.80) 7680
NHPC LTD 29.45 (30.85) 10176555
NMDC LTD 143.80 (149.45) 6197914
OIL INDIA 376.00 (380.20) 290815
ORACLE FIN S 4026.65 (4096.20) 11688
P&G HYG&HEAL 9394.30 (9309.10) 3360
PETRONET LNG 235.85 (234.60) 4572608
PIDILITE IND 893.20 (896.50) 274737
PIRAMAL ENTE 2758.70 (2853.15) 149242
PNB 170.50 (175.55) 32923946
POWER FIN CO 119.25 (122.00) 4511605
RURAL ELEC C 152.95 (155.45) 4236254
SAIL 92.30 (96.50) 16245856
SHREE CEMENT 18421.60 (18975.00) 17598
SHRIRAM TRAN 1456.30 (1505.10) 796760
SIEMENS 1297.40 (1315.05) 140535
SUN TV LTD 1039.00 (1058.15) 646908
TATA POWER 90.60 (93.20) 8188295
TITAN IND 885.85 (893.10) 1285534
TORRENT PHAR 1430.90 (1404.65) 165569

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 232.90 (246.00) 4601595
ADANI ENTERP 195.25 (204.55) 13242809
ADANI POWER 36.95 (40.75) 43309803
ALL BANK 69.90 (71.85) 3377708
AMARA RAJA 832.70 (850.60) 261968
ANANT RAJIND 71.90 (75.85) 3259320
ANDHRA BANK 55.75 (56.95) 2840499
APOLLO HOSPI 1116.45 (1125.70) 187463
APOLLO TYRES 261.85 (273.85) 3167641
APTECH 351.95 (366.00) 435622
BAJAJ ELECT. 529.70 (538.10) 544784
BAJAJ HIND 14.70 (15.25) 5054876
BAJAJ HOLDIN 2724.70 (2770.55) 13482
BALAJI TELE 156.30 (157.10) 161678
BALLARPUR IN 16.40 (17.65) 2171780
BALRAMPUR CH 125.95 (131.25) 2291404
BANK OF MAHA 21.15 (21.60) 2169427
BANK OFINDIA 160.50 (164.70) 4614200
BATA INDIA 720.80 (730.70) 376905
BGR ENERGY S 135.80 (142.85) 193018
BHARAT FORGE 720.90 (735.15) 684221
BHUSHAN STEE 66.45 (69.40) 1591884
BIOCON LTD 539.60 (551.30) 1022827
BOMBAY DYE 250.10 (267.35) 4291051
CANARA BANK 349.30 (354.75) 3573883
CEAT LIMITED 1872.35 (1920.65) 327340
CENTRAL BANK 73.70 (74.10) 553519
CHAMBAL FERT 157.40 (155.55) 910559
CHENNAI PETR 437.40 (446.65) 356401
CITY UNIBANK 176.80 (175.95) 570885
CORPO BANK 39.55 (40.05) 402264
COX & KINGS 260.50 (262.05) 287580
D B REALTY L 68.40 (71.50) 1170128
DELTA CORP L 324.15 (332.15) 2708932
DENA BANK 25.90 (25.60) 6501706
DHANALAKBANK 29.10 (28.85) 2940244
DIVIS LAB 1090.40 (1107.55) 582399
EDELWEISS CA 274.30 (274.40) 2176417
EID PARRY 357.25 (364.55) 92983
EIH 202.60 (205.55) 697018
ESSAR SHIPPI 28.80 (29.40) 136011
ESTER INDUST 62.20 (66.50) 231036
EXIDE INDUST 222.25 (226.50) 1437056
FEDERAL BANK 102.15 (105.10) 20355477
FINOLEX CABL 711.15 (717.85) 38020
G E SHIP LTD 446.65 (438.55) 757724
GAMMON INFRA 3.85 (4.50) 40748042
GATI LIMITED 139.35 (147.55) 3006297
GAYATRI PROJ 214.35 (214.95) 1251381
GITANJALIGEM 70.00 (75.30) 2582866
GMR INFRASTR 22.75 (24.10) 169390298
GODREJ IND 609.75 (624.25) 254870
GRASIM IND 1217.60 (1248.00) 590715
GUJ ALK&CHEM 871.40 (905.45) 114283
GUJ NRE COKE 1.35 (1.40) 5246517
HCL INFOSYS 55.85 (58.50) 3163476
HDFC BANK 1973.00 (1920.00) 250000
HEXA TECH 347.00 (357.75) 780712
HIMACHAL FUT 31.05 (32.75) 10773612
HOUSING DEV 61.60 (64.95) 20871728
IDBI 60.15 (60.85) 6589204
IDFC 58.90 (61.70) 14254621
IFCI 30.00 (31.85) 24395778
IL&FS TRANS 79.85 (83.70) 471028
INDBULLS REL 230.20 (240.75) 6058696
INDIA CEM 182.45 (197.70) 6540354
INDIAN BANK 376.60 (386.20) 1170552
INDO RAMA SY 49.20 (53.25) 942945
INDRAPRASTHA 305.45 (314.75) 2265196
INGERSOLL-R 822.70 (846.35) 14560
IOB 23.10 (23.15) 1004995
IPCA LAB 584.75 (584.00) 89296
IRB INFRA DE 239.20 (247.05) 796718
J&K BANK 76.50 (77.75) 733357
JAI CORP 188.00 (195.90) 2617612
JAIN IRRIGAT 133.10 (141.30) 8843609
JAYPEE INFRA 16.55 (17.40) 15509060
JET AIRWAYS 791.25 (821.30) 3917234
JINDAL SAW 154.80 (167.85) 2503634
JINDAL STEEL 264.35 (269.70) 12623614
JK LAKSHMI C 443.35 (447.70) 46046
JK PAPER LIM 144.95 (153.05) 707778
JM FINANCIAL 159.55 (165.80) 974001
JP ASSOCIATS 20.85 (22.80) 94996332
JSW ENERGY L 89.30 (94.60) 12140370
JUBILANT FOO 1943.35 (1906.25) 1463218
JUBILANT ORG 898.60 (924.45) 4556523
JYOTHY LABS 375.70 (362.45) 711604
JYOTI STRUC 12.60 (13.25) 901356
KARNATA BANK 158.00 (162.25) 13640919

ఘనం (+)

నిఫ్టీ	18న	మార్పు%
INDIABULLS HSG	1243.70	2.84
ITC	273.40	2.76
UPL	800.50	2.53
HDFC BANK	1934.30	2.32
HDFC	1896.80	2.07
KOTAK MAHI BANK	1046.50	1.89
M&M	759.25	1.86

గ్రహణం (-)

నిఫ్టీ	18న	మార్పు%
BHARTI INFRA	343.80	-6.09
ADANI P&S	416.25	-3.96
HINDALCO INDU	253.90	-3.37
ULTRATECH CEM	4408.65	-2.98
TATA STEEL	751.75	-2.87
COAL INDIA	283.05	-2.72
GAIL (INDIA)	468.50	-2.51

KEC INTL LTD 362.05 (366.45) 499337
KOLTE PATIL 368.55 (378.40) 256281
KPIT CUMMINS 192.30 (201.35) 3190786
L&TFIN.HOLD 171.10 (173.65) 9428507
LAK VIL BANK 141.05 (141.60) 685766
M & M FINANC 474.40 (485.30) 927582
M & M FINANC 474.40 (485.30) 927582
MANAPPURAM G 115.60 (119.50) 5399102
MMTC LIMITED 64.75 (66.40) 1644131
MPHASIS LTD 794.35 (762.10) 494354
MRPL 126.00 (128.55) 1329628
MTNL 26.25 (27.75) 2554069
NAGARJUNA OI 4.30 (4.65) 1291622
NCC LIMITED 123.25 (129.75) 6826395
NETWORK18 FI 54.55 (57.50) 1835627
NEULAND LAB 876.80 (888.70) 22681
NIIT LTD 106.15 (110.00) 728959
NIIT TECHNOL 693.20 (706.05) 509696
OMAXE LTD 228.85 (230.10) 511871
ONMOBILE GLO 58.95 (63.30) 725281
ORIENTALBANK 120.85 (123.40) 2645726
PARSVNATH DE 26.15 (27.50) 195434
PATEL ENGG 79.75 (84.35) 626387
PFIZER 2100.30 (2096.25) 106767
POLARIS SOFT 406.55 (408.90) 117715
POWERTRADING 114.40 (116.65) 1525791
PRAJ IND 113.25 (117.10) 1846131
PRISM CEMENT 139.25 (145.30) 3118069
PUNJ LLOYD 23.80 (25.00) 2487817
PUNJAB & SIN 47.15 (47.70) 159383
PURAVANKARA 148.95 (156.40) 527118
PVP VENTURES 8.90 (9.35) 1232286
PVR LIMITED 1457.15 (1474.30) 338896
RADICO KHAIT 341.50 (341.85) 4778364
RAJESH EXPOR 830.90 (848.00) 590964
RALLIS INDIA 265.45 (275.85) 926751
RAMCO IND 301.15 (310.80) 167940
RAMCO SYS 517.30 (538.15) 37444
RAMKY INFRA 225.30 (231.20) 293182
RAYMOND 1062.00 (1108.90) 323759
RELIANCE CAP 526.15 (566.00) 8758762
RELIANCE COM 29.35 (32.35) 126454099
RELIANCE INF 506.50 (543.95) 4259050
RELIANCE POW 48.70 (52.30) 21139555
ROLTA INDIA 70.70 (74.35) 1868339
SAGAR CEMENT 1069.50 (1044.75) 30451
SAREGAMA 788.05 (809.80) 140452
SHANTHI GEAR 155.60 (161.85) 36126
SHIPPNG CORP 90.55 (92.95) 1080166
SHREE RENUKA 15.85 (16.10) 2508180
SINTEX IND 23.90 (24.25) 4550901
SOBHA DEVELO 545.45 (567.90) 244155
SOUTHINDBANK 31.80 (32.20) 23475860
SRS LIMITED 1.90 (1.95) 4446528
STERLITE TEC 389.45 (380.55) 7277412
SUN PHARMA 494.90 (508.80) 435908
SUND FASTNER 542.50 (556.80) 98088
SUZLON ENERG 14.85 (15.35) 40610391
SYND. BANK 77.15 (79.95) 5731472
TATA CHEM 728.65 (749.60) 1019204
TATA COFFEE 156.40 (159.70) 774435
TATA COMMUN 634.10 (645.60) 471242
TATA GLOBAL 305.45 (313.55) 3408593
TATA METALIK 882.55 (910.90) 343564
TATA MOT DVR 242.60 (245.05) 3063226
THE INDIAN H 140.60 (148.65) 1882304
TORRENT POWE 292.95 (291.45) 2972725
TRIVENI ENGG 73.60 (74.10) 734422
TTK PRESTIGE 8505.60 (8522.20) 26008
TV TODAY NET 450.50 (475.25) 250688
TV18 BROADCA 59.70 (62.70) 8471249
TVS MOTOR 719.95 (730.00) 1016503
UCO BANK 31.05 (31.25) 1078048
UNION BANK 137.90 (140.50) 5396514
UNITECH 8.80 (9.40) 63870172
UNITED BANK 17.80 (17.95) 1042882
UNITED BREWE 1081.15 (1131.15) 277784
USHA MARTIN 27.50 (29.20) 2907654
VADILAL INDU 919.05 (937.40) 7999
VENKYS 2493.60 (2515.90) 89605
V-GUARD IND 235.15 (243.60) 1510280
VIJAYA BANK 65.10 (66.95) 2021970
VIP 362.30 (375.55) 568485
VOLTAS 600.45 (628.25) 1400130
ZEE LEARN LI 44.85 (46.85) 1138774
ZUARI GLOBAL 214.40 (225.10) 166161
ZYDUS WELLNE 1112.00 (1140.40) 13091

AISHWARYA TE 10.56 (11.15) 46416
AMAR RAJA BA 832.40 (850) 29439
ANDHRA BANK 55.70 (56.95) 254259
ANDHRA CEMEN 13.39 (13.99) 57949
ANDHRA PAPER 357.95 (381.10) 39107
ANDHRA PETRO 63.05 (63.10) 369510
ANDHRA SUGAR 654.90 (664.20) 21397
ASTRA MICROW 115.80 (119.20) 121848
AUROBINDO PH 645.85 (658.70) 154095
AVON ORG 18.59 (18.11) 48830
BALAJI AMIN 691.35 (708) 21908
BARTRONICS 14.65 (14.93) 37202
BHAGYA NAG 44.30 (47.45) 13908
BRILLIANT SE 16.98 (17.87) 83464
CAMBRIDGE TE 98.90 (100.90) 17709
COROMAN FERT 556.60 (556.80) 32586
CYBERMATE 3.76 (3.89) 98553
CYIENT LIMIT 580.95 (589.50) 14554
DIVI'S LAB 1086.90 (1104.60) 27763
DR REDDY 2465.65 (2489.40) 41922
GATI CORPN 139.40 (147.90) 504283
GAYATRI PROJ 213.45 (214.55) 60328
GMR INFRASTR 22.75 (24.10) 13455584
GOLDST INFRA 213.55 (228.80) 59990
GOLDSTONE EN 17.95 (18.65) 19850
GRANULES (I) 136.05 (139.85) 159954
GSS AMERICA 32.85 (34.25) 18631
GVK POWER 23.10 (24.30) 3141786
HBL NIFE POW 64.30 (67.85) 272847
HIND FLUROCA 14.89 (14.75) 14600

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

INNAREDY COM 5.81 (6.11) 26031
IVRCL INFRAS 5.99 (6.30) 336738
KAKATIYA CEM 391.60 (404.55) 14190
KALLAM SPG 22.70 (23.65) 33524
KARUNA CABLE 0.09 (0.09) 66349
KAVERI SEED 511.95 (521.55) 75703
KCP LTD 150.15 (150.05) 57118
KERNEX MICRO 60.05 (63.20) 49406
KNR CONSTRUC 306.80 (310.70) 16300
LANCO INDUS 396.50 (407.90) 29027
LANCO INFRAT 2.15 (2.23) 14150786
LAURUS LABS 537.95 (547.15) 22992
LOKESH MACH 70.80 (73.65) 52196
MADHUCON PRO 33.75 (34.75) 44520
MEGA SOFT 15.13 (15.87) 41394
MIC ELECTRON 9.07 (9.44) 65888
MOLD-TEK.TEC 71.80 (74.90) 15615
MSR INDIA LT 39.50 (40.15) 19504
NAGARJAGRICH 57.15 (59.80) 40078
NATCO PHARMA 1005.75 (1020.65) 13784
NAVA BH VENT 167.40 (170.20) 123522
NCC 123.20 (129.65) 472796
NCL IND 279.25 (272.55) 96693
NEHA INTER 8.70 (8.75) 50709
NETTLINX 89.55 (91) 92943
NIHAR INFO 14.50 (14.49) 554
NILE 968.40 (961.40) 17887
OIL COUNTRY 54.15 (57.75) 17625
PANYAM CEMEN 61.55 (62.20) 33267
PENNER IND 64.90 (66.95) 159808
PHYTOCHEM I 70.40 (74.15) 15592
PITTI LAMIN 96.15 (98.35) 23226
PRAJAY ENGS 16.73 (17.61) 133048
PRISM CEMENT 139.50 (144.95) 462286
PRUDENTL PHA 5.06 (5.42) 346448
RAIN INDUSTR 419.10 (440.95) 698956
SATVAH. ISPA 31.80 (34.25) 40943
SOUTH BIO TE 4.40 (4.32) 58245
SREE RAYAL A 70.60 (74.50) 622487
SRINIVASA SH 88.20 (91.15) 15273
STEEL EXCHAN 35.55 (37.30) 54300
SUJANA METAL 1.66 (1.74) 104782
SUJANA UNIVE 1.16 (1.22) 223863
SURANA TELE 6.04 (6.11) 29033
SUVEN PHARMA 200.45 (204.15) 113825
TAJ GVK HOTE 181.90 (174.25) 189763
TANLA 38.80 (40.35) 192482
TRANS BIOTEK 2.49 (2.62) 21121
TRENDY KNIT 0.28 (0.27) 700487
VICEROY HOTE 19.15 (19.65) 143535
VIJAY TEXTIL 54.55 (57.40) 70356
VISAKA IND 773.90 (795.55) 50446
VISTA PHARMA 47 (46.95) 62726
VIVIMED LABS 96.20 (101.75) 138381
YBRANT DIGIT 7.28 (7.66) 346614
ZENOTECH LAB 48.70 (48.85) 14313
ZENTECH 127.90 (135.65) 190681

రూ.398 రీఛార్జులపై భారీ క్యాష్‌బ్యాక్: ఐడియా

దిల్లీ: రూ. 398 అంతకుమించిన రీఛార్జులపై రూ. 3,300 వరకు నగదు వెనక్కి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు ఐడియా సెల్యులార్ ప్రకటించింది. ఫిబ్రవరి 10 వరకు చేసుకునే రీఛార్జులపై ఈ మ్యాజిక్ క్యాష్‌బ్యాక్ ఆఫర్ వర్తిస్తుంది. దీనికింద రూ. 50 విలువైన 8 ఓచర్లు లభిస్తాయి. ఏడాది లోపు రూ. 300, అంతకుమించిన రీఛార్జులకు వీటిని వాడుకోవచ్చు. చంబక్, క్రోమా, ఇబే, పెప్పర్‌ఫ్రై, పీటర్‌ఇంగ్లండ్ విక్రయశాలల్లో వినియోగించుకునే రూ. 2,700 విలువైన ఓచర్లు ఇస్తారు. ఐడియా యాప్, వెబ్‌సైట్ ద్వారా రీఛార్జి చేసుకుంటే, మరో రూ. 200వరకు వాలెట్‌కు లభిస్తాయని సంస్థ తెలిపింది.



హైదరాబాద్‌లో వచ్చేనెల బయోఆసియా సదస్సు

ఈనాడు, హైదరాబాద్: జీవ శాస్త్ర, ఔషధ రంగంలో వస్తున్న మార్పులపై సమగ్రంగా చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న బయోఆసియా 2018 సదస్సు హైదరాబాద్‌లో ఫిబ్రవరి 22 నుంచి 24 వరకూ జరగనుంది. ఈ 15వ విడత సదస్సులో 55 దేశాల నుంచి దాదాపు 1,500 మంది ప్రతినిధులతో పాటు, 500 కార్పొరేట్ సంస్థలు పాల్గొననున్నాయి. అత్యున్నత స్థాయికి చెందిన 100 మంది ఈ సదస్సులో ప్రసంగించనున్నారు. 'రైట్ టైం, రైట్ నౌ' అనే భావనతో ఈ సదస్సు జరగనుంది. ఐర్లాండ్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా దేశాలు అంతర్జాతీయ భాగస్వాములుగా ఉండగా, దేశీయంగా గుజరాత్, అసోం, రాజస్థాన్ రాష్ట్రాలు జాతీయ భాగస్వాములుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

కొత్త స్విఫ్ట్ వస్తోంది

- ఆటో ఎక్స్‌పోలో ఆవిష్కరణ!
- రెనో విద్యుత్ వాహనాలూ



పుణె: వచ్చే నెలలో జరగబోయే వాహన ప్రదర్శనలో మారుతీ సుజుకీ తన ప్రముఖ మోడల్ అయిన స్విఫ్ట్‌లో కొత్త వెర్షన్‌ను ఆవిష్కరించబోతోంది. ఇప్పటికే ఈ కొత్త కారు కోసం బుకింగ్‌లను ప్రారంభించింది కూడా. కొత్త మోడల్‌ను పెట్రోలు రకం 1.2 లీటర్ ఇంజిన్‌తో; డీజిల్ రకం 1.3 లీటర్ ఇంజిన్‌తోనూ తీసుకువస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత మోడల్‌తో పోలిస్తే కొత్త వెర్షన్ వెడల్పుగా ఉండడమే కాకుండా.. వీల్ బేస్ పొడవుగా ఉండనుంది. మరింత క్యాబిన్, హెడ్ రూమ్, లగేజ్ స్థలంతో రానుంది. ఈ మార్పులతో యువతను మరింతగా ఆకట్టుకుంటుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్, విక్రయాలు) ఆర్.ఎస్. కల్సి పేర్కొన్నారు. 'కొత్త స్విఫ్ట్‌కు బుకింగ్‌లను ప్రారంభిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం. ఆటో ఎక్స్‌పో 2018లో దీనిని ఆవిష్కరించడానికి ఎదురుచూస్తున్నామ'ని ఆయన అన్నారు.

రెనో ఫార్ములా 1 కారు: పలు విద్యుత్ వాహనాలు, కాన్సెప్ట్ కార్లను ప్రదర్శనకు ఉంచనున్నట్లు ఫ్రెంచి కార్ల సంస్థ రెనో ప్రకటించింది. అంతర్జాతీయంగా విద్యుత్ కార్లలో దిగ్గజంగా ఉన్న ఈ కంపెనీ తన అంతర్జాతీయ పోర్ట్‌ఫోలియోలో పలు కార్లను ప్రదర్శించనుంది. అందులో పలు విద్యుత్ కార్లతో పాటు ఫార్ములా1 రేసింగ్ కారు కూడా ఉండడం విశేషం.

కొత్త క్యూ5 వచ్చింది

- ధర రూ.57.6 లక్షలు
- విద్యుత్ వాహనాలు 2020లో

దిల్లీ: జర్మనీకి చెందిన విలాసవంత కార్ల తయారీదారు ఆడి భారత మార్కెట్లోకి 2020 కల్లా విద్యుత్ వాహనాల(ఈవీ)ను ప్రవేశపెట్టనుంది. అప్పటి కల్లా దేశంలో ఛార్జింగ్‌కు సంబంధించిన మౌలిక వసతులు అభివృద్ధి చెంది ఉంటే ఈవీల ఆవిష్కరిస్తామని ఆడి ఇండియా అధిపతి రాహిల్ అన్సారీ అభిప్రాయపడ్డారు. మరో పక్క గురువారం తన ప్రీమియం ఎస్‌యూవీ క్యూ5ను విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 57.6 లక్షలు(ఎక్స్ షో రూం దిల్లీ). విద్యుత్ వాహనాలతో పాటు. . సంప్రదాయ వాహనాల శ్రేణిని సైతం విస్తరించనున్నట్లు అన్సారీ తెలిపారు. 'భారత్‌లో విద్యుత్ వాహనాలకు మౌలిక వసతులు ఎంత వేగంగా అభివృద్ధి చేస్తారన్న దానిపై మా విద్యుత్ వాహనాల విడుదల ఆధారపడి ఉంటుంది. మౌలిక వసతులు సిద్ధంగా ఉంటే.. వాహనాలను ఆవిష్కరిస్తాం. లేదంటే ఆలస్యమవుతుంద'ని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విభాగంలో వాహనాల విడుదలకు సిద్ధమవుతున్నామని ఆయన అన్నారు. అంతర్జాతీయంగా 2025 కల్లా తమ వాహన విక్రయాల్లో 30 శాతం విద్యుత్ వాహనాలదే వాటా ఉండొచ్చని ఆడి అంచనా వేస్తోంది.



గురువారం దిల్లీలో కొత్త క్యూ5తో ఆడి ఇండియా అధిపతి రాహిల్ అన్సారీ



ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న ప్రియా ఫుడ్స్ ఉపాధ్యక్షుడు కె.చంద్రశేఖర్

'ప్రియా ఫుడ్స్'కు ప్రతిష్ఠాత్మక ఫియో అవార్డు

ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

ఈనాడు డిజిటల్, చెన్నై: ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 'ప్రియా ఫుడ్స్' ను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈవో - ఫియో) వారి సదరన్ రీజియన్ ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. గురువారం చెన్నైలోని ఓ ప్రముఖ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రియా ఫుడ్స్ ఉపాధ్యక్షుడు కె. చంద్రశేఖర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన మరికొన్ని సంస్థల ప్రతినిధులు కూడా ఈ అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రియా ఫుడ్స్ ఉపాధ్యక్షుడు కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ... వరుసగా మూడు సంవత్సరాలు ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతో వినియోగదారుల నమ్మకాన్ని చూరగొన్నామనడానికి నిదర్శనమే ఈ అవార్డు అని పేర్కొన్నారు. 45 దేశాల్లో ప్రియా పచ్చళ్లతోపాటు మసాలా పొడులు, చట్నీలు, ఇతర నూతన ఉత్పత్తులను విక్రయిస్తున్నామన్నారు. ఫియో రీజినల్ ఛైర్మన్ డాక్టర్ ఎ. శక్తివేల్ మాట్లాడుతూ.... వరుసగా మూడు సంవత్సరాలు ఈ అవార్డును ప్రియా ఫుడ్స్‌కు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బహుళ ఉత్పత్తుల ఎగుమతిలో ప్రియా ఫుడ్స్ అగ్రభాగాన నిలిచిందన్నారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇతర సంస్థలకూ..: వివిధ విభాగాల్లో పురస్కారాలు అందుకున్న సంస్థల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్, కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్, రెయిన్ సీఐఐ కార్బన్ లిమిటెడ్, శ్రీనివాస హెయిర్ ఇండస్ట్రీస్, శ్రీ అనంత లక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మాయార్న్ అండ్ ఫైబర్స్, అమరరాజా బ్యాటరీస్ లిమిటెడ్ ఉన్నాయి. తెలంగాణకు చెందిన శ్రీ సల్సార్ బాలాజీ ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ తదితర సంస్థలు కూడా పురస్కారాలు దక్కించుకున్నాయి.

ఇక సేవలను బట్టే ఛార్జీలు!

- బాగుంటే ఎక్కువ.. లేదంటే తక్కువే
- విమానాశ్రయాల్లో కొత్త విధానం

దిల్లీ

సేవలు అద్భుతంగా ఉన్నాయ్.. అంతర్జాతీయ స్థాయి సదుపాయాలున్నాయ్.. అని ధ్రువీకరణ పొందిన విమానాశ్రయాల నుంచి ప్రయాణించేవారు, విమానాశ్రయ రుసుమును అధికంగా చెల్లించాల్సి రావచ్చు. సేవలు చెత్తగా ఉన్నాయని తేలిన విమానాశ్రయాల్లో రుసుముల భారమూ తగ్గనుంది. సేవల తీరుకు అనుగుణంగానే విమానాశ్రయాల్లో రుసుములు వసూలు చేయాలన్న విమానాశ్రయాల ఆర్థిక నియంత్రణ ప్రాధికార సంస్థ ప్రతిపాదన అమల్లోకి వస్తే, ఇలాంటివి అనుభవంలోకి వస్తాయని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించినట్లు కోజెన్సీస్ తెలిపింది. 6 నెలల్లో ప్రయోగాత్మకంగా కొన్ని విమానాశ్రయాల్లో నూతన విధానం అమలు చేయాలని ప్రాధికార సంస్థ ప్రతిపాదించింది. విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) నిర్వహణలోకి ఒక ప్రధాన విమానాశ్రయం, ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యంలో నడుస్తున్న మరో ప్రధాన విమానాశ్రయం సహా 20-25 ముఖ్యమైన విమానాశ్రయాల్లో ప్రయోగాత్మకంగా తప్పనిసరిగా ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. చెక్‌ఇన్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు 10 నిమిషాల కంటే ఎక్కువ సమయం వేచి చూడాల్సిన అవసరం లేకుండా చూడాలన్న పార్లమెంటరీ స్థాయీసంఘం సూచనలకనుగుణంగా ఈ విధానాన్ని ప్రతిపాదించారు. అన్ని విమానాశ్రయాల్లో ఆన్‌లైన్ బోర్డింగ్‌పాస్ సదుపాయం కల్పించాలని కోరారు.

ప్రస్తుతం.. విమానాశ్రయాలను నిర్వహించే సంస్థలు పెట్టిన పెట్టుబడులు, నిర్వహణ ఖర్చులు వసూలు చేసుకునేందుకు, విమానయాన సంస్థల నుంచి రుసుములు వసూలు చేస్తున్నాయి. ఆయా సంస్థలు అయిదేళ్లలో పెట్టే పెట్టుబడుల అంచనాలకు అనుగుణంగా ప్రాధికార సంస్థ ఈ ఛార్జీలను నిర్ణయిస్తోంది. ఈ మొత్తాన్ని ప్రయాణికుల వద్ద విమానయాన సంస్థల రాబడుతున్నాయి.

ఇకపై: సేవల నాణ్యతకు అనుగుణంగా ఛార్జీలు నిర్ణయిస్తారు. సేవలు బాగుంటే ఎక్కువ మొత్తం, సరిగా లేకుంటే ఛార్జీల్లో కోత విధిస్తారు. కొత్త విధానం వల్ల ప్రయాణికులు విమానం ఎక్కేందుకు వచ్చినప్పటి నుంచి దిగి, వెళ్లేవరకు సౌకర్యవంతంగా గడిపేందుకు విమానాశ్రయ సంస్థలు తగిన చర్యలు తీసుకుంటాయని భావిస్తున్నారు. ఇందుకోసం పారదర్శకంగా సేవల నాణ్యతను అంచనా వేయాల్సి ఉంటుంది.



ఇవన్నీ పరిశీలిస్తారు

- ✦ సెక్యూరిటీ తనిఖీలు పూర్తి చేసేందుకు పడుతున్న సమయం
- ✦ సామగ్రిని తిరిగి తీసుకునేందుకు సదుపాయాలు ఎలా ఉన్నాయి
- ✦ అంతర్జాతీయ ప్రయాణాలైతే ఇమిగ్రేషన్ కేంద్రాల వద్ద ఎంతసేపు వేచి ఉండాల్సి వస్తోందో కూడా గమనిస్తారు.

సేవలు బాగుంటే..

విమానాశ్రయ ఛార్జీలు పెరుగుతాయి. విమానం దిగినందుకు, పార్కింగ్ చేసినందుకు అధికమొత్తాలను విమానయాన సంస్థలు చెల్లించాల్సి వస్తుంది. ఇందువల్ల విమానాశ్రయాల నిర్వహణ సంస్థల ఆదాయం మెరుగుపడుతుంది. అయితే ప్రయాణికులు వేచి ఉండాల్సిన సమయం బాగా తగ్గుతుంది.

- ✦ దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలను నిర్వహిస్తున్న జీఎంఆర్ ఇన్‌ఫ్రాకు 2016-17లో రూ. 4,639 కోట్ల ఆదాయం లభించింది.
- ✦ ముంబయి విమానాశ్రయాన్ని జీవీకే, విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. చెన్నై విమానాశ్రయం ఏఏఐ ఆధీనంలో ఉంది.

ఈ ఏడాది వృద్ధి 12 శాతమే: బోయింగ్

దిల్లీ: విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరల కనుగుణంగా టికెట్ల ధరల పెంపు అనివార్యమవుతుందని, అందువల్ల ఈ ఏడాది దేశీయ విమానయాన రంగం వృద్ధి 12 శాతానికి పరిమితమవుతుందని విమానాల తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేస్తోంది. 2015 నుంచి 2017 వరకు దేశీయ ప్రయాణికుల్లో 20-25 % వృద్ధి నమోదైంది. గత 8 నెలల్లో ఏటీఎఫ్ ధర 60 % పెరిగిందని బోయింగ్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు దినేశ్ కేస్కర్ తెలిపారు. ఎయిరిండియా 787 డ్రీమ్‌లైనర్ విమానాల విండ్‌షీల్డ్‌లో పగుళ్లు రావడంపై పరిశీలన చేస్తున్నట్లు వివరించారు. సింగిల్ ఐస్లే జెట్ బీ737 మ్యాక్స్ విమానాల సరఫరా వచ్చే ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి ఉంటుందని పేర్కొన్నారు.

ఏ స్టార్ హోటలో తెలియాల్సిందే

- రిసెప్షన్‌తో పాటు వెబ్‌సైట్‌లలోనూ చూపాలి
- పర్యాటక శాఖ మార్గదర్శకాలు

దిల్లీ: ఇకపై తాము వెళ్లబోయే హోటల్ ఏ స్టార్ వర్గీకరణ కలిగినదో తెలుసుకునే వీలు పర్యాటకులకు కలగనుంది. ఇప్పటివరకు 3 స్టార్, 5 స్టార్ అని చెప్పుకోవడమే కానీ రాతపూర్వకంగా ఎక్కడా ఈ వివరాలను హోటళ్లు ప్రదర్శించడం లేదు. ఇకపై తమ హోటల్ ఏ స్టార్ విభాగానికి చెందినదనే అంశాన్ని తప్పనిసరిగా, సంస్థ వెబ్‌సైట్‌తో పాటు రిసెప్షన్‌లలో కూడా ప్రదర్శించాలని పర్యాటక శాఖ ఆదేశించింది. ఇందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందువల్ల ఈ రంగంలో పారదర్శకత ఏర్పడుతుందని పేర్కొంది. ఈ ప్రకారం..



- ✦ దేశీయంగా హోటళ్లలో ఉన్న సదుపాయాలు, సౌకర్యాలకు అనుగుణంగా 1 నుంచి 5 స్టార్ విభాగాలుగా వర్గీకరిస్తున్నారు.
- ✦ స్టార్ వర్గీకరణ కోసం దరఖాస్తు చేసుకునేప్పుడు, ఇకపై రుసుమును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. గతంలో డిమాండ్‌డ్రాఫ్ట్‌ల ద్వారా చెల్లించేవారు. ఈ క్రమంలో ఆలస్యం అయ్యే వీలుండేది.
- ✦ హోటల్ ఆవరణలో ఉండే బార్లు మినహా, మద్యం విక్రయ దుకాణాలను స్టార్ వర్గీకరణకు ప్రామాణికంగా తీసుకోరు.
- ✦ పర్యాటక శాఖ ఇచ్చిన స్టార్ వర్గీకరణను వెబ్‌సైట్‌లో ప్రత్యేక పేజీలో, హోటల్ రిసెప్షన్‌లో ప్రస్ఫుటంగా కనిపించేలా ప్రదర్శించాలి.
- ✦ స్టార్ వర్గీకరణకు సమయాన్ని నిర్దేశించారు. అన్ని ధ్రువీకరణలు, ప్రక్రియలు పూర్తి చేస్తే, 90 రోజుల్లోగానే మంజూరు చేయాల్సి ఉంటుంది.

క్యాష్ అండ్ క్యారీ వ్యాపారంలోకి సియామ్ మాక్రో

అయిదేళ్లలో రూ.1000 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: భారత్‌లో క్యాష్ అండ్ క్యారీ వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేసే రిటైలింగ్ సంస్థ సియామ్ మాక్రో పీసీఎల్ ప్రకటించింది. వచ్చే అయిదేళ్లలో రూ. 1000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. 'లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్' బ్రాండ్ కింద కంపెనీ కార్యకలాపాలు నిర్వహించనుంది. 'వచ్చే మూడేళ్లలో 15 విక్రయశాలలు తెరవడానికి సన్నాహాలు చేస్తున్నాం. వచ్చే అయిదేళ్లలో రూ. 1000 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాం' అని లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ తానిట్ చెరావానోన్ వెల్లడించారు. క్యాష్ అండ్ క్యారీ విభాగంలో వాల్‌మార్ట్ స్టోర్స్, మెట్రో క్యాష్ అండ్ క్యారీ, బూకర్ వంటి సంస్థలతో కంపెనీ నేరుగా పోటీపడనుంది. మొదటి మూడేళ్ల పాటు ఉత్తర భారత్‌పై దృష్టి పెట్టనున్నామని, 15 హోల్‌సేల్ సరఫరా కేంద్రాల ద్వారా 5000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించనున్నట్లు కంపెనీ వివరించింది. మొదటి రెండు విక్రయశాలలు దిల్లీ ఎన్‌సీఆర్‌లో తెరవనున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో వైఎల్‌జీ సెలూన్లు

ఈనాడు, హైదరాబాద్: సెలూన్ సేవలు, సౌందర్య ఉత్పత్తులను అందించే వైఎల్‌జీ సెలూన్ హైదరాబాద్‌లో మార్చిలోపు కొత్తగా మూడు కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. సగటున 1680 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ ఒక్కో కేంద్రానికి రూ. 60 లక్షల వరకూ ఖర్చు చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ బాలచంద్రన్ తెలిపారు. మహిళలకు ప్రత్యేకించిన ఈ సెలూన్లలో ఆధునిక సేవలు అందిస్తున్నామన్నారు. ఒక్కో కేంద్రంలో సగటున 15 మంది ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 8 రకాల సౌందర్య ఉత్పత్తులు దేశవ్యాప్తంగా 1400 విక్రయశాలలతో పాటు, ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఏడాదికి రూ. 60కోట్ల టర్నోవర్ ఉన్నట్లు.. ఇందులో సౌందర్య ఉత్పత్తుల అమ్మకాల ద్వారా రూ. 10కోట్లు ఆర్జిస్తున్నట్లు పేర్కొన్నారు. గత రెండుమూడేళ్లుగా తమ సంస్థ 40 శాతం వృద్ధి రేటు సాధిస్తున్నట్లు చెప్పారు. తమ అకాడమీ ద్వారా ఇప్పటికీ 5,500 మందికి శిక్షణ ఇచ్చినట్లు, కనీసం రాయడం, చదవడం వచ్చిన ఎవరైనా సరే.. డిప్లొమా కోర్సులు చేసేందుకు అర్హులని సంస్థ సహ వ్యవస్థాపకురాలు వైజయంతీ బాలచంద్రన్ తెలిపారు. హైదరాబాద్‌లో 'హెయిర్ అండ్ బ్యూటీ' అకాడమీ త్వరలోనే అందుబాటులోకి రానుందన్నారు. రానున్న రెండేళ్లలో ఇక్కడ మరో 24 కేంద్రాలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఔత్సాహికులకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. విజయవాడలో కూడా సెలూన్లను ప్రారంభించేందుకు చూస్తున్నామన్నారు.

సీనియర్ కార్యనిర్వహణాధికారులకు ఐఎస్‌బీలో కోర్సు

ఈనాడు, హైదరాబాద్: పరిశోధనల్లో ఆసక్తి ఉండి, సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ కార్యనిర్వహణాధికారులకు ప్రత్యేక కోర్సును ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అందించనుంది. మూడేళ్ల కాల వ్యవధితో ఉండే ఈ 'ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఈఎఫ్‌పీఎం)' కోర్సు, బిజినెస్ స్కూళ్ల అధ్యాపకులకు కూడా అందుబాటులో ఉండనుంది. పట్టభద్రులై, 8 ఏళ్ల ఉద్యోగ అనుభవం ఉన్న వారు ఇందులో చేరడానికి అర్హులు. ఈ ఏడాది ఆగస్టులో ఈ కోర్సు ప్రారంభం కానుంది. పరిశ్రమలకు సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి విద్యాపరమైన పరిశోధనల అవసరం ఎంతైనా ఉందని, ఇందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ అన్నారు. యాజమాన్య నిర్వహణలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తులకు ఈ కోర్సు మంచి అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఆయా రంగాల్లో తమ అనుభవాలను పుస్తకం, కథనాల రూపంలో ప్రపంచానికి తెలియజేసేందుకు అవసరమైన నైపుణ్యాలూ కోర్సులో భాగంగా ఉంటాయని తెలిపారు. ఆయా రంగాల్లో అనుభవం ఉన్న ప్రపంచస్థాయి అధ్యాపకులు ఈ కోర్సును బోధిస్తారన్నారు.

అల్ట్రాటెక్ సిమెంట్

వ్యయాలు రూ.7,536 కోట్లు

దిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ డిసెంబరు త్రైమాసికంలో రూ. 456.66 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2016-17 ఇదే కాలంలో సంస్థ లాభం రూ. 693.96 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో సంస్థ మొత్తం ఆదాయం రూ. 6,858.46 కోట్ల నుంచి రూ. 8,175.40 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ. 7,536.53 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, జైప్రకాశ్ అసోసియేట్స్, జేపీ సిమెంట్ కార్పొరేషన్‌లకు చెందిన సిమెంట్ ప్లాంట్లను అక్టోబరు-డిసెంబరులోనే కొనుగోలు చేయడం వల్ల ఫలితాలను గతంతో పోల్చిచూడలేమని అల్ట్రాటెక్ తెలిపింది. పెట్ కోక్, బొగ్గు ధరలు పెరగడంతో వ్యయాలు అధికమయ్యాయని.. అదే సమయంలో కొన్ని రాష్ట్రాల్లో పెట్ కోక్ వినియోగంపై నిషేధం కూడా సంస్థ పనితీరుపై ప్రభావం చూపిందని వివరించింది. బడ్జెట్‌లో మౌలిక రంగానికి, గ్రామీణాభివృద్ధి అధిక కేటాయింపులు ఉంటాయన్న అంచనాలు గిరాకీకి కీలకంగా మారనున్నాయని తన భవిష్యత్ అంచనాల్లో పేర్కొంది.



బీఎస్ఈలో కంపెనీ షేరు 2.95% నష్టంతో రూ.4408.55 వద్ద స్థిరపడింది.

యెస్ బ్యాంక్

కలిసొచ్చిన వడ్డీ ఆదాయం

ముంబయి: అక్టోబరు-డిసెంబరు నెలల్లో యెస్ బ్యాంక్ లాభం 22 % పెరిగి రూ. 1076.87 కోట్లకు చేరింది. 2016-17 ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ. 882.63 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ. 5229.96 కోట్ల నుంచి రూ. 6492.56 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 0.85 శాతం నుంచి 1.72 శాతానికి చేరాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.29 శాతం నుంచి 0.93 శాతానికి పెరగడం గమనార్హం. నికర వడ్డీ ఆదాయం మాత్రం 26.8 శాతం హెచ్చి రూ. 1888.8 కోట్లకు పెరిగింది. 'యెస్ బ్యాంక్ మరో సంతృప్తికర త్రైమాసిక పనితీరును వెలువరించింది. రూ. 2.5 లక్షల కోట్లకు పైగా బ్యాలెన్స్ షీట్‌ను, రూ. 1.7 లక్షల కోట్లకు పైగా రుణాలను నమోదు చేసింద'ని బ్యాంక్ ఎండీ, సీఈఓ రాణా కపూర్ పేర్కొన్నారు.



బీఎస్ఈలో యెస్ బ్యాంక్ షేరు 0.66% తగ్గి రూ.340.25 వద్ద ముగిసింది.

ఎయిర్‌టెల్

హలో ..లాభం క్షీణించింది



దిల్లీ

ఫలితాల్లో భారతీ ఎయిర్‌టెల్ డీలా పడింది. డిసెంబరు 31, 2017తో ముగిసిన మూడు నెలల కాలంలో భారతీ ఎయిర్‌టెల్ ఏకీకృత నికర లాభం 39 శాతం క్షీణించి రూ. 306 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో లాభం రూ. 504 కోట్లుగా నమోదైంది. ఇక ఆదాయం సైతం 13 % తగ్గి రూ. 23,336 కోట్ల నుంచి రూ. 20,319 కోట్లకు పరిమితమైంది.

ఎందుకు తగ్గిందంటే: దేశీయ అంతర్ అనుసంధాన వినియోగ ఛార్జీలు(ఐయూసీ) తగ్గించడంతో ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం(ఆర్పు) 2017-18 మూడో త్రైమాసికంలో తగ్గిందని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, సీఈఓ గోపాల్ విత్తల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ టర్మినేషన్ రేట్లు కూడా తగ్గించాలన్న తాజా నిర్ణయం వల్ల ఆర్పు ఇంకా తగ్గడంతో పాటు.. విదేశీ ఆపరేటర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు.

పెరిగిన వినియోగదార్లు: 16 దేశాల్లో ఉన్న కంపెనీ వినియోగదార్ల సంఖ్య 39.42 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 9.2 % ఎక్కువ. భారత ఆదాయాల విషయానికొస్తే 11.3 % తగ్గి రూ. 15,294 కోట్లకు పరిమితమైంది. దేశీయ టర్మినేషనల్ రేట్ల తగ్గింపు ప్రభావం వీటిపై పడిందని కంపెనీ వివరించింది. మరో పక్క ఆఫ్రికా ఆదాయాలు మాత్రం 5.3 % పెరిగాయి. కంపెనీ మొత్తం నికర రుణాలు రూ. 91,480 కోట్ల నుంచి రూ. 91,714 కోట్లకు చేరుకున్నాయి. అనుబంధ కంపెనీల నుంచి వచ్చిన డివిడెండ్లను వినియోగదార్లకు పూర్తిగా బదిలీ చేయడం కోసం.. ఒక్కో షేరుకు రూ. 2.84 డివిడెండును ప్రకటించినట్లు కంపెనీ ప్రకటించింది. మార్కెట్ ట్రేడింగ్ పూర్తయిన తర్వాత కంపెనీ ఫలితాలను ప్రకటించింది.

డివిడెండు రూ.2.84

బీఎస్ఈలో గురువారం సంస్థ స్క్రిప్ 1.17% నష్టపోయి రూ.494.50 వద్ద స్థిరపడింది.

హిందుస్థాన్ జింక్

తగ్గిన నికర లాభం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని హిందుస్థాన్ జింక్ రూ. 2,230 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ. 2,320 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 3.8 శాతం తక్కువ. మొత్తం ఆదాయం రూ. 5,975 కోట్ల నుంచి రూ. 6,220 కోట్లకు వృద్ధి చెందింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఉత్పత్తిలో భూగర్భ గనుల వాటా 85 శాతమని కంపెనీ తెలిపింది. తద్వారా పూర్తి భూగర్భ గనుల కంపెనీగా రూపాంతరం చెందడంలో విజయం సాధించామని హిందుస్థాన్ జింక్ ఛైర్మన్ అగ్నివేశ్ అగర్వాల్ వెల్లడించారు. ఆరేళ్ల ఈ ప్రయాణంలో కంపెనీ స్థిరంగా అధిక ఉత్పత్తి, లాభదాయకత సాధించడం సహా రికార్డు స్థాయిలో డివిడెండ్ ప్రకటించామని, లోహ ధరల పెరుగుదల ఇందుకు తోడ్పడిందని అన్నారు. గనుల లోహ ఉత్పత్తి లక్ష్యమైన 1.2 మిలియన్ టన్నులకు కంపెనీ చేరువైందని వివరించారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో గనుల లోహ ఉత్పత్తి 10 శాతం వృద్ధితో 2.4 లక్షల టన్నులుగా నమోదైంది. శుద్ధి చేసిన జింక్-రాగి ఉత్పత్తి 7 శాతం వృద్ధితో 2.45 లక్షల టన్నులుగా ఉంది. ఇక శుద్ధి చేసిన వెండి ఉత్పత్తి 6 శాతం తగ్గి 132 మిలియన్ టన్నులకు చేరింది.

HINDUSTAN ZINC LIMITED

బీఎస్ఈలో షేరు 4.47 శాతం నష్టంతో రూ.308.70 వద్ద ముగిసింది.



ఛాంపియన్

కుర్రాళ్లకు ఎదురుందా?

- జింబాబ్వేతో పోరు నేడు
- అండర్-19 ప్రపంచకప్

మౌంట్ మౌంగానుయ్ (న్యూజిలాండ్): జోరు మీదున్న భారత యువ జట్టు మరో పోరాటానికి సిద్ధమైంది. విజయపరంపరను కొనసాగించాలనుకుంటున్న భారత్.. అండర్-19 ప్రపంచకప్‌లో శుక్రవారం బలహీన ప్రత్యర్థి జింబాబ్వేను ఢీకొంటుంది. ఆస్ట్రేలియా, పపువా న్యూగినియాలపై విజయాలతో ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్లో స్థానం ఖాయం చేసుకున్న భారత్.. ఈ మ్యాచ్‌లో గెలిస్తే గ్రూప్-బిలో అగ్రస్థానం సాధిస్తుంది. పృథ్వీ షా నేతృత్వంలోని భారత జట్టు ఈ మ్యాచ్‌లో కొన్ని ప్రయోగాలు చేసే అవకాశముంది.



సింధు, శ్రీకాంత్ సారథ్యంలో...

ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌కు భారత జట్టు

దిల్లీ: ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును బాయ్ ప్రకటించింది. ఫిబ్రవరి 6 నుంచి 11 వరకు మలేసియాలో జరిగే ఈ టోర్నీలో అగ్రశ్రేణి క్రీడాకారులు పి.వి.సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారత జట్టు బరిలో దిగుతుందని వెల్లడించింది. నిరుడు తృటిలో సెమీస్ బెర్తులు కోల్పోయిన భారత్ ఈసారి పతకాలు సాధిస్తుందని బాయ్ ధీమా వ్యక్తంజేసింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్, సమీర్‌వర్మ; మహిళల సింగిల్స్‌లో సింధు, సైనా, శ్రీకృష్ణప్రియ, రుత్విక శివాని; పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజు- చిరాగ్ శెట్టి, మను అత్రి- సుమీత్‌రెడ్డి, శ్లోక్- అర్జున్; మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప- సిక్కిరెడ్డి, ప్రజక్త సావంత్- సంయోగిత, రితుపర్ణ దాస్- మిథిల భారత జట్టుకు ఎంపికయ్యారు.

సాయిప్రణీత్ ఓటమి

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాడు సాయిప్రణీత్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 17-21, 18-21తో టాప్ సీడ్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప 15-21, 15-21తో కమీలా జుహ- క్రిస్టినా పెడర్సన్ చేతిలో పరాజయం చవిచూశారు.

PRO KABADDI


అక్టోబరులో కబడ్డీ.. కబడ్డీ


ముంబయి: ప్రొ కబడ్డీ ఆరు, ఏడో సీజన్‌లకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది అక్టోబరు 19న ఆరో సీజన్‌కు తెరలేవనుంది. వచ్చే ఏడాది జులై 19న ఏడో సీజన్ ఆరంభమవుతుందని ప్రొకబడ్డీ నిర్వాహక సంస్థ మాషల్ స్పోర్ట్స్ గురువారం ప్రకటించింది. ఈ రెండు లీగ్‌లు 13 వారాల పాటు జరుగుతాయని తెలిపింది. ఐదో సీజన్‌లో మొత్తం 12 జట్లు 13 వారాల లీగ్‌లో పోటీపడిన సంగతి తెలిసిందే. ఆసియా క్రీడలు జరగనున్న నేపథ్యంలో ఆరో సీజన్‌ను అక్టోబరులో నిర్వహించాలని నిర్ణయించినట్లు లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి చెప్పాడు.



మెల్‌బోర్న్.. భగ భగ

ఆస్ట్రేలియన్ ఓపెన్ భగ్గుమంటోంది. తాళలేని వేడితో క్రీడాకారులు అపసోపాలు పడుతున్నారు. కోర్టులోకి వెళితే మంటల్లో నిలుచున్నట్లు ఉంటుందని గర్సియా అంటే.. డొమినిక్ థీమ్ ఐస్ నీళ్ల స్నానం కోసం తపించిపోయాడు. దాదాపు క్రీడాకారులందరూ ఐస్‌తో నింపిన బట్టను తలకు, శరీరానికి అద్దుకుంటూ ఆటను కొనసాగించారు. ఎండ 40 డిగ్రీలకు చేరడంతో కోర్టులో ఎక్కువసేపు నిలవడం క్రీడాకారులకు కష్టమవుతోంది. సుదీర్ఘంగా సాగే మ్యాచ్‌లకైతే ఎక్కువ మంచి నీటి విరామాలు తీసుకోవాల్సి వస్తోంది. "కోర్టులో భరించలేని వేడి ఉంది. గతంలో ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఎన్నో కఠినమైన మ్యాచ్‌లు ఆడాను. కానీ ఈ రోజు మాత్రం వేడిని తట్టుకోవడం నా వల్ల కాలేదు" అని స్పెయిన్ స్టార్ ముగురుజ చెప్పింది. వోండ్రోసోవాతో మ్యాచ్‌లో గర్సియా అయితే కోర్టులో దాదాపు కుంటుతున్నట్లు ఆడింది. కాలు నేల మీద పెట్టడానికి చాలా ఇబ్బంది పడింది.


డెల్‌పొట్రో


బౌచర్డ్


జకోవిచ్



> ఐసీసీ వార్షిక అవార్డుల్లో టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించాడు. నిరుడు కెప్టెన్‌గా, బ్యాట్స్‌మెన్ అద్భుతంగా రాణించిన అతణ్ని ఐసీసీ సముచిత రీతిలో గౌరవించింది.

కోహ్లి కొల్లగొట్టాడు

ఐసీసీ వార్షిక అవార్డుల్లో భారత కెప్టెన్ హవా

- క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాలు కైవసం
- టెస్టు, వన్డే జట్లకు కెప్టెన్‌గానూ ఎంపిక

> "క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికై గ్యారీ సోబర్స్ ట్రోఫీ గెలిచినందుకు, వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచినందుకు సంతోషంగా ఉంది. సోబర్స్ ట్రోఫీ గెలవడం ఇదే తొలిసారి. ఇది నాకు గొప్ప గౌరవం"
> – విరాట్ కోహ్లి

దుబాయ్

ఐసీసీ వార్షిక అవార్డుల్లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లిదే హవా. ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్, వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్‌కు కోహ్లి కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కోహ్లి ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీని కూడా గెలుచుకున్నాడు. అంతే కాదు వన్డే క్రికెట్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం కూడా అతడి సొంతమైంది. 2016 సెప్టెంబరు 21 నుంచి 2017 ముగింపు వరకు కాలాన్ని అవార్డుల ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కాలంలో కోహ్లి టెస్టుల్లో ఎనిమిది శతకాలు సహా 77.80 సగటుతో 2,203 పరుగులు సాధించాడు. వన్డేల్లో ఏడు సెంచరీలతో 1,818 పరుగులు చేశాడు. సగటు 82.23. ఈ కాలంలో కోహ్లి 153 స్ట్రైక్‌రేట్‌తో 299 టీ20 పరుగులు సాధించాడు. కెప్టెన్‌గా భారత టెస్టు జట్టును ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి తీసుకెళ్లాడు. కోహ్లి 2012లో కూడా ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద అవార్డును గెలుచుకున్నాడు. కోహ్లి కాకుండా ఈసారి ఐసీసీ టెస్ట్, వన్డే టీమ్స్ ఆఫ్ ద ఇయర్‌లో నలుగురు భారత క్రికెటర్లకు చోటు దక్కింది. టెస్టు జట్టులో పుజారా, అశ్విన్.. వన్డే జట్టులో బుమ్రా, రోహిత్ శర్మ ఉన్నారు. కోహ్లి ఐసీసీ టెస్టు జట్టు కెప్టెన్సీ రేసులో ఆస్ట్రేలియా సారథి స్టీవ్ స్మిత్‌ను వెనక్కి నెట్టడం విశేషం. ఐతే స్మిత్ ఐసీసీ టెస్టు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుతో ఊరట పొందాడు. అతడు 16 మ్యాచ్‌ల్లో 78.12 సగటుతో 1875 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్‌పై ప్రదర్శన (6/25)కు యుజ్వేంద్ర చాహల్ అత్యుత్తమ టీ20 ప్రదర్శన అవార్డును గెలుచుకున్నాడు. అఫ్గానిస్థాన్‌కు చెందిన రషీద్ ఖాన్ ఐసీసీ అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు సాధించాడు. ఉత్తమ వర్ధమాన ఆటగాడిగా హసన్ అలీ (పాకిస్థాన్), ఉత్తమ అంపైర్‌గా ఎరాస్మస్ ఎంపికయ్యారు. ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాన్ని భారత ఆటగాడు అందుకోవడం ఇది వరుసగా రెండోసారి. నిరుడు అశ్విన్ ఈ ఘనత సాధించాడు.

ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్ (2017): విరాట్ కోహ్లి (కెప్టెన్), ఎల్గర్, డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, చెతేశ్వర్ పుజారా, బెన్ స్టోక్స్, క్వింటన్ డికాక్, రవిచంద్రన్ అశ్విన్, మిచెల్ స్టార్క్, కాగిసో రబాడ, జేమ్స్ అండర్సన్


వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్ (2017): విరాట్ కోహ్లి (కెప్టెన్), డేవిడ్ వార్నర్, రోహిత్ శర్మ, బాబర్ అజామ్, ఏబీ డివిలియర్స్, క్వింటన్ డికాక్, బెన్ స్టోక్స్, ట్రెంట్ బౌల్ట్, హసన్ అలీ, రషీద్ ఖాన్, జస్‌ప్రీత్ బుమ్రా

గావస్కర్ తర్వాత విరాటే

దుబాయ్: సునీల్ గావస్కర్ తర్వాత ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 900 పాయింట్లను అందుకున్న రెండో భారతీయుడిగా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. గావస్కర్ ఆ మైలురాయిని తన 50వ టెస్టులో అందుకున్నాడు. 1979లో ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో ఆడిన ఆ మ్యాచ్‌లో సన్నీ 13, 221 పరుగులు చేశాడు. దీంతో 887 పాయింట్ల నుంచి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 916 పాయింట్లకు చేరుకున్నాడు. తన 65వ టెస్టులో, సెంచూరియన్‌లో శతకం సాధించిన కోహ్లి 880 నుంచి 900 పాయింట్ల చేరాడు. సచిన్ తెందుల్కర్, రాహుల్ ద్రవిడ్ 900 పాయింట్లకు చేరువగా వచ్చారు కానీ అందుకోలేకపోయారు. సచిన్ 2002లో 898 పాయింట్లతో, ద్రవిడ్ 2005లో 892 పాయింట్లతో నిలిచారు. టెస్టు క్రికెట్ చరిత్రలో 900 పాయింట్ల మైలురాయిని అందుకున్న 31వ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు కోహ్లి. మొత్తంగా డాన్ బ్రాడ్‌మన్ 961 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. స్టీవ్ స్మిత్ (947), లెన్ హ్యూటన్ (945), జాక్ హాబ్స్ (942) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో కోహ్లి.. విలియమ్సన్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానం సాధించాడు. స్టీవ్ స్మిత్ అగ్రస్థానంలో ఉన్నాడు. పుజారా ఓ ర్యాంకు కోల్పోయి ఆరో స్థానానికి చేరుకున్నాడు. కేఎల్ రాహుల్ ఆరు స్థానాలు నష్టపోయి 18వ స్థానంలో నిలిచాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రబాడ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఓ ర్యాంకు కోల్పోయిన అశ్విన్ ఐదో స్థానంలో ఉన్నాడు. మహ్మద్ షమి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 17వ ర్యాంకు సాధించాడు.

డిఫెన్సే రోహిత్‌ను దెబ్బతీస్తోంది

దిల్లీ: డిఫెన్స్ నైపుణ్యం లోపించడమే రోహిత్ శర్మను దెబ్బతీస్తోందని ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు డీన్ జోన్స్ అన్నాడు. "రోహిత్ సాంకేతికంగా మంచి బ్యాట్స్‌మనే. ఐతే అతడి ఆటలో లోపం అతడి డిఫెన్సే. డిఫెన్స్ నైపుణ్యం సరిగా లేకపోవడమే అతణ్ని దెబ్బతీస్తోంది. టెస్టు క్రికెట్లో 70 శాతం బ్యాటింగ్ డిఫెన్సే. వన్డేల్లో అది 40 శాతమే. డిఫెన్స్ విషయంలో గావస్కర్, రాహుల్ ద్రవిడ్, సచిన్, కోహ్లిల నుంచి రోహిత్ ప్రేరణ పొందాలి" అని జోన్స్ చెప్పాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి మినహా భారత బ్యాట్స్‌మెనెవరూ రెండు టెస్టుల్లో దక్షిణాఫ్రికా పేసర్లను సమర్థంగా ఎదుర్కోలేకపోయిన సంగతి తెలిసిందే.



భారత బౌలింగ్ ఆశ్చర్యపరిచింది



జొహానెస్‌బర్గ్: పదునైన భారత పేస్ బౌలింగ్ తమను ఆశ్చర్యపరిచిందని దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ అన్నాడు. "భారత్ నన్ను ఆకట్టుకుంది. పేస్ బౌలింగ్‌తో వాళ్లు మమ్మల్ని ఆశ్చర్యపరిచారు. ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మేం ఊహించినదాని కంటే పేస్ ఎక్కువే ఉంది" అని చెప్పాడు. అన్ని రంగాల్లోనూ తమ జట్టు మెరుగైన ప్రదర్శన చేసిందని అన్నాడు. "మా జట్టు సమష్టిగా రాణించింది. అన్ని రంగాల్లోనూ సత్తా చాటింది. బ్యాట్స్‌మెన్, ఫీల్డర్లు, బ్యాట్స్‌మెన్ మెరుగైన ప్రదర్శన చేశారు" అని డివిలియర్స్ చెప్పాడు.

భారత్ @ 102

దిల్లీ: ఫిఫా తాజాగా ప్రకటించిన ఫుట్‌బాల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ 3 స్థానాలు ఎగబాకి 102వ స్థానంలో నిలిచింది. ఆసియాలో భారత్ 14వ స్థానంలో ఉంది. గత నెలలో 13 పాయింట్లు సాధించిన భారత్ మొత్తం 333 పాయింట్లతో 102వ స్థానంలో నిలిచింది. గతేడాదిని భారత్ అజేయంగా ముగించింది. మొత్తం 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ ఏడు విజయాలు సాధించింది. రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిసాయి.

భారత్ ఓటమి

నాలుగు దేశాల హాకీ టోర్నీ

టౌరంగా: నాలుగు దేశాల హాకీ టోర్నీ తొలి మ్యాచ్‌లో జపాన్‌ను చిత్తు చిత్తు చేసిన భారత హాకీ జట్టుకు రెండో మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. గురువారం బెల్జియం చేతిలో 0-2తో పరాజయంపాలైంది. పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో విఫలమైన భారత్‌కు ఓటమి తప్పలేదు. ప్రత్యర్థి జట్టులో సెబాస్టియన్ (8వ నిమిషంలో), విక్టర్ వెగ్నేజ్ (34వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. మ్యాచ్‌లో బెల్జియం ఆటగాళ్లు పదే పదే భారత డిఫెన్స్‌లోకి దూసుకొచ్చారు. 12వ నిమిషంలో భారత్‌కు లభించిన తొలి పెనాల్టీ



కార్నర్‌ను రమన్‌దీప్ సింగ్ వృథా చేశాడు. ద్వితీయార్ధంలోనూ వచ్చిన అవకాశాలను భారత్ అందుకోలేకపోయింది. రెండో అర్ధభాగం తొలి నిమిషంలోనే భారత్‌కు మూడో పెనాల్టీ కార్నర్ లభించడంతో స్కోరు సమం చేసే అవకాశం వచ్చింది. అయితే వరుణ్‌కుమార్ కొట్టిన బంతిని ప్రత్యర్థి డిఫెండర్ అడ్డుకోవడంతో నిరాశే మిగిలింది. ఆ తర్వాత భారత్ గోల్ చేయడానికి చాలా ప్రయత్నించినా లాభం లేకపోయింది. చివర్లో భారత్‌కు మరో పెనాల్టీకార్నర్ లభించినా దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. భారత్ శనివారం న్యూజిలాండ్‌తో తలపడనుంది.

ముక్కోణపు సిరీస్ మార్చి 6 నుంచి

దిల్లీ: భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల మధ్య జరిగే ముక్కోణపు టీ20 సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. శ్రీలంకలో జరిగే ఈ సిరీస్ నిర్ణీత షెడ్యూల్ కంటే రెండు రోజులు ముందుగా మార్చి 6న ఆరంభం కానుంది. శ్రీలంక 70వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో ప్రతి జట్టు మరో రెండు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు మార్చి 18న ఫైనల్లో తలపడతాయి.

విపరీతమైన ఉక్కపోత.. తట్టుకోలేని వేడి వాతావరణం ఉన్న ఆస్ట్రేలియన్ ఓపెన్లో సీడెడ్ క్రీడాకారుల నిష్క్రమణ కొనసాగుతోంది. టైటిల్ బరిలో నిలిచిన తొమ్మిదో సీడ్ వావ్రింకా, ఏడో సీడ్ గోఫిన్, మూడో సీడ్ ముగురుజ రెండో రౌండ్లోనే ఓడిపోయారు. మరోవైపు స్విస్ గ్రేట్ రోజర్ ఫెదరర్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్, టాప్‌సీడ్ హాలెప్, షరపోవా మూడో రౌండ్లో అడుగుపెట్టారు.

వావ్రింకా ఇంటికి

- ముగురుజ, బౌచర్డ్ ఔట్
- మూడో రౌండ్లో ఫెదరర్, జకోవిచ్, షరపోవా

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్ వేడెక్కింది.. గురువారం నాలుగోరోజు కూడా సీడెడ్ క్రీడాకారుల నిష్క్రమణ కొనసాగింది. మాజీ ఛాంపియన్ స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్), ముగురుజ (స్పెయిన్) అనామక క్రీడాకారుల చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో తొమ్మిదో సీడ్ వావ్రింకా 2-6, 1-6, 4-6తో సాండ్‌గ్రిన్ (అమెరికా) చేతిలో వరుస సెట్లలో ఓడిపోయాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వావ్రింకా 9వ స్థానంలో ఉండగా.. సాండ్‌గ్రిన్ ర్యాంకు 97 కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో 11 ఏస్‌లు కొట్టిన సాండ్‌గ్రిన్.. ఐదుసార్లు వావ్రింకా సర్వీస్ బ్రేక్ చేశాడు.

రోజర్, జకో జోరు: టైటిల్ ఫేవరెట్, స్విస్ మాస్టర్ రోజర్ ఫెదరర్ మరో అడుగు ముందుకేశాడు. రెండో రౌండ్లో రోజర్ 6-4, 6-4, 7-6 (7-4)తో స్ట్రఫ్ (జర్మనీ)పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో రోజర్.. 17 ఏస్‌లతో పాటు 36 విన్నర్లు కొట్టాడు. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. మరోవైపు నొవాక్ జకోవిచ్ (సెర్బియా) కాస్త కష్టపడి నెగ్గాడు. అతను 4-6, 6-3, 6-1, 6-3తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. ఏడో సీడ్ గోఫిన్ (బెల్జియం) 6-1, 6-7 (5-7), 1-6, 6-7 (4-7)తో బెనిట్యూ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. డెల్‌పొట్రో 6-4, 7-6 (7-4), 6-7, 6-4తో కచనోవ్ (కజకస్థాన్)పై చెమటోడ్చి గెలవగా.. డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 6-7 (6-8), 3-6, 6-3, 6-2, 6-3తో కుద్లా (అమెరికా)పై కష్టపడి విజయం సాధించాడు. జ్వెరెవ్ (జర్మనీ), బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్), గాస్క్వెట్ (ఫ్రాన్స్), ఫాగ్నిని (ఇటలీ) కూడా రెండో రౌండ్ దాటారు.

షరపోవా, హాలెప్ ముందుకు: టైటిల్‌కు గట్టి పోటీదారు, స్పెయిన్ తార ముగురుజ పోరాటం రెండో రౌండ్‌కే ముగిసింది. చైనీస్ తైపీ వెటరన్ సు వీయ్ 7-6 (7-1), 6-4తో ముగురుజను ఓడించింది. ఈ మ్యాచ్‌లో 5 డబుల్‌ఫాల్ట్‌లతో పాటు నాలుగుసార్లు సర్వీసు కోల్పోయిన ముగురుజ మ్యాచ్‌ను కూడా చేజార్చుకుంది. మరోవైపు రష్యా భామ షరపోవా దూసుకెళ్తోంది. రెండో రౌండ్లో ఆమె 6-1, 7-6 (7-4)తో సెవత్సొవా (లాత్వియా)ను ఓడించింది. టాప్‌సీడ్ హాలెప్ (రుమేనియా), కెర్బర్ (జర్మనీ) సునాయస విజయాలతో మూడో రౌండ్ చేరారు. రెండో రౌండ్లో హాలెప్ 6-2, 6-2తో బౌచర్డ్ (కెనడా)ను ఓడించగా.. కెర్బర్ 6-4, 6-1తో వికిచ్ (క్రొయేషియా)ను చిత్తు చేసింది. రద్వాంస్కా (పోలెండ్), బార్టీ (ఆస్ట్రేలియా), మాడిసన్ కీస్ (అమెరికా), గర్సియా (ఫ్రాన్స్), ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్), సఫరోవా (చెక్ రిపబ్లిక్) ముందంజ వేశారు. జోనా కొంటా (బ్రిటన్), వెస్నీనా (రష్యా) తమకన్నా తక్కువ ర్యాంకు క్రీడాకారిణుల చేతుల్లో ఓడిపోయారు.

పేస్, బోపన్న జోడీల శుభారంభం: పురుషుల డబుల్స్‌లో భారత జోడీలు శుభారంభం చేశాయి. తొలి రౌండ్లో లియాండర్ పేస్-పూరవ్ రాజా 6-2, 6-3తో బాసిలాష్విలి-హైదర్ జోడీని ఓడించగా.. మరో మ్యాచ్‌లో దివిజ్ శరణ్-ఆండీ రామ్ (అమెరికా) 7-6 (7-5), 6-4తో కొపిల్-ట్రాయ్‌కిపై నెగ్గింది. రోహన్ బోపన్న-రోజర్ వెస్లిన్ (ఫ్రాన్స్) 6-2, 7-6 (7-5)తో హారిసన్-పోస్‌పిసిల్‌పై గెలిచారు.


వావ్రింకా


హాలెప్

భారత్‌పై యుద్ధానికి కుట్ర

- కశ్మీరులో ఉగ్రవాదానికి, హింసకు ఆర్థిక సాయం
- హాఫీజ్ సయీద్, సలాహుద్దీన్‌పై అభియోగపత్రం దాఖలు చేసిన ఎన్‌ఐఏ
- హురియత్ నేతలు సహా మరో పదిమందిపై కూడా
- పాక్ నుంచి హవాలా మార్గం ద్వారా నిధులు అందుతున్నట్లు వెల్లడి

దిల్లీ



హాఫీజ్ సయీద్ ★ సయ్యద్ సలావుద్దీన్

కశ్మీరులోయలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ నుంచి నిధులు అందుతున్నట్లు దర్యాప్తులో తేల్చిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఈ కేసులో గురువారం అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. లష్కరే తోయిబా అధినేత హఫీజ్ సయీద్, హిజ్బుల్ ముజాహిదీన్ అధిపతి సయ్యద్ సలాహుద్దీన్, హురియత్ నేతలు సహా 12 మందిని ఇందులో నిందితులుగా పేర్కొంటూ వారిపై చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టంలోని కఠిన నిబంధల కింద నేరపూరిత కుట్ర, దేశద్రోహం అభియోగాలను మోపింది. జమ్ముకశ్మీరులో ఉగ్రవాద, వేర్పాటువాద చర్యల ద్వారా ప్రభుత్వంపై యుద్ధానికి దిగేందుకు వీరు కుట్ర పన్నారని, కశ్మీరులోయలో సమస్యలు సృష్టించారని ఆరోపించింది. వీరిపై 12,794 పత్రాల అభియోగ పత్రంతో పాటు అనుబంధ పత్రాన్ని ఎన్‌ఐఏ న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందుతున్న వ్యవహారంపై దర్యాప్తు కొనసాగించడానికి అనుమతి కోరింది. ఈ అభియోగపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవడంపై ఈ నెల 30న నిర్ణయం తీసుకుంటానని అదనపు సెషన్స్ న్యాయమూర్తి తరుణ్ షెరావత్ చెప్పారు.

నిధులు ఎలా అందాయి?

భారత్‌లోని పాకిస్థాన్ హైకమిషన్ అధికారులు హవాలా వ్యాపారి జహూర్ అహ్మద్ షా వతలి ద్వారా వేర్పాటువాదులకు నిధులు అందజేస్తున్నారని ఎన్‌ఐఏ ఆరోపించింది. "నియంత్రణరేఖ వెంబడి చేసే వ్యాపారంలో అక్రమ లావాదేవీల ద్వారా కూడా నిధులు చేరవేస్తున్నారు. విదేశాల్లో నెలకొల్పిన నకిలీ, బోగస్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించి, జమ్ము కశ్మీర్‌లోని హురియత్ నేతల ఖాతాల్లో జమ చేస్తున్నారు." అని తెలిపింది.

ఈ నిధులతో ఏం చేశారు?

జమ్ముకశ్మీరు రాష్ట్రాన్ని వేరు చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల నుంచి అందుతున్న నిధులు, తోడ్పాటుతో నేరపూరిత కుట్ర పన్నారని, ఈ కుట్రలో భాగంగానే కశ్మీరులోయలో హింసాత్మక సంఘటనలను ప్రేరేపించారని ఎన్‌ఐఏ తెలిపింది.

గత ఏడాది మే30న కేసు నమోదు

హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన బుర్హాన్ వనీని భద్రతాబలగాలు హతమార్చిన అనంతరం కశ్మీరులోయలో తీవ్ర హింస చెలరేగిన తర్వాత గత ఏడాది మే 30న నిందితులపై ఎన్‌ఐఏ కేసు నమోదు చేసింది.

నేరాభియోగాలు నమోదయిన వారు

హఫీజ్ సయీద్, సలాహుద్దీన్, అల్తాఫ్ అహ్మద్‌షా, బషీర్ అహ్మద్ భట్, అఫ్తాబ్ అహ్మద్‌షా, నయీమ్ అహ్మద్ ఖాన్, ఫరూక్ అహ్మద్ దార్, మహ్మద్ అక్బర్ ఖాండే, రజా మెహ్రాజుద్దీన్ కల్వాల్, జహూర్ అహ్మద్ షా వతలి, కమ్రాన్ యూసుఫ్, జావేద్ అహ్మద్ భట్. వీరిలో హఫీజ్ సయీద్, సలాహుద్దీన్ మినహా అందరినీ ఎన్‌ఐఏ అరెస్టు చేసింది.

హాఫీజ్ సయీద్ 'సార్'పై చర్యలు తీసుకోలేం

తేల్చి చెప్పిన పాక్ ప్రధాని అబ్బాసీ

ఇస్లామాబాద్: ముంబయి పేలుళ్ల ప్రధాన సూత్రధారి హాఫీజ్ సయీద్‌పై పాకిస్థాన్‌లో ఏ కేసూ నమోదు కానందున తాము ఎలాంటి చర్యలూ చేపట్టలేమని పాక్ ప్రధాని షాహిద్ అబ్బాసీ స్పష్టంచేశారు. ఒక టీవీ ఛానెల్‌కు ముఖాముఖి ఇస్తూ... సయీద్‌ను సాహిబ్ (సార్)గా పేర్కొనడం విశేషం. పాక్‌లో ఏదైనా కేసుంటేనే తాము చర్యలు తీసుకోవడం వీలవుతుందని ప్రధాని చెప్పారు.

ఐరోపాను వణికిస్తున్న ప్రచండ గాలులు

బెర్లిన్: ఐరోపాలో గురువారం ప్రచండ గాలులు బీభత్సం సృష్టించాయి. ఫ్రైడెరైక్ హరికేన్ దాటికి పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఈ విపత్తులో ఆరుగురు వ్యక్తులు మరణించారు. జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, బ్రిటన్ తదితర దేశాల్లో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రహదారులపై వాహనాల ప్రమాదాలు సంభవించాయి. ఉత్తర జర్మనీలోని బ్రోకెన్‌లో గంటకు 203 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. దూర ప్రాంత రైలు సేవలన్నింటినీ జర్మనీ నిలిపివేసింది. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. చాలా పాఠశాలలను తెరవలేదు. నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డాంలోని షిపోల్ విమానాశ్రయంలో కొద్ది సేపు అన్ని విమానాలను నిలిపివేశారు. తదుపరి ప్రకటన వెలువడేంత వరకు అన్ని రైలు సేవలను నిలిపివేస్తున్నట్లు డచ్ నేషనల్ రైల్వే కంపెనీ ఎన్‌ఎస్ తెలిపింది. నెదర్లాండ్స్‌లో ట్రామ్, బస్సు సేవలు కూడా నిలిచిపోయాయి. పలువురు పాఠశాల విద్యార్థులు రవాణా సదుపాయం లేకపోవడంతో ఇళ్లకు చేరలేకపోయారు. బ్రిటన్‌లోనూ ఈ హరికేన్ దాటికి చెట్లు విరిగిపడ్డాయి.



పాక్ కాల్పుల్లో మరణించిన నీలందేవి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

పాక్ కాల్పులకు ఇద్దరు బలి

జమ్ము/దిల్లీ, న్యూస్‌టుడే: పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణను ఉల్లంఘించింది. రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. జమ్ముకశ్మీర్‌లోని జమ్ము, సాంబా జిల్లాల్లోని మూడు సెక్టార్లలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న భారత సైనిక శిబిరాలు, గ్రామాలపై బుధవారం రాత్రి పాక్ రేంజర్లు కాల్పులకు తెగబడ్డారు. ఘటనలో బీఎస్‌ఎఫ్ (సరిహద్దు భద్రత దళం) జవాను సురేష్ (42) అమరుడయ్యారు. 17ఏళ్ల బాలిక కూడా ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడుకు చెందిన సురేశ్ 1995లో బీఎస్‌ఎఫ్‌లో చేరారు. ఈ కాల్పుల్లో మరో ఐదుగురు సాధారణ పౌరులు, ఓ జవాను గాయపడ్డారు. ఇటు పాక్ కాల్పులకు బీఎస్‌ఎఫ్ సేనలు దీటుగా బదులిచ్చాయని భారత సైనికాధికారులు తెలిపారు. గురువారం ఉదయం 6.45 వరకు పాక్ వైపు నుంచి కాల్పులు కొనసాగాయని.. అనంతరం కూడా అడపాదడపా కాల్పులు చోటుచేసుకుంటునే ఉన్నాయని పేర్కొన్నారు.

గుండె లయ తప్పుతున్నా.. తమాయించుకుని

- 43 మంది ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ డ్రైవర్

అనంతపురం, న్యూస్‌టుడే: ఆపద సమయంలో ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ చూపిన స్థైర్యం, సమయస్ఫూర్తి 43 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడాయి. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ కంతేశ్వర్ గురువారం బస్సును కళ్యాణదుర్గం నుంచి తగరకుంట మీదుగా ధర్మవరానికి బయలుదేరదీశాడు. ఆ సమయంలో బస్సు నిండా ప్రయాణికులు ఉన్నారు. కనగానపల్లి మండలం ఎలకుంట్ల గ్రామం దాటాక డ్రైవర్ కంతేశ్వర్ ఛాతీలో నొప్పి మొదలై, చేయి, కాలు స్వాధీనం తప్పాయి. అయినా.. తనను తాను నియంత్రించుకుంటూనే చాకచక్యంగా ఆయన బస్సు వేగాన్ని తగ్గించి పక్కన ఆపాడు. ఈలోపు మూర్ఛ రావడంతో స్టీరింగ్‌పై వాలిపోయాడు. అదే బస్సులో వెళ్తున్న సహోద్యోగి పీవీ గోపాల్, మరొకాయన ఇది గమనించి, 108 అంబులెన్స్‌లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ కంతేశ్వర్ ఆరోగ్యం నిలకడగానే ఉంది.




బాధితుడిని పరిశీలిస్తున్న సహోద్యోగులు

కజఖ్‌స్థాన్‌లో బస్సు దగ్ధం

- 52 మంది సజీవదహనం

అస్తానా: కజఖ్‌స్తాన్‌లో ఘోరప్రమాదం చోటుచేసుకుంది. అక్తోబ్ ప్రాంతంలోని ఇర్గిజ్ జిల్లాలో ఓ బస్సులో మంటలు చెలరేగడంతో.. 52 మంది సజీవ దహనమయ్యారు. మృతులంతా ఉజ్బెకిస్థాన్ దేశస్థులు అయ్యుండొచ్చని కజఖ్‌స్థాన్ అత్యవసర సేవల శాఖ అధికారులు తెలిపారు. 55 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లతో ఈ బస్సు రష్యాకు పయనమైందని పేర్కొన్నారు. కజఖ్‌లోని షిమ్‌కెంట్ పట్టణం నుంచి 1900 కి.మీ.ల దూరంలోని రష్యా నగరం సమారాకు ఇది వెళ్తోందని తెలిపారు. ప్రమాద సమయంలో బస్సు నుంచి ఐదుగురు మాత్రమే బయటపడగలిగారని.. వారిలో క్షతగాత్రులైనవారికి వైద్య సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. బస్సు పూర్తిగా కాలిపోయందని పేర్కొన్నారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమై ఉండొచ్చని వార్తలు వచ్చినప్పటికీ.. అధికారులు ధ్రువీకరించలేదు.



అక్తోబ్ ప్రాంతంలో దగ్ధమవుతున్న కజఖ్‌స్తాన్‌కి చెందిన బస్సు



మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న మైనపు విగ్రహం కోసం సన్నీ లియోని శారీరక కొలతలు తీసుకుంటున్న ప్రదర్శనశాలకు చెందిన కళాకారిణి

'తప్పుడు వార్త'లకు ట్రంప్ పురస్కారాలు

అగ్రస్థానంలో 'న్యూయార్క్ టైమ్స్'

వాషింగ్టన్: తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నాయంటూ కొన్ని పత్రికలకు 'అత్యంత అవినీతికర, నిజాయతీరహిత' పురస్కారాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ వచ్చాక అమెరికా ఆర్థిక వ్యవస్థ పతనమై, ఇక ఎప్పటికీ కోలుకోదంటూ కథనం రాసిన 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఎన్నికల సమయంలో రష్యాను సంప్రదించాల్సిందిగా మాజీ జాతీయ భద్రత సలహాదారుడు మిఖాయిల్ ఫ్లిన్‌ను ట్రంప్ ఆదేశించారని ప్రచురించిన 'ఏబీసీ న్యూస్' కథనం ద్వితీయ స్థానంలో నిలిచింది. వికీలీక్స్ వెల్లడించిన పత్రాలు ట్రంప్‌నకు, ఆయన కుమారుడికి అందుబాటులో ఉండేవని సీఎన్ఎన్ వెలువరించిన కథనం తృతీయ స్థానం దక్కించుకొంది. ఓవల్ కార్యాలయం నుంచి మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) విగ్రహాన్ని తొలగించారని రాసిన 'టైమ్' పత్రికకు నాలుగో స్థానం, ఫ్లోరిడాలో జరిగిన సభకు జనమే లేరని పేర్కొన్న 'వాషింగ్టన్ పోస్ట్'కి చివరి స్థానం కేటాయించారు. జాబితాను రిపబ్లికన్ నేషనల్ కమిటీ వెబ్‌సైట్లోనూ చేర్చగా, కాసేపట్లోనే అది కుప్పకూలింది. నిజాయతీరహిత ప్రసార మాధ్యమాలు నిజమైన కథనాలను వెలుగులోకి తీసుకురావడం లేదని ట్రంప్ విమర్శించారు. శ్వేతసౌధం లోపలి విషయాలను చెబుతూ వెలువడిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకాన్ని టెలివిజన్ ధారావాహికగా రూపొందించే అవకాశాలున్నాయని అమెరికా ప్రసార మాధ్యమాలు పేర్కొన్నాయి.

మైక్రోవేవ్‌లతో అంత నష్టమా?

లండన్: వండిన ఆహారాన్ని.. తినే ముందు వేడి చేసుకోవడానికి వినియోగించే మైక్రోవేవ్‌లతో ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని తాజా పరిశోధన చెబుతోంది. ఐరోపా దేశాల్లో వినియోగిస్తున్న మైక్రోవేవ్‌లు ఏడాదికి 80 లక్షల టన్నుల బొగ్గుపులుసు వాయువు ఉత్పత్తికి కారణమవుతున్నాయని మాంచెస్టర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తేల్చారు. ఇది 68 లక్షల కార్లు ఏడాది కాలంలో విడుదల చేసే కాలుష్యానికి సమానమని లెక్కకట్టారు.

వ్యక్తిగత వివరాలు స్వచ్ఛందంగానే ఇస్తున్నారు

దిల్లీ: ప్రైవేటు బీమా లేదా మొబైల్ కంపెనీలకు ప్రజలు స్వచ్ఛందంగానే తమ వ్యక్తిగత వివరాలను ఇచ్చారని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ వివరాలను ఓ ప్రైవేటు సంస్థకు ఇచ్చేలా పౌరుడిపై ప్రభుత్వం ఒత్తిడి చేయజాలదన్న సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనపై ఈ మేరకు స్పందించింది. "మీకు బీమా పాలసీ కావాలి. ఒక ప్రైవేటు కంపెనీ వద్దకు వెళతారు. అలాగే మొబైల్ కనెక్షన్ కావాలంటే ప్రైవేటు సంస్థల వద్దకు వెళ్లి మీ వ్యక్తిగత సమాచారాన్ని ఇస్తారు. ఇక్కడ ప్రభుత్వం అనేక ప్రత్యామ్నాయాలను ఇచ్చింది. చిరునామా, ఇతర వివరాలకు సంబంధించిన ఆధారాలు అడగగానే మీకు ఇబ్బందులు తలెత్తుతాయి. సాధ్యం కాదని చెప్పేస్తారు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. దీనికి శ్యామ్ దివాన్ స్పందిస్తూ.. ఇష్టపూర్వకంగా వివరాలను వెల్లడిస్తే ఇబ్బంది లేదన్నారు. అయితే తనకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తికి సదరు వివరాలను ఇవ్వాలంటున్నారని, అదే ఇక్కడ సమస్య అని చెప్పారు. సదరు ప్రైవేటు కంపెనీలు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ నియంత్రణకు వెలుపల ఉంటాయన్నారు. వాటిని ఆ కంపెనీలు వాణిజ్య అవసరాలకు వాడుకునే అవకాశం ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆధార్‌లో నమోదయ్యే వారు తమ వ్యక్తిగత సమాచారాన్ని స్వచ్ఛందంగానే ఇస్తున్నట్లు సదరు పత్రంలో ఉందని చెప్పారు. అయితే ఒక వ్యక్తి కొన్ని వివరాలను తెలపడానికి ఇష్టపడకపోతే సదరు సాఫ్ట్‌వేర్.. అతడి పేరును నమోదు చేసుకోవడానికి ఇష్టపడటంలేదని చెప్పారు. అందువల్ల ఇక్కడ స్వచ్ఛందం అనే పదానికి అర్థంలేదన్నారు. ఆధార్ కార్యక్రమ చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ వాదనలు చోటుచేసుకున్నాయి.

కోర్టు కార్యకలాపాలు ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ పిటిషన్..

రాజ్యాంగపరమైన, జాతీయ స్థాయి ప్రాధాన్యత ఉన్న అంశాలపై జరిపే విచారణలను.. ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వాదనలను వినేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ఈ పిటిషన్ వేశారు. జాతీయ స్థాయి ప్రాధాన్యత ఉన్న అంశాలపై సమాచారం తెలుసుకునే హక్కు పౌరులకు ఉంటుందని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాల కోర్టులు, అంతర్జాతీయ న్యాయస్థానం కార్యాకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని.. సామాజిక మాధ్యమాల్లోనూ ఆ వీడియోలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. ప్రత్యక్షప్రసారం చేయలేని పక్షంలో.. వీడియో చిత్రీకరణైనా ఉండాలని కోరారు.

అసంతృప్త న్యాయమూర్తులతో చీఫ్ జస్టిస్ భేటీ

- సుమారు 15 నిమిషాల పాటు కొనసాగిన సమావేశం
- కేసుల కేటాయింపులపై చర్చ

దిల్లీ: తన పనితీరుపై అసమ్మతి గళం విప్పిన నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర గురువారం సమావేశమయ్యారు. న్యాయస్థాన కార్యకలాపాలు ప్రారంభమయ్యే (ఉదయం 10.30 గం.ల) సమయానికి కాస్త ముందుగా ఈ భేటీ జరిగింది. సున్నితమైన కేసుల కేటాయింపులపై వారు చర్చించుకున్నట్లు తెలిసింది. సుమారు 15 నిమిషాల పాటు సమావేశం కొనసాగినా ప్రతిష్ఠంభనను తక్షణమే పరిష్కరించుకునే దిశగా అడుగులు పడలేదని సమాచారం. అయితే, గత సమావేశం కన్నా కొంత పురోగతి కనిపించిందని, సోమవారం మళ్లీ భేటీ అయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీజేఐతో పాటు అసంతృప్త సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ మాత్రమే చర్చలో పాల్గొన్నారు. అయితే, వీరి మధ్య సంధి యత్నాలకు జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు చురుగ్గా యత్నిస్తున్నారని ఒక సీనియర్ న్యాయమూర్తికి సన్నిహితుడైన వ్యక్తి వెల్లడించారు. మరోవైపు సంప్రదింపుల్లో భాగంగా జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావులు గత వారం రోజుల్లో రెండు మార్లకుపైగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అధికార గృహానికి వెళ్లినట్లు సమాచారం.

మీడియా వార్తల నియంత్రణ కోరుతూ పిటిషన్...: నలుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తుల బహిరంగ నిరసనతో సుప్రీంకోర్టులో తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో మీడియా సంస్థలు వెలువరిస్తున్న వార్తాకథనాలు, జరుపుతున్న చర్చలు, విశ్లేషణలపై నియంత్రణ విధించాలని కోరుతూ ఓ పిటిషన్ దాఖలయ్యింది. దీనిని అత్యవసర ప్రాతిపదికన విచారణకు స్వీకరించటానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో నమోదై, విచారణ జాబితాలో చోటు దక్కిన తర్వాతే ఆ పిటిషన్‌ను పరిశీలిస్తామని పేర్కొంది.

సెలవు కోసమే.. బాలుణ్ని కత్తితో పొడిచింది

- నేరానికి పాల్పడింది 11ఏళ్ల బాలికే
- యూపీ పాఠశాలలో దాడిపై విచారణలో వెల్లడి

లఖ్‌నవూ: సంచలనం సృష్టించిన ఉత్తర్ ప్రదేశ్‌లోని పాఠశాలలో బాలుడిపై దాడి ఘటన మరో మలుపుతిరిగింది. ఎవరైనా పాఠశాలలో చనిపోతే సెలవు వస్తుందని 11ఏళ్ల బాలికే బాలుణ్ని కత్తితో పొడిచినట్లు వెలుగులోకి వచ్చింది. మరోవైపు సాక్ష్యాలను కనుమరుగు చేయాలని ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్టుచేశారు. త్రివేణి నగర్‌లోని బ్రైట్‌లాండ్ పాఠశాలలోని మరుగుదొడ్డిలో మంగళవారం బాలుడిపై ఈ దాడి జరిగిన సంగతి తెలిసిందే. బాధిత బాలుణ్ని చూసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం ఆసుపత్రికి వెళ్లారు. ఏడో తరగతి చదువుతున్న సదరు బాలికను బాలల న్యాయస్థానంలో ప్రవేశపెడతామని పోలీసులు తెలిపారు. బాధిత బాలుడి దగ్గర లభ్యమైన బాలిక తల వెంట్రుకలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపామన్నారు.

'పద్మావత్'పై నిషేధాజ్ఞలు నిలిపివేత

- అన్ని రాష్ట్రాలకూ ఇవే ఆదేశాలు వర్తిస్తాయన్న సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా 25న చిత్రం విడుదలకు మార్గం సుగమం

దిల్లీ: వివాదాస్పద చిత్రం 'పద్మావత్' ఈ నెల 25న దేశవ్యాప్తంగా విడుదలకు అవరోధాలు తొలగిపోయాయి. ఈ చిత్ర ప్రదర్శనను నిలిపివేస్తామని ప్రకటించిన రాష్ట్రాలతో పాటు మరి ఏ ఇతర రాష్ట్రం కూడా అటువంటి నిషేధాజ్ఞలు జారీచేయకుండా సుప్రీంకోర్టు ముందస్తు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చింది. శాంతిభద్రతల కారణంతో ఇప్పటి వరకు రాజస్థాన్, గుజరాత్ ప్రభుత్వాలు ఈ చిత్ర ప్రదర్శనను తమ రాష్ట్రంలో నిషేధిస్తున్నట్లు ఉత్తర్వులిచ్చాయి. హరియాణా, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు ఆ తరహా ఆదేశాలు అధికారికంగా జారీచేయకున్నప్పటికీ చిత్ర ప్రదర్శనకు అనుమతించబోమని ప్రకటించాయి. తమ చిత్ర విడుదలకు కేంద్ర చలన చిత్ర ధ్రువీకరణ మండలి (సీబీఎఫ్‌సీ) అనుమతించినా ఆయా రాష్ట్రాలు అడ్డుతగలటంపై పద్మావత్ చిత్ర నిర్మాణ సంస్థ వయాకామ్ 18 సంస్థ, నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం చిత్ర ప్రదర్శన నిషేధ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ మధ్యంతర తీర్పునిచ్చింది. దేశంలోని మిగిలిన రాష్ట్రాలూ ఆ తరహా ఉత్తర్వులివ్వకుండా నిరోధించింది. శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు సభ్యులుగా ఉన్న ఈ ధర్మాసనం స్పష్టం చేసింది. అంతకుముందు చిత్ర నిర్మాణ సంస్థ తరపున సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ..సీబీఎఫ్‌సీ సినిమా విడుదలకు అనుమతించిన తర్వాత ఏ రాష్ట్రానికీ ఆ చిత్రాన్ని అడ్డుకునే అధికారం ఉండదన్నారు. రాజస్థాన్, గుజరాత్, హరియాణా ప్రభుత్వాల తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. 'పద్మావత్' చిత్రంపై విచారణను శుక్రవారం లేదా జనవరి 22న చేపట్టాలని కోరగా ధర్మాసనం అందుకు అనుమతించలేదు. విచారణను మార్చి నెలకి వాయిదా వేసింది.

మన్మోహన్ ఎందుకు మౌనం దాల్చారో..

- టెలికాం విధానంపై మాజీ ప్రధాని తీరుని ప్రశ్నించిన ఎ.రాజా
- వ్యాపార ప్రయోజనాలకు కొమ్ముకాసేలా లేఖ రాశారని ఆరోపణ
- మాజీ కాగ్ వినోద్‌రాయ్‌పైనా తీవ్ర విమర్శలతో పుస్తకం విడుదల



దిల్లీ: ప్రధానిగా ఉన్నప్పుడు స్వయంగా టెలికాం విధానానికి ఆమోదం తెలిపిన మన్మోహన్‌సింగ్... ఆ తర్వాత దానిని సమర్థించుకొనే విషయంలో 'విస్పష్టమైన మౌనం' ఎందుకు దాల్చారని టెలికాం శాఖ మాజీ మంత్రి ఎ.రాజా ప్రశ్నించారు. కుంభకోణం కేసులో నిర్దోషిగా ఇటీవల విడుదలైన రాజా '2జి సాగా అన్‌ఫోల్డ్స్' పేరుతో ఓ పుస్తకం వెలువరించారు. మాజీ కాగ్ వినోద్‌రాయ్‌ని కూడా ఆయన తప్పుపట్టారు. రాజ్యాంగపరమైన విధుల నిర్వహణలో రాయ్ అత్యుత్సాహం ప్రదర్శించి, పరిధిని అతిక్రమించారని ఆరోపించారు. కేసులో సాక్షిగా రాయ్‌ని పిలవాలనీ, అప్పుడు ఆయన్ని ప్రశ్నించేందుకు తమకు అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.1.76 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాయ్ చెప్పడం ప్రజల గుండెల్లో నాటుకుని మొత్తం ఉపద్రవానికి కారణమయిందన్నారు. 'స్పెక్ట్రంను కొత్త సంస్థలకు కేటాయించడానికి మన్మోహన్ అనుమతి పొందాను. సింగ్‌ను ఆయన సలహాదారులు తప్పుదారి పట్టించారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని టెలికాం లాబీలు ప్రభావితం చేశాయ'ని చెప్పారు.

సీబీఐ దాడుల గురించీ ఆయనకు తెలియదు: స్పెక్ట్రం కేటాయింపులకు సంబంధించి సీబీఐ సోదాల గురించి తాను చెప్పగానే మన్మోహన్ ఆశ్చర్యపోయారనీ, అంతవరకు ఆయనకు ఆ విషయమే తెలియదని రాజా పేర్కొన్నారు. యూపీఏ-2 ప్రభుత్వాన్ని అంతమొందించడానికి రాజకీయ దురుద్దేశపూరిత ప్రయత్నాలు జరిగాయనేది తన విశ్వాసమనీ, దీనికి ఆయుధంగా వినోద్‌రాయ్‌ని వాడుకున్నారనీ చెప్పారు. కొత్త సంస్థలకు లైసెన్సులు ఇవ్వడానికి టెలికాం లాబీలు పూర్తిగా వ్యతిరేకమనీ, విధానం దాదాపు తుదిరూపు సంతరించుకుంటున్న సమయంలో మన్మోహన్ నుంచి వచ్చిన లేఖ... ఆ లాబీల వ్యాపార ప్రయోజనాలకు కొమ్ముకాసేదిగా ఉందని వివరించారు. 'ప్రధాని సంతకంతో అలాంటి లేఖ వచ్చి ఉండాల్సిందే కాదు. నిర్వహణపరమైన విధానాలు, మార్గదర్శకాలను మంత్రిత్వశాఖ చూసుకోవాల్సి ఉండగా మన్మోహన్ నుంచి వాటిపై లేఖ రావడమంటే అది పీఎంవోలోనే రూపొందిందా అని ఆశ్చర్యపోయాన'న్నారు.

చరవాణులను 'ఫ్లైట్ మోడ్'లో ఉపయోగించుకోండి

బీజింగ్: విమాన ప్రయాణాల్లో చరవాణుల వినియోగంపై ఉన్న పూర్తిస్థాయి నిషేధాన్ని చైనా విమానయాన సంస్థలు క్రమంగా ఎత్తివేస్తున్నాయి. చరవాణులను 'ఫ్లైట్ మోడ్'లో ఉంచి ప్రయాణంలో ఉపయోగించుకునేందుకు గురువారం నుంచి అనుమతిస్తున్నట్లు చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్, హైనన్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రకటించాయి. టాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా అంతర్జాల సేవలనూ పొందవచ్చునని తెలిపాయి. వచ్చే నెల నుంచి 'ఫ్లైట్ మోడ్'లో చరవాణులను ఉపయోగించేందుకు తాము అనుమతించనున్నట్లు స్ప్రింగ్ ఎయిర్‌లైన్స్ పేర్కొంది.

రూ.పది లక్షలు విలువైన అమెరికా నోట్లతో పట్టుబడ్డ ఆఫ్రికన్

దిల్లీ, కాన్పూర్: దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.10 లక్షల విలువైన అమెరికా నోట్లతో తిరుగుతున్న విదేశీయుడు బుధవారం రాత్రి భద్రతా బలగాలకు చిక్కాడు. ఇతణ్ని ఆఫ్రికా దేశం ఐవరీకోస్ట్‌కు చెందిన కే జస్టిన్‌గా గుర్తించారు. ఇతడు మత్తుమందుల సరఫరాదారుడు అయ్యుండొచ్చని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) అధికారులు అనుమానిస్తున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతుంటే జస్టిన్‌ను పట్టుకున్నామని, పోలీసులకు అతణ్ని అప్పగించామని వారు వెల్లడించారు.

భారీగా పాతనోట్ల అక్రమ మార్పిడి కేసులో... ఆర్బీఐ అధికారులపైనా దర్యాప్తు!: భారీ స్థాయిలో రూ.97 కోట్లు విలువైన రద్దయిన పాతనోట్లను అక్రమంగా మార్చేందుకు యత్నించిన ముఠా వెనుక బ్యాంకు అధికారుల ప్రమేయం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు చెందిన కాన్పూర్ శాఖ అధికారులపైనా దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఎస్‌పీ అఖిలేశ్ కుమార్ తెలిపారు. ఆనంద్ ఖత్రీఅనే బిల్డర్ నివాసంలో ఈ నగదును ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి 16 మందిని అరెస్టుచేశారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోటేశ్వరావు అనే వ్యక్తీ ఉన్నారు.

కుంభమేళా ఖర్చు మాటేంటి: అసదుద్దీన్

హైదరాబాద్: ముస్లిం బాలికలకు ఉపకారవేతనాల కోసం రూ.2వేల కోట్లు ఇస్తామన్న హామీని మోదీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ అన్నారు. హజ్‌యాత్రకు రాయితీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంపై ఆయన మాట్లాడుతూ కుంభమేళా వంటి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఖర్చు పెడుతున్న నిధుల మాటేమిటని ప్రశ్నించారు. కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చార్‌ధామ్ యాత్ర కోసం ఒక్కొక్కరికీ రూ.20వేలు కేటాయిస్తోందని అన్నారు. బుధవారం సంచికలో ప్రచురితమైన ఆయన విమర్శల వార్తలో పొరపాటున అసదుద్దీన్ పేరు రాలేదు. అయోధ్య, కాశీ, మథుర తదితర దేవస్థాన పట్టణాలకు తీర్థయాత్రలపై ఉత్తర్‌ప్రదేశ్ నిధులివ్వడం ఎప్పుడు ఆపుతుందో చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు.

రథసప్తమికి తిరుమలలో ప్రత్యేక దర్శనాలు రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: రథసప్తమి పర్వదినం సందర్భంగా ఈనెల 24న తిరుమల శ్రీవారికి అన్ని రకాల ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. ఆ రోజు స్వామివారు వేకువ జామున 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సప్తవాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు.

స్వర్గంలో కుదిరిన భాగస్వామ్యం

- భారత్-ఇజ్రాయెల్ సంబంధాలపై నెతన్యాహు
- ముంబయిలో పారిశ్రామికవేత్తలతో భేటీ

ముంబయి: భారత్-ఇజ్రాయెల్ సంబంధాలను దివిలో కుదిరిన భాగస్వామ్యంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అభివర్ణించారు. తన పర్యటనలో చివరిరోజైన గురువారం ఆయన ముంబయిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రముఖులు, బాలీవుడ్ ప్రతినిధులు, యూదు వర్గ ప్రజలతో సమావేశమయ్యారు. తాజ్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. భారత్-ఇజ్రాయెల్ వాణిజ్య సదస్సులో మాట్లాడారు. రెండు దేశాల భాగస్వామ్యం అద్భుతాలు చేస్తోందని ఈ సందర్భంగా నెతన్యాహు చెప్పారు. "మనవి ఈ భూగోళంపై అతి పురాతన సంస్కృతులు. మన ప్రేమను స్వేచ్ఛ కోసం పంచుతాం. మానవత్వం కోసం పంచుతాం. మేము మీకు నిజమైన భాగస్వాములం. ఈ భాగస్వామ్యం స్వర్గంలో కుదిరిన భాగస్వామ్యం." అని అన్నారు. నవ్యావిష్కరణలపై దృష్టి పెట్టాలని వ్యాపారవేత్తలకు సూచించారు. భారత ప్రధాని మోదీతో తనకున్న వ్యక్తిగత స్నేహం గురించి చెప్పారు. అల్పాహార విందు భేటీలో అజయ్ పీరామల్, రాహుల్ బజాజ్, ఆది గోద్రెజ్, హర్ష్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర, దిలీప్ సంఘ్వి, అశోక్ హిందూజ, అతుల్ పుంజ్, చందాకొచ్చర్ తదితరులు పాల్గొన్నారు. 26/11 ఉగ్రదాడుల బాధితుల స్మారకాన్ని సందర్శించిన నెతన్యాహు.. అక్కడ పూలహారాన్ని ఉంచారు. ఆ నాటిదాడిలో ప్రాణాలతో బయటపడ్డ యూదు వర్గానికి చెందిన బాలుడు మోషె హోల్జ్‌బర్గ్‌ను కలుసుకున్నారు. ఆ దాడిలో బాలుడి తల్లిదండ్రులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు మోషె వయస్సు రెండేళ్లు. చాబాద్‌హౌస్ కార్యక్రమంలో హాజరయిన యూదు ప్రజలను ఉద్దేశించి ఇజ్రాయెల్ ప్రధాని హీబ్రూలో ప్రసంగించారు. ఉగ్రవాదుల నుంచి తాను తప్పించుకోవడం ఒక అద్భుతమని మోషె అన్నాడు. ప్రస్తుతం అతని వయస్సు 11 ఏళ్లు. ఇజ్రాయెల్ నుంచి భారత్‌కు తన వెంట తీసుకొస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నందుకు నెతన్యాహుకు ధన్యవాదాలు తెలిపాడు. షాలోమ్ బాలీవుడ్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో హిందీ చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రతినిధులను కలుసుకున్నారు. మరోవైపు నెతన్యాహు పర్యటనకు వ్యతిరేకంగా దక్షిణ ముంబయిలోని బైకుల్లా ప్రాంతంలో ముస్లింలు నిరసన ప్రదర్శన నిర్వహించారు.



మోషేను ముద్దాడుతున్న నెతన్యాహు

న్యూజెర్సీ అటార్నీ జనరల్‌గా గుర్బీర్ గ్రేవాల్

న్యూయార్క్: అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్ర అటార్నీ జనరల్‌గా ప్రముఖ భారతీయ-అమెరికన్ న్యాయవాది గుర్బీర్ ఎస్ గ్రేవాల్(44) నియమితులయ్యారు. ఆయన నామినేషన్‌ను సెనేట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అమెరికాలో ఓ రాష్ట్రానికి అటార్నీ జనరల్‌గా నియమితులైన తొలి సిక్కు వ్యక్తి గ్రేవాల్ కావడం గమనార్హం.

ఈడీ ఎదుట హాజరైన కార్తీ చిదంబరం

దిల్లీ: కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. అక్రమ నగదు చలామణి కేసులో హాజరుకావాల్సిందిగా ఈడీ ఇటీవల సమన్లు జారీ చేసింది.

విద్యుత్ ఉన్నా.. కోతలే!

- కొనడానికి ముందుకురాని వివిధ రాష్ట్రాలు
- స్థాపిత ఉత్పత్తి సామర్థ్యంలో సగమే వినియోగం
- జలవిద్యుదుత్పత్తిలో 21వ స్థానంలో తెలంగాణ
- 'థర్మల్'లో వెనకబడిన తెలుగు రాష్ట్రాలు
- సీఈఏ తాజా నివేదికలో వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: దేశంలో అన్ని రకాల విద్యుత్కేంద్రాల స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 3.30 లక్షల మెగావాట్లను దాటినా.. వినియోగం అందులో సగంలోపే ఉందని కేంద్రీయ విద్యుత్ మండలి (సీఈఏ) తాజా నివేదికలో వెల్లడించింది. దేశ ప్రజల రోజూవారీ వినియోగం లక్షా 61 వేల మెగావాట్లు మాత్రమే. మరోవైపు స్థాపిత సామర్థ్యంలో ఉత్పత్తి 60 శాతం మేర ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో గత 9 నెలల విద్యుదుత్పత్తి, వినియోగంపై తాజా గణాంకాలను మండలి వివరించింది. ఈ నేపథ్యంలో కొనేందుకు విద్యుత్ అందుబాటులో ఉన్నా.. సరిగా విద్యుత్ సరఫరా చేయకుండా కోతలు విధించే వివిధ రాష్ట్రాల పంపిణీ సంస్థ (డిస్కం)లపై న్యాయపరంగా పోరాడేందుకు వినియోగదారులకు అవకాశమిచ్చేలా విద్యుత్ చట్టంలో సవరణకు కేంద్రం ప్రయత్నాలు ప్రారంభించనుంది.

నివేదికలోని అంశాలు..

- థర్మల్ విద్యుదుత్పత్తిలో తెలుగు రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయి.
- జల విద్యుదుత్పత్తిలో దేశంలో తెలంగాణ 21వ స్థానంలో ఉంది. కృష్ణానదికి గత వానాకాలంలో సరిగా వరదలు రాకపోవడమే ఇందుకు కారణం. ఈ ఏడాది మొత్తం 4,440 మెగావాట్ల జల విద్యుదుత్పత్తి లక్ష్యానికిగాను కేవలం 1,514 మెగావాట్లు మాత్రమే తెలంగాణ జెన్‌కో సాధించింది.
- ఒక విద్యుత్కేంద్రం పూర్తి ఉత్పత్తి సామర్థ్యంలో ఎంత మేర ఉత్పత్తి చేశారనే శాతాన్ని 'ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్' (పీఎల్ఎఫ్) అంటారు. 2016-17తో పోలిస్తే ఈ ఏడాది జాతీయ సగటు పీఎల్ఎఫ్ తొలి 9 నెలల్లో 60.50 నుంచి 59.69 శాతానికి తగ్గింది.
- తెలంగాణ జల విద్యుత్కేంద్రాల పీఎల్ఎఫ్ 55.25, ఏపీలో 60.36 శాతముంది.
- థర్మల్ కేంద్రాల పరిస్థితి దారుణంగా ఉంది. సౌర, పవన విద్యుదుత్పత్తి పెరుగుతున్నందున థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి పెంచడానికి సాధ్యం కావడం లేదు.
- పలు రాష్ట్రాల్లో విద్యుత్ డిమాండ్ లేనందున థర్మల్ కేంద్రాల్లో రోజూవారీ ఉత్పత్తిని కొంతసేపయినా ఆపివేస్తున్నారు. దీనివల్ల వాటి పీఎల్ఎఫ్ చాలా తక్కువగా ఉంటోంది.
- దేశంలోకెల్లా అత్యధికంగా 90.19 పీఎల్ఎఫ్‌తో సింగరేణి విద్యుత్కేంద్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ కేంద్రాల నుంచి అతి తక్కువ ధరకు విద్యుత్ వస్తున్నందున వీటిలో ఉత్పత్తి ఆపకుండా నిరంతరం నడిపేందుకు 'దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ లోడ్ డిస్పాచ్ కేంద్రం' ఉత్తర్వులిచ్చింది. ఈ కేంద్రాలను నిరంతరం నడుపడంతో పీఎల్ఎఫ్ పెరిగింది.
- పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే రెట్టింపు స్థాయి విద్యుత్‌ను ఉత్పత్తిచేసే థర్మల్ కేంద్రాలున్నాయి. ఆ రాష్ట్రంలో 5773 మెగావాట్ల థర్మల్‌కేంద్రాలున్నా 62.17 శాతమే పీఎల్ఎఫ్ ఉంది. యూపీతోపాటు బిహార్‌లో సైతం విద్యుత్ అందుబాటులో ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వాలు కొనకపోవడంతో కరెంటు కోతలు తప్పడం లేదు. ఇలాంటి రాష్ట్రాల డిస్కంలను దారిలోకి తెచ్చేందుకే విద్యుత్ చట్ట సవరణకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది.

జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభం

కవాడిగూడ, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి మైదానంలో గురువారం జాతీయ పుస్తక ప్రదర్శన మొదలయింది. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ గంటా చక్రపాణి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక అధికారి దేశపతి శ్రీనివాస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, జాతీయ పుస్తక ప్రదర్శన కమిటీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ సమాజం ఉన్నంత వరకు పుస్తకం జీవించి ఉంటుందన్నారు. టీవీ మాధ్యమం వచ్చి మెదడు సామర్థ్యాన్ని దెబ్బ తీస్తోందనుకుంటే.. సెల్‌ఫోన్లు వచ్చి అంతకంటే ప్రమాదకరంగా మారాయని అన్నారు. ఎవ్వరిని చూసినా, ఎక్కడ చూసినా సెల్‌ఫోన్‌లోనే గడిపేస్తుండటం విచారం కలిగిస్తోందన్నారు.



జ్యోతి వెలిగించి పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, చిత్రంలో గంటా చక్రపాణి, అల్లం నారాయణ, నందిని సిధారెడ్డి తదితరులు

కాకినాడ నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేకరైళ్లు

ఈనాడు, హైదరాబాద్: కాకినాడ నుంచి సికింద్రాబాద్‌కు 20, 21 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

జిగ్నేశ్‌కు తెలంగాణపై అవగాహన లేదు

- కాంగ్రెస్ ఏజెంటుగా మాట్లాడారు
- ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి

ఈనాడు, హైదరాబాద్: గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానికి తెలంగాణ గురించి కనీస అవగాహన లేదనీ, కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు విని ప్రభుత్వంపై విమర్శలు చేశారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మాట్లాడుతూ- రాష్ట్రంలో సంపూర్ణ ప్రజాస్వామ్య ప్రభుత్వం నడుస్తోందని, ప్రభుత్వం అన్నివర్గాలకు అండగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా జిగ్నేశ్ ఇక్కడికి వచ్చి పోలీసు రాజ్యం నడుస్తోందని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మందకృష్ణ అంబేడ్కర్ సిద్ధాంతాన్ని వదిలి దాడులకు పూనుకుంటుంటే... జిగ్నేశ్ వచ్చి మద్దతు తెలపడం దారుణమన్నారు. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ గురించి కాకుండా, వ్యక్తిగత ఎజెండాతో పోతున్నారన్నారు. ఆయనతో వర్గీకరణ సాధ్యంకాదని దళితులందరికీ తెలిసిపోయిందనీ, అందుకే తామంతా వర్గీకరణ కోసం పోరాడుతున్నామన్నారు. జిగ్నేశ్‌ను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కలవడంలో రాజకీయం లేదనీ, గురుకులాల సమాచారం కోరడంతో ఆయనకు ఇచ్చారని చెప్పారు.



పేదలతో సూర్యనారాయణ ఆచారి

250 కుటుంబాలకు ఇళ్లస్థలాలు

ఒడిశాలో ఓ వ్యక్తి ఉదారత

జయపురం, న్యూస్‌టుడే: భూ కబ్జాలు సర్వసాధారణ విషయంగా మారిపోతున్న ఈ రోజుల్లో ఓ వ్యక్తి 250 కుటుంబాలకు ఇళ్లస్థలాలు దానంగా ఇచ్చి తన ఉదారతను చాటుకున్నారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా జయపురం సొంబారుతోటలో శ్రీమద్విరాట్ పోతులూరు విరాట్ బ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రధాన ధర్మకర్త ఎం.సూర్యనారాయణ ఆచారి ఈ భూదానం చేశారు. గురువారం సాయంత్రం జగన్నాథపూర్ మౌజాలోని బ్రాహ్మిణి గ్రామం ప్రాంతంలో 250 కుటుంబాలకు 30 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పున్న ఇళ్లస్థలాలను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు రూ.4 కోట్ల విలువైన 3ఎకరాల స్థలానికి సంబంధించి ఎవరికి వారికి పట్టాల రూపంలో స్వయంగా అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండడానికి అందరూ ప్రయత్నించాలని ఈ సందర్భంగా సూర్యనారాయణ ఆచారి పేర్కొన్నారు. తనకున్న ఆస్తిలో కొంత భాగాన్ని ఈ విధంగా పేదలకు దానం చేశానని వివరించారు.

ఒడిశాలో భార్య, కుమార్తెల సజీవ దహనం

జయపురం, న్యూస్‌టుడే: భార్య, కుమార్తెలను ఓ కిరాతకుడు నడిరోడ్డుపై దహనం చేసిన ఉదంతం ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన గురువారం కొసాగుమ్డ సమితి కొడింగా పోలీసుస్టేషన్ పరిధిలోని చిరుమా గ్రామంలో జరిగింది. టంకధర్ జాని(60) తన ఆరో భార్య లీలాబాత్రా(18)ను నిత్యం అనుమానిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున భార్య, కుమార్తె(6 నెలలు)లను తీవ్రంగా కొట్టి ఇంటి బయటకు తీసుకొచ్చి రోడ్డుపైనే కిరోసిన్ పోసి దహనం చేశాడు. వారి ఆర్తనాలు విని ప్రజలు అక్కడకు చేరుకొనేలోపు ఇద్దరూ విగతజీవులుగా మారారు. ప్రజలు దాడి చేస్తారనే అనుమానంతో టంకధర్ కొడింగా పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. గతంలో ఇతని వేధింపులను తట్టుకోలేక ఐదుగురు భార్యలు విడిచి వెళ్లిపోయారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00